- శ్రీమదాంధ్ర మహాభారతములో సరస్వతీ ప్రస్తావనలు
- సంకీర్తనల్లో అన్నమయ్య లోకజ్ఞత
- బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటువు
- తెలంగాణ కథ - వస్తురూప వైవిధ్యం
- ప్రాచీన భారతీయ జ్ఞానం - ఆధునిక విజ్ఞానపు మేలు కలయిక
- సాహితీ పురస్కార నవలలు - తెలంగాణ జీవన నేపథ్యం
- తిల్లా గోవిందమ్మ
- తుమ్మూరి పద్మనాభ శర్మ

# మూసీ
# MUSI

• Samputi : 26 • Sanchika : 01 • Pages : 64 • Rs. 20
• November 2022



మూసీ 25 వసంతాలు

UGC Care List
Approved Journal











వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 26 సంచిక : 1
నవంబర్ - 2022
'శుభకృత్' కార్తీక మాసం
**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
SAGI KAMALAKARA SHARMA
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

ISSN 2457-0796



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

శ్రీమదాంధ్ర మహాభారతములో సరస్వతీ ప్రస్తావనలు ... శ్రీవైష్ణవ వేణుగోపాల్ 7
పద్య మనోహరం - 36 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 12
యశోద వెంట (బందారం కథలు -12) ... డా. నందిని సిధారెడ్డి 13
సంకీర్తనల్లో అన్నమయ్య లోకజ్ఞత ... డా. ఏలె విజయలక్ష్మి 17
భారతీయీకరణ6 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 21
బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటువు (గ్రంథాంతరంగం-18) ... ఘట్టమరాజు 23
తెలంగాణ కథ - వస్తురూప వైవిధ్యం ... డా. కసప నరేందర్ 27
ప్రాచీన భారతీయ జ్ఞానం - ఆధునిక శాస్త్రాల విజ్ఞానపు మేలు కలయిక : జాతీయ విద్యావిధానం - 2020... డా. సురేశ్ ఎనుగంటి, డా. రవి సబావత్ 31
సాహితీ పురస్కార నవలలు - తెలంగాణ జీవన నేపథ్యం ... డా. లింగాల మంగమ్మ 34
తిల్లా గోవిందమ్మ ... ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి 40
తుమ్మూరి పద్మనాభ శర్మ ... డా. పెబ్బేటి మల్లికార్జున్ 47
సూత్రధారులు (కె. విశ్వనాథ్ చిత్రాలు -సామాజిక అవలోకనం : 27).. టి. లక్ష్మీనారాయణ 49

### కవితలు

పాదరక్షలు ... అమరవాది రాజశేఖర శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; మునుగోడు కుత కుత ... డా. వి. రవిశంకర ప్రజాపతి; స్వర్గమేది-నరకమేది ... మురళీ బాసా - 39; ఒక హిజాబ్ గీతం ... కోటం చంద్రశేఖర్ - 46; అనల గీతం ... కోట్ల వెంకటేశ్వర రెడ్డి - 54; బ్రహ్మజెముడు ... డా. కందుల శ్రీను - 57; దివ్య దీపావళి ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 60; వెలికుండ ... చంపావతి - 62.

### సమీక్షలు

వ్యక్తిత్వ వికాస రేఖలు - దోరవేటి చె(అ)న్నయ్య లేఖలు... సాగర్ల సత్తయ్య 53
షట్చక్రవర్తి చరిత్ర (ప్రబంధం) - ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారి వ్యాఖ్యానం : అనుశీలన... గురిజాల రామశేషయ్య 55
తెలుగు పరిశోధన గ్రంథాల 'సారాంశం' ... డా. టి. శ్రీరంగస్వామి 58
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# గ్రహణం

గృహ్యేతే సూర్యాచంద్రమసావనేన గ్రహః – గ్రహ ఉపాదానే. దీనిచేత సూర్య చంద్రులు గ్రహింపబడుదురు. గ్రహణం గ్రహః, గ్రాహశ్చ. గ్రహ ఉపాదానే. పుచ్చుకొనుట గ్రహము, గ్రాహము. గ్రహ శబ్దము నిర్బంధమునకును, సూర్య చంద్ర గ్రహణములకును, సూర్యాది నవ గ్రహములకును పేరు. నిర్బంధమనగా పట్టుట యని కొందఱు. గృహ్ణాతీతి గ్రహణం, గృహ్యాత ఇతి చ గ్రహం. గ్రహ ఉపాదానే. పట్టును గనుకను, పట్టుట గనుకను, పట్టబడును గనుకను గ్రహము. "గ్రహోఽనుగ్రహ నిర్బంధ గ్రహణేషు రణోద్యమే, సూర్యాదౌ పూతనాదౌ చ సైంహికేయో పరాగయో" రితి శేషః.

పట్టుకోవడం గ్రహానికి, గ్రహణానికి సంకేతంగా భావించబడుతుంది. గ్రాహము అనే శబ్దం కూడా మొసలి లాంటి వానికి వినియోగించబడుతుంది. పాణిగ్రహణం వంటి అంశాలు ప్రత్యేకంగా మాట్లాడుతున్నవే. గ్రహణ శబ్దం తెలుసుకోవడం, పట్టుకోవడం వంటి అంశాలను వివరించింది.

ప్రస్తుతం మనం గ్రహణ శబ్దాన్ని బాగా వింటున్నాం. భూమి మీద ఉన్న మనం, ఎవరి చుట్టూ భూమి తిరుగుతుందో దానికి, ఎవరు భూమి చుట్టూ నిరంతరం తిరుగుతున్నారో దానికి ప్రత్యేకంగా బాధ్యత వహించాల్సి వస్తుంది. ఈ తిరిగే వ్యవస్థను అధ్యయనం చేసిందే భారతీయ పంచాంగం. భూమి, సూర్యుడు, చంద్రుల సంచార క్రమంలో ఒకదాని నీడ మరొదాని మీద పడటం, అందులోనూ ఒక ప్రత్యేకమైన సందర్భంలో పడటం వల్ల దానిని గ్రహణం అనే శబ్దంతో వినియోగిస్తుంది. ఆ సెన్సిటివ్ పాయింట్స్‌కు రాహు కేతువులనే పేరు పెట్టింది భారతీయ పురాణం. భూమి శరీరానికి, సూర్యుడు ఆత్మకు, చంద్రుడు మనస్సుకు సంకేతాలుగా ఉంటారు. ఈ మూడు ఒకే సరళరేఖలో ఉన్నప్పుడు శక్తి ప్రసారం బాగా ఉంటుంది. అదేవిధంగా గ్రహణ సమయంలో సూర్యుడో, చంద్రుడో కనిపించనపుడు ఆ శక్తి తగ్గుతుంది. ఆ శక్తిని మళ్ళీ ప్రకృతి, వ్యక్తి తిరిగి సాధించు కోవాలి. ఈ సాధన సాధ్యం కాకపోతే అటు ప్రకృతికి, ఇటు వ్యక్తికి సమస్యలు వస్తూనే ఉంటాయి. అందుకే ఆ సమయంలో మనస్సును కేంద్రీకరించడం అవసరం. ధ్యాన మార్గమే శరణ్యం. ఇతరమైన పనులన్నీ పక్కకు పెట్టి భూమికి మేలు కలగడానికి, మన శక్తిని మరింతగా పెంచుకోవడానికి ఈ సమయాల్లో అధికంగా ధ్యానం చేయాలని భారతీయ విజ్ఞానం సూచించింది. అన్ని పనులను ఆ సమయంలో ఆపించింది. ఇది అంత వ్యతిరేకంగా చూడాల్సిన అంశమేమీ కాదు.

గ్రహణం అంటే పట్టుకోవడం అనే భావాన్ని రూఢి చేసుకుంటే... ఏది పట్టుకోవాలి, ఏది వదులు కోవాలి అనే అంశంపై దృష్టి సారించాలి. పట్టుకోవడం వల్ల ఎప్పటికీ సమస్యలే ఉంటాయి. వదులు కోవడమొక్కటే శ్రేయోదాయకం. ఒక వేళ పట్టుకున్నా మనకన్నా అత్యున్నత శక్తిని నిరంతరం పట్టుకొని ఉండడం ద్వారా ఆ శక్తిగా మనం మారే అవకాశం కలుగుతుంది. శక్తి లేనివానిని పట్టుకుంటే మన శక్తిని వానికి ఇవ్వాలి. మన కన్నా ఉన్నత శక్తిని పట్టుకుంటే అక్కడ నుండి మనకు శక్తి సరఫరా అవుతూ ఉంటుంది. (ఫోన్ ఛార్జింగ్ పెట్టుకున్నట్లు). బలహీనతలను పట్టుకుంటే తొందరగా ఉన్న శక్తి కూడా వెళ్ళిపోతుంది. అందుకే వివేకానందుడు కూడా 'బలముపాస్వ' అంటాడు. బలాన్ని ఉపాసించాలి. అన్నిటి కన్నా వదులుకునేది, బలమైనది ఏమిటో తెలుసుకునే దానికే జ్ఞానం అని పేరు. తెలిసిన జ్ఞానం ద్వారా అజ్ఞానాన్ని, దాని సంబంధమైన మాయను, వస్తుజాలాన్ని, ప్రపంచాన్ని వదులుకునే ప్రయత్నం చేయడమే అసలైన జ్ఞానం. పట్టుకోవలసిన దానిని పట్టుకుంటేనే, గ్రహిస్తేనే ఈ ప్రత్యేకమైన స్థితి సాధ్యం అవుతుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1

UGC Care List Approved Journal
హైదరాబాద్ నవంబర్ : 2022

# పాద రక్షలు

దేహమే దివ్య రథము సందేహ మేల
పాద యుగళము చక్రాల పగిది గాదె
జీవయాత్రను సాగించు దేవుడైన
పాదరక్షల ధరియించ మోదమగును

పరుల సొమ్మును దోచెడి ప్రాజ్ఞులకును
పరుల వనితల కామించు ప్రముఖులకును
పరుల మోసము జేసెడి ప్రభువులకును
పాదరక్షల సత్కార భాగ్యమబ్బు

కంటకము నుండి రక్షించు కరుణ లోక
కంటకుల నుండి రక్షించు నంట భువిని
జంట బాయక కలిసిన జంటయన్న
పాదరక్షలే! మనిషికి మోదమిడును.

ఎండకాలము బొబ్బల వెక్కకుండ
వానకాలము బురదలో నానకుండ
వణుకు కాలము నరికాళ్ళు పగలకుండ
పాదరక్షలు రక్షించు వసుధ యందు

చెప్పులను పేర మార్కెట్ల నొప్పుగుండు
సైండిలని కూడ దొరుకును చక్కనైన
షూల పేరిట కనిపించు చూడుమింక
పాదరక్షలై యొప్పారు పది రకాలు

గురువు పాదాల నంటిన కరుణ కన్న
వారి పాదరక్షలు గని చేరి మ్రొక్క
గొప్ప సుకృతమటంచన నొప్పుగాదె
పరమ పున్నెపు రాశి ఈ పాదరక్ష

పదునాల్గేడులు కరుణన
ముదమిడి పరిపాలనంబు ముద్దుగ జేసెన్
అదె నంది గ్రామ మందున
పదిలముగా రామ పాద పాదుకలంతన్

---

అమరవాది రాజశేఖర శర్మ
ఫోన్ : 98489 96559







# మునుగోడు కుత కుత .....




కుతకుత ఉడుకుతున్నది మునుగోడు
ఉవ్వెత్తున సాగుతూ ప్రసంగాల హోరు
నువ్వా నేనా అంటూ పార్టీ అభ్యర్థులు
గుప్పిస్తూ ప్రచారంలోన పలు హామీలు

దసరా దీపావళి పండుగలకు తోడుగ
నియోజకవర్గానికి వచ్చే మరోపండుగ
పండుగలొస్తే ఖర్చవతాయి డబ్బులు
ఉప ఎన్నికతో నిండిపోతాయి జేబులు



గ్రామగ్రామాన విందులు వినోదాలు
మారుస్తున్నారు పార్టీల కండువాలు
తరలివస్తున్న నాయకత్వ శ్రేణులు
ప్రవహిస్తున్న ధన కనక వాహనాలు

తాజాగా తెరపైన ఎమ్.ఎల్.ఏ.లు
సాగుతున్నాయటగా బేరసారాలు
రక్తి కడుతున్నాయి రాజకీయాలు
నూతన ఒరడికి చుట్టే శ్రీకారాలు




ఓట్ల కొరకు సాగు నాయకుల వేట
సగటు మనిషిదేమో బ్రతుకు బాట
తిట్టుకునే నాయకులంతా కలిసేనట
ఓటరు మహాశయా గమనించు ఆట




డా. వి. రవిశంకర ప్రజాపతి
ఫోన్ : 94407 68894

# తుకారాం అభంగం

పదరే పండరికీ పోదాము
రుక్మిణీ వరుణ్ణి చూద్దాము
ఆ.............
పదరే పండరికీ పోదాము
రుక్మిణీ వరుణ్ణి చూద్దాము

నిలుపు కన్ను చెవి నిష్ఠ ధ్యానం
కందువచటే ప్రభువు సమాధానం
ఆ........
పదరే పండరికీ పోదాము
రుక్మిణీ వరుణ్ణి చూద్దాము

సాధువులు భక్త మహాత్ములు కలువ
ఆనంద నాట్యమే ఆ సంరంభము
ఆ......
పదరే పండరికీ పోదాము
రుక్మిణీ వరుణ్ణి చూద్దాము

సకల తీర్థాల పుట్టినిల్లిది
సకల సుఖాల భాండరంబు
ఆ.......
పదరే పండరికీ పోదాము
రుక్మిణీ వరుణ్ణి చూద్దాము

లేదు మరుజన్మ మరల మరల
తుకా పలికే తరలు జన్మ తరియ
ఆ.......
పదరే పండరికీ పోదాము
రుక్మిణీ వరుణ్ణి చూద్దాము

అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2022

# శ్రీమదాంధ్ర మహాభారతములో సరస్వతీ ప్రస్తావనలు

**శ్రీవైష్ణవ వేణుగోపాల్**, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఫోన్ : 9848707978

శ్రీవాణీ గిరిజలను వక్షో ముఖాంగాలలో నిలుపుకున్న త్రిమూర్తులను నుతించడంతో తెలుగు కావ్య సరస్వతి ప్రారంభం అయ్యింది. **"హరిహర హిరణ్యగర్భ పద్మోమా వాణీపతుల స్తుతియించి"** (అవతారిక-2)," **"హరిహరరాజ గజాననార్కషడాస్య మాతృ సరస్వతీ గిరిసుతాదిక దేవతాతతికిన్ నమస్కృతి సేసి"** (అవతారిక-21) అని చేసిన స్తుతులలో సరస్వతి కన్పిస్తుంది. నన్నయ్య భారతాన్ని **"భారత భారతీ శుభగభస్తిచయంబుల జేసి"**,(అవతారిక-22) అని భారతీ స్వరూపంగానే సంభావించాడు. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతములోని 18 పర్వాలలోని సరస్వతి ప్రస్తావనల గురించి వివరించడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

**ఆదిపర్వము :** సరస్వతీ దేవి మతినారుడనే రాజు వల్ల సంతానాన్ని పొందినట్లుగా నన్నయ్య భారతం ఆదిపర్వము చతుర్థాశ్వాసంలో కన్పిస్తుంది. మతినారుడు, సరస్వతీ నదీతీరంలో పన్నెండు సంవత్సరాలు సత్రయాగాన్ని విధివిధానంగా చేశాడు. అప్పుడు సరస్వతీనదికి మతినారునియందు మనస్సులో అనురాగం కలుగగా, ఆమె అతడిని ధర్మమార్గంలో తన భర్తగా చేసికొన్నది. వారిద్దరికీ త్రసుడు అనేవాడు పుట్టాడు. (ఆది: 4-3,4)

**సభాపర్వము :** రాజసూయ యజ్ఞానికి నాంది : దేవలోకం నుండి ఇంద్రప్రస్థంలో ఉన్న ధర్మరాజు వద్దకు వచ్చిన నారదుణ్ణి రాజు కుశల ప్రశ్నలు వేస్తాడు. ఆ సందర్భంలో నారదుడు ధర్మరాజు **"వాణీ రమణీ శ్రిత వదన సరోరుహు డన జనునె"** అని ప్రశ్నిస్తాడు. ఇందులో యజ్ఞానికి వాక్కును సరస్వతి తుల్యంగా భావించడం సభాపర్వములో కన్పిస్తుంది. (సభా:1-9)

ధర్మజు రాజసూయయాగం చేయడానికి నలుగురు తమ్ముళ్లను నాలుగు దిక్కులకు పంపాడు. నకులుడు పశ్చిమ దిశగా చేసిన దిగ్విజయయాత్రలో సరస్వతీ సింధు తీరాలలో ఉండే గ్రామణీయులను, పంచనద, అమర పర్వతాలలో ఉన్నవాళ్ళని జయించినట్లు కన్పిస్తుంది. ఈ విధంగా నన్నయ్య భారతంలో సరస్వతీ నది రూపంలో సభాపర్వములో ప్రస్తావించబడింది. (సభా:1-267)

**అరణ్య పర్వము :** కామ్యక వనానికి శ్రీకృష్ణుని విజయం : కామ్యకవనంలో పాండవుల వద్దకు ఓదార్పు యాత్రగా వచ్చిన శ్రీకృష్ణుడిని అర్జునుడు కీర్తిస్తూ పూర్వజన్మలో సరస్వతి నదీ తీరంలో గల వనంలో శరీరంపై భాగంలో వస్త్రం లేకుండా ఉపవాస వ్రతాలచే శుష్కించిన దేహం కలవాడివై పన్నెండు సంవత్సరాలు అనేక వ్రతాలు చేసావని అరణ్య పర్వములో గుర్తు చేస్తాడు. (అరణ్య:1-127)



**సరస్వతీ తీర్థ మహిమ :** సరస్వతీ నది వినశనం అనే తీర్థంలో కనిపించకుండ పోయిన సరస్వతీనది, మేరువుకు వెళ్ళేమార్గంలో ఉండే నాగోద్భేదం, శివోద్భేదం, చమసోద్భేదం అనే పుణ్యతీర్థాలలో ఎక్కడ కనబడుతుందో అటువంటి సరస్వతీనదిలో స్నానం చేసినవారు నాగలోకానికి వెళ్లుతారు. కురుక్షేత్రం సరస్వతీ నదికి దక్షిణదిశలోను దృషద్వతీనదికి ఉత్తరదిక్కులో ఉన్నదని సరస్వతి నదీ ప్రస్తావన, సరస్వతి తీర్థ మహిమ అరణ్య పర్వములో మనకు కన్పిస్తుంది. (అరణ్య: 2-255-259)

వృత్రాసుర వృత్తాంతంలో వృత్రుడి బాధలు పడలేక భీతిల్లి బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్లి వృత్రుడిని చంపే ఉపాయాన్ని చెప్పమని అడుగగా **"దివిరి సరస్వతీ తీరంబునందు నిశ్చింతుడై తప మొప్ప జేయుచున్న యా దధీచి కడకు నరిగి వేడుండు, నిజాస్థులిచ్చు మీకు"** అని బ్రహ్మదేవుడు అరణ్య పర్వములో చెబుతాడు. (అరణ్య:3-3)

మాంధాత : అరణ్య పర్వములో రోమశుడు మాంధాత ధర్మరాజు కురుక్షేత్రంలో సరస్వతీ నదీ తీరంలో సోముడనే రాజు యజ్ఞం చేసి నలుగురు కుమారులను పొందాడని చెప్పి ఆ తీర్థాన్ని సేవించమని అరణ్య పర్వములో చెప్పాడు. (అరణ్య : 3-207)

అరణ్య పర్వములో చతుర్థాశ్వాసములో శరదృతు వర్ణనలో నన్నయ్య చేసిన వర్ణన.

**భూసతికిం దివంబునకు బొల్పెసగంగ శరత్సమాగమం**
**బాసకల ప్రమోదకర మై విలసిల్లె మహర్షిమండలో**

**పాసిత రాజహంస గతి భాతి ప్రసన్న సరస్వతీక మ**
**బ్జాసనశోభితం బగుచు నబ్జజయానముతో సమానమై.**

(అరణ్య: 4-140)

శరత్కాలం తెల్లని వెన్నెల రాత్రులకు సుప్రసిద్ధం. శరదృతువు ఇటు నేలకు అటు నింగికి శోభ చేకూరుస్తుంది. శరదృతువు నందే సప్తర్షిమండలం స్ఫుటంగా ఆకసంలో ఉదయించి కన్పిస్తుంది. రాజహంసలు శరత్కాలంలోనే మానససరోవరాన్ని చేరుకొంటాయి. సరస్వతి తెలుపు. ఆమె నామాంతరం శారద, బ్రహ్మదేవుడి వాహనం హంస తెలుపు. అతడు అబ్జజుడు. తామర పువ్వులు శరత్కాలంలో శోభిస్తాయి. శరత్సమాగమాన్ని మహర్షి మండలం ఉపాసించే రాజ హంసతో పోల్చి సరస్వతి బ్రహ్మల సమాగమంగా చెప్పటం ఇందులోని తాత్పర్యం.

**శారదరాత్రు లుజ్జ్వలలసత్తరతారకహారపంక్తులం**
**జారుతరంబు లయ్యె వికసన్నవకైరవగంధబంధురో**
**దారసమీరసౌరభము తాల్చి సుధాంశువికీర్యమాణ క**
**ర్పూరపరాగపాండురుచిపూరము లంబరపూరితంబులై.**

(అ.ప. 4-141)

అవి శరత్కాలంలోని రాత్రులు. మిక్కిలి ప్రకాశమానాలైన నక్షత్ర మాలికలతో కూడిఉన్నవి, వికసించిన కొంగ్రొత్త తెల్లకలువల దట్టమైన సుగంధంతో కూడిన గొప్ప గాలి యొక్క పరిమళాన్ని వహించాయి. అంతటా వెదజల్లబడిన కప్పురపు పుప్పొడివలె ఆకసాన్ని అవరించిన చంద్రుడి వెన్నెల వెల్లువలు కలిగి ఆకాశాన్ని నిండుకొని మిక్కిలి సొగసుగా ఉన్నాయి. పైన వర్ణించిన శ్వేత వర్ణనలో సరస్వతి స్వరూపం సాక్షాత్కరిస్తుంది.

**శ్రీకృష్ణ సత్యభామల విజయం :** శరత్కాలంలో సరస్వతీ నదిలో నిత్యం స్నానాలు ఆచరిస్తూ ఆ నదీ జలాలను తాగుతూ సంతోషంతో పాండవులు గడిపినట్లు ఆరణ్య పర్వములో సరస్వతీ నదీ ప్రస్తావన కన్పిస్తుంది. (అరణ్య 4-147)

**సరస్వతి గీత :** అరణ్య పర్వంలో ధర్మరాజుతో మార్కండేయ మహర్షికి సరస్వతి గీతను వినిపిస్తాడు. పూర్వము తార్క్ష్యుడు అనే ఒక గొప్ప ఋషి ఉన్నాడు. అతడు సరస్వతీదేవిని గూర్చి తపస్సు చేయగా, ఆ దేవి అతడికి ప్రత్యక్ష మయింది. అతడు ఆ సరస్వతీదేవిని ఈ విధంగా అడిగాడు.

**'పురుషున కెయ్యది ధర్మువు? పురుషుం డెద్దాన బరమ పుణ్యాత్మకుడై చిరపుణ్యగతులు వడయును? దిరముగ నిది యానతిమ్ము దేవీ! నాకున్.'** (అరణ్య: 4-208) అని అడిగిన ప్రశ్నలకు సరస్వతి సమాధానం చెపుతుంది. చివరకు తన ఉనికిని ఇలా విశదీకరిస్తుంది. దీక్షతో నాలుగు వేదాలు పఠించి, పెక్కు యాగాలు చేసి పుణ్యాన్ని ఆర్జించిన బ్రాహ్మణుడు మరణించిన పిమ్మట స్వర్గలోకానికి పోతాడు. అక్కడ గబ్బి గుబ్బలతో నడయాడే అప్సరసల కౌగిలింతల వలన ఏర్పడిన గగుర్పాటు గల దేహంతో అతడు పెక్కు సంవత్సరాలు మిక్కిలి సంతోషంతో గడుపుతాడు. (అరణ్య: 4-210)

మంచిదూడతో ఉండి, ఎక్కువ పాల నిస్తున్న మొదటి చూలు ఆవును యోగ్యుడైన శ్రోత్రియ బ్రాహ్మణుడికి దానమిచ్చిన పుణ్యాత్ముడు (మరణానంతరం) స్వర్గలోకానికి చేరుతాడు. ఆ ఆవు దేహం మీద ఎన్ని వెంట్రుకలు ఉంటాయో అన్ని వేల సంవత్సరాలు ఆ దాత స్వర్గలోకంలో ఉంటాడు. బరువు మోయగల బలం కలిగిన కోడె యెద్దును బ్రాహ్మణుడికి దానం చేసినవాడు పది ఆవులను దానం చేసిన పుణ్యఫలాన్ని ఆర్జిస్తాడు. మరియు, వస్త్రదానం చేస్తే చంద్రలోకానికి పోతాడు. బంగారాన్ని దానమిస్తే స్వర్గలోకం పొందుతాడు. (అరణ్య: 4-211) దీక్షతో ఏడు సంవత్సరాలు అగ్నిహోత్రుడిని నేతితో వేల్చి సంతృప్తి చెందించిన నైష్ఠికుడు పదునాలుగు తరాలకు చెందిన పితృదేవతలను తనతోపాటు తీసికొని గొప్పదనం ఒప్పారేటట్లుగా స్వర్గలోకానికి వెళ్ళుతాడు. (అరణ్య : 4-212) ఎల్లప్పుడును పవిత్రతను పాటించి, అగ్నిహోత్రంలో నిరంతరాయంగా హవిస్సులు వేల్చి దేవతలను తృప్తి పొందించేవాడు చాలాకాలం గోలోకంలో నివసించి సౌఖ్యాలను అనుభవిస్తాడు. (అరణ్య: 4-213)

వ. అగ్నిహోత్రం బస్మదాత్మకంబని యెఱుంగుము సకల యజ్ఞంబులందు గల్గింపఁబడు విశిష్టద్రవ్యంబుఁ లన్నియు మదీయంబుఁ లేను మహనీయంబైన యగ్నిహోత్రముఖంబునం బ్రభవించుఁ నాత్మజ్ఞు లగు మహాత్ములకు నిఖిలసంశయచ్ఛేదంబు సేయుదు. ననవరత స్వాధ్యాయ దానవ్రత పరాయణులైన తపోధను లెందేవి వీతశోకులై వసియింతు రట్టిది మామకంబైన పరమపదంబు వినుము! ప్రచుర మధుక్షీరతోయంబులును శర్కరాసైకతంబులును మాంసాపూప ప్రకరతీరంబులును బాయసకర్దమంబులు నైన యేఱు లనేకంబు లుత్పాదించి యింద్రాగ్ని ప్రముఖు లైన దివిజులకుఁ దృప్తి సేసి యజనశీలురు మత్సదంబుం బ్రాపింతు'రని చెబుతుంది. (అరణ్య: 4-214)

అంటే అగ్నిహోత్రం తన స్వరూపమని, అన్ని యజ్ఞాలలోనూ సమకూర్చబడే వస్తువులు ఆమెకు సంబంధించినవేనని, తాను అగ్నిహోత్రుడి ముఖంలోనుండి ఆవిర్భవిస్తాను. ఆత్మను గూర్చిన పరిజ్ఞానం గల విద్వాంసులందరికీ సమస్త సందేహాలను తీరుస్తానని, నిరంతరం వేద వేదాంగ పారాయణ చేస్తూ, దానధర్మాలు చేసి దుఃఖాతీతులై బ్రదికే మహాత్ములు ఉండేచోటు తన విశిష్టస్థానమని, తేనె పాలు చక్కెర మాంసం పిండివంటలు పుష్కలంగా వెచ్చించి యజ్ఞాలు చేసి దేవతలకు సంప్రీతి చేకూర్చే నైష్ఠికులు మరణానంతరం తన లోకానికి చేరుతారని సరస్వతీదేవి చెబుతుంది.

చివరిగా తార్క్ష్యుడు చేసిన సరస్వతీ పార్థన బహుళ ప్రసిద్ధిగొన్న పద్యం. ఆ పద్యం ఇది.

**అంబ! నవాంబుజోజ్జ్వల కరాంబుజ, శారదచంద్రచంద్రికా**
**డంబరచారుమూర్తి! ప్రకట స్ఫుట భూషణ రత్న రోచిరా**
**చుంబితదిగ్విభాగ ! శ్రుతిసూక్తివివిక్తనిజప్రభావ! భా**
**వాంబర వీథి విశ్రుతవిహారి! ననుం గృపc జూడు భారతీ !**

(అరణ్య:4 -215)

**ఉద్యోగ పర్వము :** బలరాముని వేదన : పాండవులు కౌరవులు ఇద్దరు తనకు చుట్టాలేనని శ్రీకృష్ణునికి అర్జునిపట్ల ప్రేమ ఎక్కువని తన ఇష్టం వచ్చినప్పుడు పాండవులను వెంట పెట్టుకొని తిప్పు తుండటాన్ని రానున్న కురుక్షేత్ర యుద్ధంలో పాండవుల విజయం తథ్యమని దుర్యోధనుడికి భీమునికి గదాయుద్ధాన్ని నేర్పానని భీమ సుయోధనులు ఇద్దరు పరస్పరం చంపుకోవడం నేను చూడలేనని ఈ కర్కశత్వాన్ని వినలేక చూడలేక సరస్వతి తీర్థానికి వెళ్లాలని ఉద్దేశంతో (ఉద్యోగ:4-172) మీకు చెప్పి వెళదామని వచ్చానని బలరాముడు ధర్మరాజుతో శ్రీకృష్ణునితో చెప్పి వారి వీడ్కోలును పొంది సరస్వతీ తీర్థానికి వెళ్లారు. (ఉద్యోగ : 4-173)

**అంబ పరశురాముడిని శరణు వేడుట :** అంబ భీష్ముని చేత సాళ్వుని చేత తిరస్కరించబడి భీష్ముని వద్దకు తపస్సు కోసం వెళ్లి పరశురాముణ్ణి శరణు కోరుతుంది. పరుశరాముడు నేను గాంగేయుడిని ఒప్పిస్తాను నీవు తపస్సు చేయాల్సిన పని లేదని మునీశ్వరులతో సహా తోడుకొని ఈ క్షేత్రానికి వచ్చి సరస్వతీ నది తీరంలో విడిదిచేసి తాను వచ్చినట్లుగా భీష్మునికి కబురు చేస్తాడు. ఈ సందర్భంలో పరుశరాముడు విడిది చేసిన ప్రదేశంగా సరస్వతీనది ప్రస్తావన కనిపిస్తుంది. (ఉద్యోగ : 4-301)

**ద్రోణపర్వము :** అభిమన్యు వధానంతరం విలపిస్తున్న ధర్మరాజును ఓదారుస్తూ వ్యాసుడు షోడశ రాజు చరిత్రను వినిపిస్తాడు. ఆ సందర్భంలో భరతుడు మహారాజు సింహాసనాన్ని అధిష్టించి గంగా, యమునా, సరస్వతి నదీ తీరాల్లో రాజసూయం మొదలైన యజ్ఞాలను నిర్వర్తించాడు. అతడు బంగారుతో నిర్మించబడ్డ ఏనుగులను, గుర్రాలను, తేరులను ఋత్విక్కులకి దానం చేశాడు. అటువంటి భరతుడు ఇహలోకాన్ని వీడి వెళ్లలేదా అని వ్యాసుడు చెప్పే సందర్భంలో సరస్వతీనది ప్రస్తావన కనిపిస్తుంది. (ద్రోణ 2-210).

**శల్య పర్వము :** సుయోధనుడు సంధిని నిరాకరించుట : కర్ణ వధానంతరం పాండవులు అత్యుత్సాహంతో తమ శిబిరాలపై రాత్రివేళ దాడి చేస్తారేమోనన్న భయంతో రథికత్రయం శకుని, శల్యులతో సహా దుర్యోధనుడు కురుక్షేత్రానికి రెండామడలదూరంలో నున్న సరస్వతీ నదీ తీరంలోని బహిరంగ ప్రదేశానికి తమ సేనలను తీసుకొని వెళ్లినట్లు, వారు ఇష్టానుసారంగా ఆ నదిలో స్నానాదికాలు




చేసినట్లు ఉంది. (శల్య : 1 -74).

**కౌరవ సైన్యాధ్యక్షత :** శల్యుడిని సర్వసైన్యాధ్యక్షుడిగా అభిషేకించే సందర్భంలో సరస్వతీనదీ జలాలను తీసుకువచ్చినట్లుగా కనిపిస్తుంది. (శల్య : 1 -88).

1. ప్రభాస తీర్థం : బలరాముని తీర్థయాత్ర విశేషాలు చెప్పే సందర్భంలో సరస్వతీ నది సముద్రంలో కలిసే చోటుకు వెళ్ళాడని దాని పేరు ప్రభాస తీర్థం అని చెప్పడం కనిపిస్తుంది అక్కడి నుండి సరస్వతీ తీరంలోని తీర్థాల్లో స్నానం చేస్తూ కురుక్షేత్రానికి వచ్చాడు అని చెప్పడం కనిపిస్తుంది. (శల్య : 2 -146).

చంద్రుడు ప్రభాస తీర్థంలోనే (సరస్వతీ నదీ సముద్రంలో కలిసేచోటు) మునిగి తన క్షయవ్యాధిని పోగొట్టుకున్నాడు అని చెప్పడం కనిపిస్తుంది. (శల్య 2 -151).

**2. త్రితుడి వృత్తాంతం :** త్రితుడు, ద్వితుడు, ఏకతుడు అనే ముని కుమారులుండేవారు. వారు రాజులకు యజ్ఞదీక్షలనిచ్చి ఆవులను పొందారు. ఆవులను పొంది, ఒక్కడూ వస్తుండగా తోడబుట్టిన వారయిన ఏకద్వితులు త్రితుని మోసగించి అతడి ఆవులను అపహరించి దాటుకొని పోయేవారయి పాపపుచేష్టకు ఆసక్తి చూపారు. ఆ సమయంలో దారిలో ఒక పెద్ద తోడేలుండగా భయపడి తప్పుకోబోయి ప్రమాదవశాత్తు త్రితుడు బావిలో పడగా ఆ ఇరువురూ అతడిని లెక్క చేయక ఆవులను తోలుకొనిపోయారు. ఆ తాపస బాలుడు నీరు లేని ఆ బావినుండి సోమపానం చేస్తేగాని ఈ పాపం

పోదని తలచి యజ్ఞం చేయటానికి ప్రతినిధులను సంకల్పరూపంగా సంపాదించుకొని యజ్ఞం చేయగా దేవతలు ప్రత్యక్షమై హవిర్భాగాలు తీసికొన్నారు. సరస్వతీ జలం ఆ బావినుండి పుట్టి ఆ యజ్ఞపతిని కాపాడింది. ఆ దేవతలు వరమును దేనినైనా కోరుకొమ్మనగా, శ్రీ బ్రాహ్మణోత్తముడు. ఈ తీర్థంలో స్నానం చేసినవాడు సోమరసాన్ని త్రాగిన ఫలితం పొందినవాడు కావాలి. ఇది నేను కోరేవరం' అనగా, వారు అట్లే అగుగాక!' అని వరమిచ్చి సంతోషంతో దేవలోకానికి వెళ్ళారు ఇలా సరస్వతీనదీ ప్రస్తావన కన్పిస్తుంది. (శల్య 2 -155).

బలరాముడు వినాశన తీర్థం నుండి నైమిశారణ్యానికి వెళ్ళాడు. పూర్వం సరస్వతీ నది నైమిశారణ్యానికి దూరంగా ఉండేది. నైమిశారణ్యంలో ఉండే తాపసులు యజ్ఞం చేయటం మొదలు పెట్టగానే ఆ సరస్వతి వారిని గౌరవించటానికై తిరిగి పారిన కారణాన అది తట సమీపమైనది. ఆ ప్రత్యేకతను విని ఆశ్చర్యపడి, బలరాముడు ఆ తీర్థాన్ని పొగడి సప్త సారస్వతానికి వెళ్ళాడు. ఆ చోట మంకణు డనే గొప్ప తపస్వి పూర్వముండేవాడు. పూర్వం బ్రహ్మచేసిన యాగంలో, నైమిశంలోని మునులయాగంలో, గయుడి యజ్ఞంలో, ఉద్దాలకుడి యజ్ఞంలో, వసిష్ఠుడి సప్తతంతువులో, గురుడి యాగంలో, ఇంకా ఒకమారు బ్రహ్మయజ్ఞంలో, హిమవంతం, పుష్కరం మొదలైన చోటులలోను, సుప్రభ, కనకాక్షి, విశాల, సురతన్వ, ఓఘమాల, సువేణి, విమలోదక అనే పేర్లతో స్త్రీవేషంలో సరస్వతి వెళ్ళి, యజ్ఞకర్తల వలననూ, సమస్త దేవతల వలననూ, మునుల వలననూ గౌరవం పొందింది. ఆ విధంగా ఏడు రూపాలతో ఆ తపస్వి ఆశ్రమంలో తిరగటంచేత సప్త సారస్వతమని సరస్వతికి పేరు వచ్చింది. (శల్య 2 -159).

**3. మంకణ మహాముని - సరస్వతి :** మంకణ మహామునికి సరస్వతీ తీర్థం ఉనికి పట్టు. ఆ మంకణుడు సరస్వతీనదిలో స్నానం చేస్తుండగా సమీపంలో ఒకతె గుడ్డ కట్టుకొనకుండా స్నానం చేయటం చూడగా తననుండి వీర్యం వెలువడింది. దానిని కుండలో భద్రం చేయగా అది ఏడు భాగాలై సత్పురుషులయ్యారు. దేవతల పుట్టుకకు వారే కారణమయ్యారు. ఈశ్వరానుగ్రహం పొంది తపశ్శక్తి అక్షయంగా వెలుగొందేలా వరాన్ని పొందాడు. సప్త సారస్వత తీర్థం మంకణ మహామునికి ఉనికి పట్టని భారతం చెబుతుంది. (శల్య 2-160).

**4. యయాతి - సరస్వతీ :** బలరాముడు తన తీర్థయాత్రల్లో బకాశ్రమం నుండి యయాతమనే చోటుకు వెళ్ళాడు. ఆ యయాతా నికి ఒక చరిత్ర ఉంది. అక్కడ యయాతి చేసే యజ్ఞంలో భోజన వేళలో నేతులు, పాలు బ్రాహ్మణుడు ఏది కోరిన దానిని సరస్వతి నిండయిన మనస్తృప్తితో ఇస్తూ వచ్చిందట. (శల్య : 2 -168)

**5. సరస్వతికి విశ్వామిత్ర శాపం :** వసిష్ఠ విశ్వామిత్రుల గొడవలో విశ్వామిత్రుడు వశిష్ఠుడిని మట్టు పెట్టడానికి తన మనసులో సరస్వతిని తలచుకొన్నాడు. సరస్వతీనదిని తలచుకొనగానే ఆమె వెంటనే శాంతమూర్తిగా వినయంతో వచ్చి (ఆ విశ్వామిత్రుడిని) తాను చేయనగు పని ఏమో అడిగింది. దాని కాతడు వెంటనే వసిష్ఠుడిని తన వద్దకు పిలిచికొని రమ్మన్నాడు. ఆ మాటలకామె ఇర్వురి తపశ్శక్తిని తలచుకొని భయపడింది. భయంతో వెళ్ళి వసిష్ఠున కా విషయం చెప్పింది. వసిష్ఠుడు ఆ నదీమతల్లితో ఇట్లా అన్నాడు. 'నన్ను నీవు పిలుచుకొనిపోకపోతే నీ కా విశ్వామిత్రుడు శాపమిస్తాడు. వాని కోరిక ప్రకారం ఏ మాత్రం సందేహించకుండా ఆ పనిని నిర్వర్తించమని చెప్పాడు. (శల్య 2-169).

సరస్వతీనది తన సమీపంలో వశిష్ఠుడు ఒకానొకనాడు జపం చేస్తూ ఉండగా ఆ గట్టును కోసి భుజంమీద వశిష్ఠుడిని తీసికొనిపోగా వసిష్ఠుడు అంగీరస మంత్ర జపములను జపిస్తూ ఆ నదీమతల్లిని పొగడాడు. అందుచే ఆ నది అతడిని విశ్వామిత్రుడికి దగ్గర చేయగా ఆ విశ్వామిత్రుడు అతడిని చంపటానికై మార్గాలను వెదుకుతుండగా వంచనతో సరస్వతీ నదీ వసిష్ఠుడిని తప్పించింది. (శల్య :2-170) విశ్వామిత్రుడు ఆ ఏరును నెత్తుటి యేరుగా కమ్మని శపించాడు. ఒక్క సంవత్సరం పాటు ఆ ఏరు రాక్షసులచేత సేవించబడింది. ఆ తీర్థానికి కొంతమంది తాపసులు వచ్చి ఆ కష్టదశను చూచి (నారు) ఈ విషయం తెలుసుకొని, తమ ప్రయత్న బలంతో ఆ కష్టదశను తొలగించారు. కొంతమంది బ్రహ్మరాక్షసులు అపుడా మునులకు నమస్కారం చేసి తాము అదివరకు కావించిన బ్రాహ్మణ దూషణ గురు జనావమాన దుష్టాన్న భోజనాది పాతకాలను తెలిపి, 'మే మీ చోట నివసిస్తున్నాము. మా దోషాలు తొలగిపోయేటట్లను గ్రహించ వలయును'. అని వేడుకొనగా ఆ తాపసు లా కోరికను తీర్చుటకై సరస్వతిని ప్రార్థించారు. (శల్య : 2-172) అంత సరస్వతీనది అరుణానది మూలంగా ఆ విధంగా కావటం తనకు ముందే తెలియటం వలన రహస్యంగా అరుణానదిని తనలోనికి తీసికొనివచ్చి 'ఈ నదిలో మునుగండి' అని ఉత్తరువు చేయగా, ఆ నీటిలో మునిగి ఆ బ్రహ్మరాక్షసులు తమ శరీరాల నక్కడ వదలి, ధర్మాత్ములు పోయే గతికి వెళ్ళారు.

**6. సోమ తీర్థం :** కుమారస్వామి దేవసేనాధిపతిగా పట్టాభిషేకం చేసే సందర్భంలో బ్రహ్మాదిదేవతలు షణ్ముఖుని సరస్వతీ నది తీరానికి తీసుకొనిపోయి బంగారు సింహాసనంపై కూర్చుండబెట్టి దేవగురువైన బృహస్పతి హోమాదులు నిర్వహించినట్లు విష్ణుమూర్తి మొదలైనవారు సరస్వతి నిండిన మణికనక కలశాలతో అభిషేకించినట్లుగా పార్వతి, లక్ష్మీ, సరస్వతి, శచీ శక్తి దేవి మొదలైన పుణ్యస్త్రీలు ఆశీస్సులు ఇచ్చినట్లుగా చెప్పటం కనిపిస్తుంది ఇక్కడ సరస్వతి నదిగా, దేవతామూర్తిగా కనిపిస్తుంది. (శల్య 2-183)

తిక్కన్న భారతంలో శల్యపర్వములో సరస్వతి దధీచి మహామునికి సంతానాన్ని కన్నట్లుగా కన్పిస్తుంది. తీర్థయాత్రలు చేస్తూ బలరాముడు

సారస్వతమనే వశిష్ట తీర్థానికి వెళ్ళాడు. ఆ తీర్థంలో దధీచి తీవ్రమైన తపస్సు చేశాడు. ఆతని తపో నియమానికి దేవరాజు అయిన ఇంద్రుడు సంశయించి, దధీచి తపస్సుకు అడ్డు వేయటానికై అలంబుస అనే అప్సర కాంతను పంపాడు. ఆమెను చూడటంతోనే దధీచి మహామునికి వీర్యపాతమైంది. దానిని సరస్వతీ తన కడుపున దాచి, కుమారుడిని కని ఆ తపోధనుడి వద్దకు తీసికొనివచ్చి, తాపసుల గోష్ఠిలోనున్న దధీచితో 'వీడు నీ కొడుకు – నీ వీర్యాన్ని వ్యర్థం కానీయక నేను ధరించి కన్నాను. వీడిని స్వీకరించుము' అన్నది. దధీచి కుమారుడిని ఎత్తుకొని కౌగిలించుకొని, ప్రేమతో శిరస్సు ముద్దుపెట్టుకొని, ఆ నదీమతల్లిని చూచి 'నీవు బ్రహ్మ సరస్సున పుట్టావు. పవిత్రమైన నదులలో మేటివి' అని మెచ్చి, నీ జలాలతో తర్పణం వదలితే దేవతలు, పితృదేవతలు, విశ్వేదేవతలు, గంధర్వులు తృప్తిపొందుతారు' అని వరమిచ్చాడు. ఆ పసిబాలుని వైపు చూసి ఈ బాలుడు నీ పేరున సారస్వతు డనబడతాడు. రానున్న కాలంలో పన్నెండు సంవత్సరాలు వానలు లేక కాటకం వస్తే ఆ ప్రమాదం నుండి ప్రజలను మునులను కాపాడి వేదవిద్య నేర్పుతాడు. అని చెప్పగా సరస్వతి సంతోషించి, కుమారుడిని తీసుకొని వెళ్ళిపోయింది. ఇలా సరస్వతి దధీచి మహాముని వలన సంతానాన్ని పొందినట్లుగా కనిపిస్తుంది. (శల్య : 2-203)

**శాంతి పర్వము :** భీష్ముడు ధర్మరాజుకు దండనీతిని గురించి చెబుతూ శిష్టదండనీతికి గల మరొక పేరు సరస్వతిని పేర్కొన్నాడు. (శాంతి 3-100).

**యాజ్ఞవల్క్య మహర్షి జనకమహారాజ సంవాదము :** శాంతి పర్వములో యాజ్ఞవల్క్య మహర్షి జనకమహారాజ సంవాదము ఓ రాజా జనకమహారాజా! ఒకప్పుడు నేను గొప్ప తపస్సు చేసి సూర్యభగవానుడిని మెప్పించాను. ఆ దేవుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకొనుమన్నాడు. అయితే 'నాకు యజుస్సులను సంప్రాప్తింప జేయుము' అని అడిగాను. 'సరే అట్లాగే. సరస్వతీదేవిని ఆవహింప జేస్తాను. నోరు పెద్దదిగా తెరువుము' – అన్నాడు సూర్యుడు. నేను ఆనందంతో నోరు తెరిచాను. సరస్వతి శరీరంలోనికి ప్రవేశించింది. వెంటనే శరీరం భగభగ లాడిపోయింది. తట్టుకొనలేక ఎదురుగా ఉన్న సూర్యుడిని గుర్తుపట్టలేక తల్లడిల్లిపోయాను. అట్లాంటి నన్ను చూచి ఆ సూర్యుడు (శాంతి, 6 -134) 'ఓ విప్రుడా! కొంచెంసేపు తట్టుకొమ్ము. మంటలు చల్లబడతాయి' అన్నాడు. అనటమేమిటి చల్లబడటం కూడా జరిగిపోయింది. అప్పుడు సూర్యుడి ముఖపద్మం నుండి నా చెవులకు ఇంపుగా కొన్ని పలుకులు వినిపించాయి. (శాంతి : 6-135) యాజ్ఞవల్క్యమహర్షీ! వేదం నీకు లభిస్తుంది. నీ బుద్ధి వికసిస్తుంది. సాంఖ్యయోగాలు నీకు ప్రాప్తిస్తాయి. (వేదం భాసించే ప్రపత్తితో ఉన్న ఉల్లాసం బుద్ధికి కలుగుతుందని గానీ) (శాంతి : 6-136), యోగసాంఖ్యాల సిద్ధివలన కలిగే ఇష్టావాప్తి నీకు లభిస్తుంది. ఆనందంగా వెళ్ళుము' అనే మెత్తని పలుకులు సూర్యుడి నోటినుండి నా చెవులకు సోకాయి. నా ఆనందానికి అవధులు లేవు. అమృతవర్షంలో చొప్పదోగినట్టు అయ్యాను. (శాంతి : 6-137) తరువాత ఆ సూర్యభగవానుడు పశ్చిమదిక్కుగా వెళ్ళిపోయాడు. నేను మిక్కిలి సంతోషిస్తూ ఇంటికి వచ్చి సరస్వతీదేవిని ధ్యానిస్తూ ఉండగా (శాంతి:6-138) మిథిలాధిపతి! ఓంకారం అగ్రభాగంలో ఉండగా అచ్చులూ హల్లులతో అలంకరింపబడిన సరస్వతి నాకు ప్రత్యక్షం అయింది. హృద్యమైన మధువు ఆ రూపానికి మధ్యభాగంలో భాసిస్తోంది. ఈ రూపం నాకు స్పష్టంగా కనిపించింది. (శాంతి:6-139) ధ్యానంలో సాక్షాత్కరించిన సరస్వతీదేవిని నేను (యాజ్ఞవల్క్యుడు) శరణు వేడగా సూర్యానుగ్రహంతో పదిహేను శాఖల యజుర్వేదం స్ఫురించింది (శాంతి:6-140) అని చెప్పిన దానిలో సరస్వతి దేవి వాగ్దేవతగా కనిపిస్తుంది

**సప్తఋషులు – ధర్మశాస్త్రాలు :** ఉపరిచర వసు వృత్తాంతంలో ధర్మశాస్త్ర కర్తలలో సరస్వతి దేవి నిలిచినట్లు కనిపిస్తుంది. కల్పాదిలో మరీచి మొదలైన మునులూ, చిత్తుడు, శిఖండి, స్వాయంభువు మనువు అనేక సంవత్సరాలు విష్ణువు గురించి తపస్సు చేయగా విష్ణువు ప్రత్యక్షమై మీరంతా ధర్మశాస్త్రాలు రాయాలన్న ఆసక్తితో నన్ను ఆశ్రయించారు. సరస్వతీదేవి నీలో నిలవాలని ఆజ్ఞాపించారు అని విష్ణువు మునులకు చెప్తాడు. (శాంతి:6-359)

**మౌసల పర్వము :** మౌసల పర్వంలో సరస్వతీ నగర ప్రస్తావన ఉంది. అర్జునుడు యాదవ వినాశానంతరం సాత్యకి కొడుకును సరస్వతీ నగరపాలకుణ్ణి చేశాడు. (మౌసల:1-192)

**స్వర్గారోహణ పర్వం :** వైశంపాయనుడు చెప్పిన దేవ రహస్యం : స్వర్గారోహణ పర్వంలో ధర్మరాజుతో ఎవరెవరు ఎలా స్వస్థానాలకు చేరింది చేరారో చెబుతూ కృష్ణునితో రాసక్రీడ పాత్రమైన పదహారువేల గోపాంగనలు సరస్వతీ నదీ జలాలలో మునిగి తమతమ అప్సరో భావాలను పొంది సంతోషముతో నారాయణుడి సమీపంలో తిరుగుతున్నారని చెబుతారు. (స్వర్గారోహణ: 71)

ఈ విధంగా మహాభారతంలో సరస్వతీ ప్రస్తావన నదీరూపంగా, వాగ్దేవతగా, నగరనామకంగా, మరికొన్ని చోట్ల "సరస్వతి" ఉల్లేఖనాలు మనకు కనిపిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము- 15 సంపుటములు, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

ISSN 2457-0796　　　　UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక　సంపుటి -26 : సంచిక - 1　　హైదరాబాద్　నవంబర్ : 2022


# పద్యమనోహరం - 36

**గన్నమరాజు గిరిజామనోహర్ బాబు**
వరంగల్, ఫోన్ : 994 901 3448

**మీ తల్లిదండ్రులు మిమ్ము గాంచిన రీతి**
**మా తల్లిదండ్రులు మమ్ము గనరె?**
**మీ మేనులందు మా మేనుల వలె రక్త**
**పలలంబులే గాక పాలు గలవె?**
**కష్టసుఖాలు మీ కాయంబులకె గాని**
**మా కాయములకేమి లేకయున్నె?**
**సర్వేంద్రియములు సరి సమంబులు గాక**
**హెచ్చుగా బ్రహ్మ మీకిచ్చినాడె?**
**ఒక్కటే కులంబు, నొకటే కుటుంబము**
**నొకడె దేవుడాత్మ, యొకటె పుణ్య**
**మొకటె పాపమొకటె, యొకటె పుట్టువు మృత్యు**
**వొకటె, తెలియుడెల్లరికిని ద్విజులు!**

ఆధునిక మానవ సమాజం, ముఖ్యంగా భారతీయ సమాజం ఎదుర్కొంటున్న సమస్య అంటరానితనం. దాన్నే అస్పృశ్యతగా పిలుస్తుంటాం. సామాజిక రుగ్మతలతో ప్రథమస్థానంలో ఉండే సమస్య ఇదే. అందుకని తెలుగు కవులు ఈ సమస్యపై యుద్ధం చేశారు. గుఱ్ఱం జాషువా, గురజాడ అప్పారావు, త్రిపురనేని రామస్వామి గార్ల వంటి మహామహులు తమ తమ రచనల్లో ఈ అస్పృశ్యతపై నేటి ప్రమాణాలతో ఎదుర్కొంటూ యుద్ధం చేశారు. అనేక శాస్త్ర ప్రమాణాలతో ఎదుర్కొంటూ యుద్ధం చేశారు. అటువంటి మహాకవుల కోవలోని వారే కీ.శే. మంగిపూడి వెంకటశర్మగారు. ఈ పద్యం వారు రచించిన 'నిరుద్ధ భారతం' అనే కావ్యంలోనిది.

జ్ఞానులైనవారు, విద్వాంసులైనవారు తాము తెలుసుకొని సమాజానికి తెలియజేయాలన్న భావంతో కవి కొన్ని మౌలికమైన ప్రశ్నలను మనముందు ఉంచారు. అస్పృశ్యులంటూ, అంటరాని వారంటూ మనల్ని మనమే విభజించుకుంటూ మనుషుల మధ్య దూరాన్ని పెంచుతూ సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నవారు పునరాలోచన చేసేవిధంగా మంగిపూడివారు ప్రశ్నించారు. "లోకంలోని అందరు తల్లిదండ్రులవెలనే వారి తల్లిదండ్రులు కూడా వారికి జన్మనిచ్చారు. అందరి శరీరాల్లో వలెనే వాళ్ళ శరీరంలో కూడా రక్తమే ప్రవహిస్తున్నది. తప్ప వాళ్ళ శరీరంలో పాలు ప్రవహించవు కదా! కష్టసుఖాలనేవి మీ శరీరాలకు వలెనే వారి శరీరాలకూ ఉంటాయి. బ్రహ్మదేవుడు అందరిని సృష్టించినట్లే సమానమైన అవయవాలతో వారినీ సృష్టించాడు. కాని వీళ్ళకు లేని కొత్త అవయవాలేవీ ఎక్కువగా వీరికి ఇవ్వలేదు కదా! ఈ ప్రపంచంలో ఒకటే కులము, ఒకటే కుటుంబము, ఒకడే దేవుడు, ఒకటే ఆత్మ. పుణ్యపాపాలూ ఒకటే. చావు పుట్టుకలు కూడా అందరికీ ఒకటేనన్న విషయం విధిగా ద్విజులు తెలుసుకొని ప్రవర్తించాలి.

చాలా తార్కికమైన, శాస్త్రీయమైన రీతిలో ఈ దురాచారాన్ని ఖండిస్తూ నిరుద్ధ భారతమనే కావ్యాన్ని రచించిన మంగిపూడి వెంకటశర్మగారు 1882లో ఒక పేదకుటుంబంలో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామియై దేశభక్తికి సంబంధించిన రచనలు చేశారు. వారి గాంధీ శతకం ఈ సందర్భంలో రచించినదే. గాంధీగారి ప్రభావం వల్లనే హరిజనోద్యమానికి అండగా నిరుద్ధ భారతాన్ని రచించారు. బాల వితంతు విలాపం, అబలా విలాపం వంటి రచనలు కూడా చేశారు మంగిపూడి వారు.

కాశీనాథుని నాగేశ్వరరావుగారు దీనికి విలువైన ఈ పీఠికను సంతరించిపెట్టారు. ప్రాచీన గ్రంథాలలో ఇటువంటి అస్పృశ్యతకు తావే లేదంటూ గ్రంథంలోని అథో జ్ఞాపికలలో అనేక ప్రమాణాలు చూపించిన పండితులు శర్మగారు. ఇది రచించింది 1915 కన్నా ముందే అయినా ముద్రణ పొందింది మాత్రం 1915లోనే. జాతి పతిష్ఠతకు ఇటువంటివి అవరోధాలన్న స్పృహ కలిగిస్తున్న నిరుద్ధ భారతం వంటి కావ్యాలు నిత్య పఠనీయాలు, నిత్య స్మరణీయాలు.










ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1 (13) హైదరాబాద్ నవంబర్ : 2022

బండారం కథలు – 12

# యశోద వెంట

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148

**'మగ బాజిగాని లెక్క అది ఎట్ల నడుస్తుంది సూడు'** అని ఎంతమంది ఎన్నెన్నిసార్లు అన్నా యశోద పట్టించుకోలేదు. ఆ మాట వినివిని ఆమెకు అలవాటయిపోయింది. 'పనికాడ ఆడేంది, మొగేంది? పెయిల బలముండాలెగని' అనుకుంటుంది యశోద. 'తిండి కాడ ముందుండాలె, పనికాడ ఎనుకకుండాలె' అనే మాట చాలాసార్లు విన్నది కాని ఆ మాట తనకు నచ్చదు. తిండికాడయినా, పనికాడయినా యశోదకు కువ్వారం లేదు. ఎవరితోనయినా పోటీ పడుతుంది. దేనికైనా ముందుంటుంది. పెద్దమనిషి మల్లయ్య బిడ్డ అంటె పెద్దిర్కంగానే ఉండాలని అనుకుంటుంది.

యశోదను వాళ్ల నాయిన బడికి పొమ్మనలేదు. చదువుకొమ్మన లేదు. చిన్నప్పట్నుంచి బాయికాడికే పొమ్మన్నారు. బర్లనే కాయమన్నారు. అందువల్ల అక్కతో కలిసి చెలకలకు పోవటమే అలవాటయింది. పశువులతోని, పశువులు గాసే పోరగాండ్లతోని సోపతయింది. **'అన్నగాన్ని బడికి పంపిస్తరు గాని – అక్కనైనా, తననైనా ఎందుకు పంపరో'** అన్న ఆలోచన కూడా రాలేదు. దొడ్లె నుంచి పశువులు కొట్టుకోని పోతుంటే ఆ ఖదరే వేరు. లంగా ఎగజెక్కి గోసి పెట్టుకోని, చేతిలో కట్టె పట్టుకోని అదమాయించుకుంటూ బజార్ల పోతున్నపుడు నాయిన పెద్దమనిషితనమే తన నరాల్లో పాకుతున్న ట్టనిపించేది. పెద్దమనిషి మల్లయ్యంటే ఆ వూరి పెద్దమస్కూరి. చేతిలో బిరిసెకట్టె, నెత్తికి రుమాలు, తెల్లంగి, కాళ్లకు తోలు చెప్పులు. వూరి పటేండ్లతోని ముచ్చట పెడుతున్నప్పటి ఖదర్, హుందా యశోదలో స్థిరపడి పోయాయి. 'తనట్లా దర్జా చెలాయించాలె' యశోదకదే ఇష్టం. అందుకని ఎక్కడా వెనుకాడదు. **'పొద్దునా, పొద్దింజాములా, పశువులతో పోతుంటే, వస్తుంటే చేతిలో కట్టె నాయన కట్టె లెక్కనే అనిపిస్తది'. 'నాయిన పోవడే'** అని తననెవరైనా అంటే మెచ్చుకున్నట్టే మురిసిపోతుంది.

చెలకలకు పోయిన తర్వాత అదొక సందడి. అక్క ఎవరితోని ఎక్కువ మాట్లాడకపోయినా తాను అందరితో బడబడా మాట్లాడుతుంది. తన వయసు పోరగాండ్లు కొందరు, పెద్ద పోరగాండ్లు కొందరు. అందరితోని యశోద ఆడుతుంది. ఎగురుతుంది. రాళ్ళెక్కుతుంది. చెట్లెక్కుతుంది. **'ఆడవాళ్లనగానే సిగ్గుపడాలె, నాజుగ్గా ఉండాలె, నవ్వగూడదు, ఉరుకగూడదు, కొంటెకూతలు కుయ్యకూడదు, కొంటె పాటలు పాడగూడదు, మగోల్లకు భయపడాలె, దాసుకోవాలె'** ఇటువంటివేవీ యశోదకు అలవాటు లేదు. చినుకు కాలమొచ్చిందంటే పచ్చగడ్డికి కొదువుండదు. ఎడ్లపని ఎడ్లు, బర్లపని బర్లు, మేతలోనే మునిగిపోతాయి. నాగండ్ల సమయమైతే ఎడ్లు,



దున్నపోతులు నాగలికి పోతాయి. మిగిలిన ఆవులు, బర్ల కావలి మరింత సులువు. కావలసినంత సమయం.

సి(రగోనె మొదలుపెట్టారు మగపిల్లలు. యశోద ఆడుతానని వెళ్ళింది. **'ఆడవాళ్ల ఆట కాదమ్మా'** అని ఎగతాళి చేశారు. యశోదకు కోపం వచ్చింది. తిట్టింది. **'ఆటకు ఆడోల్లేంది, మొగోల్లేంది? దమ్ముంటె ఆడు'**మని సవాలు విసిరింది. **'ఒప్పుకోకపోతే ఓడిపోయినట్టే'** అని వెక్కిరించింది. ఆటలో చేరింది.

రాములు చి(రను చిత్తాడు. యశోద చి(రను అందుకోలేక పోయింది. పిల్లలు కొందరు అరిచారు. యశోదకు అవమానమని పించింది. పరిగెత్తుకుంటూ వెళ్ళి చి(రను విసిరింది. రాములు చి(రను కొట్టాడు. పైకి లేచింది. యశోద ఉరికొచ్చి దోసిలి పట్టి చి(రను అందుకున్నది. పిల్లలు చప్పట్లు కొట్టారు. యశోదకు కాసేపు గర్వంగా అనిపించింది. యశోద వంతు వచ్చింది. గోనెతో బలంగా చి(రను చిత్తింది. దూరంగా వెళ్లి పడింది. రాములు వెళ్లి చి(ర తీసి విసిరాడు. యశోద చి(రను బలంగా కొట్టింది. రాములుకు అందకుండా దూరంగా వెళ్ళి పడింది. అక్కడినుంచి గోనెతో కొలుచుకుంటూ వచ్చింది. పిల్లల ముందు రాములుకు తల తీసేసినట్టయింది. యశోద ఏ ఆట ఆడినా దర్పంతో ఆడుతుంది. పట్టుదలతో ఆడుతుంది. పంతం పట్టి ఓడించేదాకా విడువదు.

యశోద అట్లా పెరిగి పెద్దదైంది. మగపిల్లలను ఆట పట్టించడం, ఓడించడం, కొంటె నవ్వు నవ్వడం అలవాటైంది. కొన్నాళ్లకు యశోద అక్కకు పెళ్ళయి వెళ్లిపోయింది. మొదటిసారిగా విడిచిపెట్టి వెళ్ళిపోయినందుకు అక్కమీద కోపం వచ్చింది. బలవంతంగా పెళ్లి చేసి పంపించారు గనుక పెళ్ళి మీద కూడా కోపం వచ్చింది యశోదకు. ఒక్కతెగా మిగిలిపోయినా, మగపిల్లలతో పోటీ పడే విషయం మానలేదు. రాను రాను మరిన్నిపనులు నేర్చింది. చెలకలకే కాకుండా బాయిదగ్గరకి వెళ్లటం, పొలం దున్నటం, మోటగొట్టడం, కాలువ గట్టడం, కంప నాటటం అన్నీ నేర్చింది. యశోద పనితనం చూసి వాళ్ళ నాయిన మురిసిపొయ్యేవాడు. చదువుకుంటున్న అన్న మాత్రం యశోద మగ ప్రవర్తనను ఎత్తి చూపేవాడు. తప్పు పట్టేవాడు. మందలించేవాడు.

యశోద గురించి ఊర్లో రెండు తీర్ల మాట్లాడుకునేవారు. **'ఆడ పుటక పుట్టినా మగవాళ్లకు మించి పనిచేస్తుందని'** మెచ్చుకునే వాళ్ళు కొందరు, **'ఎంత అజమున్నా, ఆ బాయి పనులన్నీ నేర్చినా ఆడది ఆడిదాని లెక్కనే ఉండాలె. మగోని లెక్క పని చేసినంత మాత్రాన మొగోడైతదా – అంత బిర్రు పనికిరాదు'** అనేవాళ్లు మరికొందరు. ఎవరేమనుకున్నా యశోద ఏమీ మార్చుకోలేదు. అవ్వ మందలించి చెప్పబోయినా ఆమెను లెక్క చెయ్యలేదు. యశోద మనసులో నాయనే ఉన్నడు. పెద్దమనిషితనమే ఉన్నది.

సుడితో ఉన్న ఆవును నాయన ఎంతమంచిగ జూసుకున్నడో యశోద కూడా అంత మంచిగ జూసుకున్నది. ఓనాడు ఆవు ఈనింది. దూడ పుట్టింది. యశోద లేగదూడను మరింత ప్రాణంగా చూసుకుంటున్నది. ఆవు పొదుగు నుండి ఎన్ని పాలు పిండాలో, ఎన్ని పాలు లేగకు వదులాలో అన్నీ యశోదే చూసేది. లేగకు పాలతో పాటు ఎన్నాదీ తినిపించటం, నడక నేర్పటం, పరుగులు నేర్పించటం అదొక ఆట. ఆటలో లేని ఆనందమేదో లేగతో సయ్యాటలాడు తున్నప్పుడు కలిగేది. ఏ పాటలో లేని ఆనందం బంతిచెట్లకు కాల్వనీళ్లు కడుతున్నప్పుడు కలిగేది. గట్లమీద విరబూసిన బంతి పూలు చూస్తుంటే తనే నవ్వుతున్నట్టు, కళ్లలోని సంబురం బంతిచెట్ల మీద పాకుతున్నట్టు అనిపించేది. అంతలోనే బంగారు పురుగుకు బంతి ఆకులు తినిపించి మురుస్తున్నట్టూ తోచేది. యశోదకు మేకలంటే ఇష్టం. కొన్నాళ్ల నుంచి నాలుగు మేకలు సాదుతున్నది.

ఎప్పటిలాగే ఓ రోజు పశువులను చెలకలకు కొట్టుకపోయింది. యశద చెలకలకొచ్చిన నాడు ఆ పోరగాండ్లందరికీ గొప్ప సంతోషం. ఆడినన్ని ఆటలు, పాడినన్ని పాటలు. చెప్పుకున్నన్ని ముచ్చట్లు. తిన్నన్ని కాయలు, పండ్లు. అందరూ కూసోని ముచ్చట పెడుతున్నరు. ఆవు లీనమై గట్టి మేస్తున్నది. బర్లు బెదిరి బెదిరి చూస్తున్నవి. దుడ్డె అరిచింది. ఉరికొచ్చింది. యశోద అటు చూసింది. పాము సరసరా పాకుతూ ఆవు దగ్గరికి వస్తున్నది. యశోదకు ఆవేశం ఆగలేదు. ఆవు... అయ్యో ఆవు అనుకున్నది. పాపం, చిన్న లేగ.... గుర్తుకొచ్చింది. చేతిలో నిలబడి ఉన్న కట్టె కదిలింది. యశోద అటు ఉరికింది. కట్టె మర్లేసి పామును కొట్టింది. బుస్సుమన్నది. యశోద జోడించి మరో దెబ్బ వేసింది. పాము మెలికలు తిరుగుతున్నది. మరో దెబ్బ. ఆవు అంతా చూస్తూనే ఉన్నది. మేకలు మేత ఆపి అరుస్తున్నాయి. పిలగాండ్లు పరుగెత్తుకొచ్చారు. పాము కదలటం ఆపేసింది. అందరూ మెచ్చుకున్నారు. యశోద కట్టె మీద పాము వేలాడుతుంటే తీసుకెళ్లి దూరంగా పడేసింది. కట్టెలు పోగుచేసి అగ్గి తెచ్చి అంటుపెట్టింది.

కొన్నాళ్లు గడిచింది. బలువు పనులు తగ్గిపోయాయి. యశోద చెలకలకే వస్తున్నది. పిల్లలు ముచ్చట్లలో మునిగారు. మేస్తూ మేస్తూ యశోద వాళ్ల బర్రె కనబడనంత దూరంగా వెళ్లింది. ధ్యాస బర్రెమీదికి వెళ్లే సరికి యశోద వెతుకుతూ బయల్దేరింది. కొంతదూరం దాటిన తర్వాత పొద. పొద దాటి గమనిస్తే బర్రె దీక్షగా మేస్తున్నది. దగ్గరగా వెళ్ళి మలుపబోయింది. బర్రె కుమ్మింది. యశోద కట్టె విసిరింది. పడిన కట్టె తీసుకోవడానికి కిందికి వంగింది. రాములు మెల్లగా వచ్చి యశోదను వెనుకనుండి అలుముకున్నాడు. యశోద తిరిగి చూసింది. అంతే రాములు మీద మండింది. చేతిలో కట్టె ఉన్నది. రాములు దీనంగా చూశాడు. యశోద కోపంగా చూసింది. మళ్లీ పట్టుకోబోయాడు. యశోద కట్టె జాడించింది. **'మల్ల ఇసోంటి పిచ్చిపనులు చేస్తే తోలు పలుగుతది'** అని మందలించింది. **'తప్పయింది. మల్లెప్పుడు ఇట్ల చెయ్య. ఎవలకు చెప్పకు. నీ దయ'** బతిమిలాడాడు. యశోద చప్పున దిగిపోయింది.

వేసవికాలం ఎండలు ముదురుతున్నాయి. మల్లయ్య ఏమనుకు న్నాడో గాని, యశోదకు పెళ్లి సంబంధం కుదురుకొచ్చాడు. దగ్గరి ఊరే. దూరపు బంధువు. సెలంపుచుట్టాల ఊరే. ఇంకేదో పనికి పెద్దమనిషిగా మల్లయ్య వెళ్లితే దావతు దగ్గర పెళ్లి కుదిరింది. మంచి సంబంధం. తన తాహతుకు దగిన సంబంధం గనుక ఒప్పుకున్నాడు. యశోదకు తెలువదు. వాళ్ల అవ్వకు చెప్పలేదు. చూసుకోలేదు. మాట్లాడుకోలేదు. ఇంటికైనా, ఊరికైనా, కులానికైనా మల్లయ్య పెద్దమనిషి. కనుక అన్నీ ఆలోచించే ఒప్పుకొని వచ్చాడు. రాత్రికి ఇంట్లో చెప్పాడు.

యశోదకు పెళ్లి ఇష్టం లేదు. అక్క పెళ్లి అయింతర్వాత రానేలేదు. అత్తగారింట్లో కష్టాలు పడుతున్నట్టు ఇంట్లో మాట్లాడుకుంటే విన్నది. బతుకమ్మ పండుగకు తోలియ్యమని పోతే పెట్టుపోతల గురించి మాట్లాడి పంపలేదు. స్థోమత ఉన్నా నాయన ఎందుకో అని పెట్టలేదు. తోలుక రాలేదు. తన పని అంటే అవుతుందని ఆందోళన పడింది యశోద. అయినా **"ఇక్కడ ఉన్న ప్రేమ అక్కడ దొరుకుతదా – ఇంత ఆటా – పాటా అక్కడెట్లు ఉంటది. అన్ని చంపుకొని బతకాలె. ముందుగాల పెద్దిర్కం వొదులుకోవాలె. మూసుకొని బతుకుడు**

**తనతోని అయితదా....”** పరిపరి విధాల ఆలోచిస్తుంటె యశోదకు నిద్ర పట్టలేదు.

తెల్లవారి అవ్వతో చెప్పింది. పెళ్లి వద్దని. అవ్వ నాయనతో చెప్పుమన్నది. యశోదకేం భయం. నాయనతో చెప్పింది. ఒప్పు కున్నంక తప్పుకునేదే లేదు. చేసుకోవాల్సిందేనన్నాడు. చేసుకోనన్నది యశోద.

“నా మాట యినకపోతె ఇంట్ల ఉండొద్దు”.

“అట్లె కానీ, ఎల్లిపోత”, ‘ఎట్ల బతుకుతవ్ – అవులదానా”

“నాకు రాని పనేమున్నది అన్ని వొచ్చు. పని చేసుకొని బతుకుత”

“బాయి, బంధం లేకపోతే ఏం పని చేస్తవు’, ‘కైకిలి పనికి పోత”

“నా పెద్దమనిషితనం ఏమయిపోవాల్నే... కైకిలి పోతె”

“నీ పెద్దమనిషితనం నీకెట్టనో... నా పెద్దిర్కం నాకట్ల. కైకిలికి పొయ్యినా దర్జాగా బతుకుత. నా పని నేను జేసుకుంట. నా బతుకు నేను బతుకుత. నా ధైర్నం నాకున్నది”.

“ముండా, మాటకు ఎదురు జెప్తున్నవు. గంత పెద్దదానివైనవా... నీ అవ్వను, నీ నాయినవ్వను, నిన్ను కట్టేసి, పెండ్లి జేత్త. కతలు పడకు” పట్టరాని కోపంతో సురసుర చూసుకుంటూ బజార్లోకి పోయాడు మల్లయ్య.

నాయిన కోపాన్ని మొదటిసారి చూసింది. యశోదకు మొదటిసారి దుఃఖమొచ్చింది. దుఃఖం, కోపం, విసుగు యశోద మనసు అంతా గజిబిజిగా ఉంది.

రాములునైనా కొట్టగలదు. పామునైనా కొట్టగలదు. ఊరినైనా పక్కకు పెట్టగలదు. నాయనను పక్కకు పెట్టగలదా.... బాయీ... పశువులు.... చెలకా....

యశోద పెళ్లి యథావిధిగా జరిగిపోయింది. కానుకలు, కత్నలు అన్నీ ముట్టజెప్పుకున్నరు. ఊరూ. బాయీ, ఇల్లూ అన్నీ విడిచిపెట్టి అత్తగారింటికి వెళ్లక తప్పలేదు యశోదకు.

యశోదకు అతా కొత్తగా ఉంది. అత్త అత్తలాగే పెద్దిర్కం చేస్తున్నది. చాలామంది మొగవాళ్లను చూసింది గానీ, తన మొగడు తల్లిచాటు కొడుకు. అత్తమాట జవదాటడు. మామ ఉన్నా మెత్తన. నాయిన పెద్దిర్కం మామలో కనబడలేదు. అనుకున్నట్లే అన్నీ చంపుకొని బతుకుడు. అన్నీ కట్టుకొని బతుకుడు. యశోదకు నచ్చుతలేదు. వంటపని రానందుకు తిట్లు... సేనుపని చేసినా అవే తిట్లు.

ఐదురోజుల తర్వాత ఒకరాత్రి యశోదను చీకటి అర్రలోకి పొమ్మన్నారు. పొయ్యింది. దీపం వెలిగించింది. ఎవరూ లేరు. చాపవేసి ఉన్నది. గొంగడి దులిపి వేసింది. శద్దరు వేసుకొని పడుకున్నది.

కొంతసేపటికి మొగడు వచ్చాడు. తలుపు మూసాడు. దీపం తగ్గించి యశోద పక్కన చేరాడు. ‘తిన్నవా’ అని అడిగాడు. ఒంటిమీద చెయ్యి వేసి నిమిరాడు. యశోద చెయ్యి తీసేసింది. యశోదకు ఏదీ ఇష్టం లేదు. ‘కోపమా’ అడిగాడు. ‘ఆ కోపమే’ అన్నది. ఏం మాట్లాడాలో అతనికి తోచలేదు.

కొంచెంసేపు ఆగి మళ్లీ చెయ్యి వేసాడు. తీసేసింది. అతను బలాత్కారం చేయబోయాడు. యశోదకు కోపం మండింది. అతని చెయ్యి బలంగా పట్టి లాగి మట్టదగ్గర గట్టిగా కొరికింది. మొగడు భయపడిపోయాడు. అరుద్దామనుకున్నాడు. అరిస్తే అందరూ లేచి అనుమానంగా మాట్లాడుతారని భయపడి నొప్పి అణుచుకున్నాడు. అతనికి తెల్లవారుజాము వరకు నిద్ర పట్టలేదు. యశోదకు అసలే నిద్ర పట్టలేదు.

యశోద తెల్లారక ముందే లేచింది. నడి ఇంట్లో పడుకున్న వాళ్ల నడుమ నుంచి నడిచి వచ్చింది. దారి పట్టింది. పొద్దెక్కేసరికి ఊరు చేరుకున్నది.

సాన్పు చల్లుతున్నవాళ్లు సాన్పు ఆపి ఆశ్చర్యంగా చూస్తున్నారు. ముగ్గు వేస్తున్నవాళ్లు, కడపలు కడుగుతున్నవాళ్లు తలెత్తి ఆశ్చర్యపోతున్నారు. **“దానిదంత మొగపోవడి. అది సంసారం జేస్తదా.... అనవసరంగ పెండ్లి జేసిండ్రు గని”** తోచినట్టు మాట్లాడు తున్నరు.

యశోద తల్లి యశోదను చూసి ఆశ్చర్యపోయింది. ఊరు తిరగటానికి పోయిన పెద్దమనిషి మల్లయ్య వచ్చి యశోద మీద ఉరిమాడు. మరుసటిరోజు వరకు ఊరంతా పాకిపోయింది. **‘యశోద మొగని చెయ్యి కొరికి ఉరికొచ్చిందని’**. ఎవరి నోరు ఎవరు కట్టడి చెయ్యగలరు? తలలో నాలుకగా ఉన్న మల్లయ్యకు తల తీసేసి నట్లయింది. పంచాయితులు తెంపే పెద్దమనిషికి ఇంట్లోనే పెద్ద పంచాయితి ఎదురయ్యింది.

పంచాయితికి కూర్చోటానికి మల్లయ్య మనసొప్పలేదు. సముదాయించి సర్ది చెప్పటానికి వెళ్ళిన మల్లయ్య మీదికి వియ్యపురాలు గయ్యిన లేచింది.

ఇటు యశోద వినదు. అటు వియ్యపురాలు వినదు. ఇద్దరి నడుమ బాగా యాష్టపడ్డాడు మల్లయ్య. పరిష్కారం కోసం ఆలోచిస్తూనే ఉన్నాడు.

యశోద బాయి దగ్గరికి వెళ్లుతుంది. దినమంతా పనుల్లోనే గడుపుతుంది. కొన్ని నెలలు గడిచాయి. మల్లయ్య అల్లున్ని పండుగకు ఆహ్వానించాడు. కొన్నాళ్లు బందారంలోనే ఉండి వ్యవసాయం చూసుకొమ్మని బతిమాలాడాడు. అల్లుడు మెత్తన. అట్లా ఉండి పోయాడు. అతనూ బాయి పనులకు వెళ్తున్నాడు. యశోద చేసే

పనుల్లో సాయం చేయటం మొదలుపెట్టాడు.

ఓసారి యశోద మోట కొడుతుంటే తొండం తాడు తెగిపోయింది. భర్తవచ్చి తెగిన తాడు విడిచి పగ్గం కట్టి పని నడిపించాడు. ఆరోజు యశోద భర్తకు స్వయంగా వడ్డించింది. మరోరోజు లేగను కుక్క కొరికింది. లేగ గాయానికి నల్లాలం దంచి కట్టు కట్టాడు భర్త. చెక్కిళ్ల మీద ప్రేమగా నిమిరి మెచ్చుకోలుగా మెటికలు విరిచింది యశోద.

బాయి దగ్గరికి ఇద్దరు కలిసి వెళ్లటం, కలిసి రావటం మల్లయ్యకు సంతోషం కలిగించింది. గుసగుసలు పెట్టినవాళ్లే వాళ్లు కుదురుకున్నందుకు ముసిముసిగా నవ్వసాగారు. మేకను చూసినప్పుడు, లేగను విడిచినపుడు భర్తను ముట్టుకున్నపుడు యశోద సంబురం తరచుగా పొంగుతున్నది.

చూస్తుండగానే ఏడాది తిరిగింది. యశోద చంటిపాపను తువ్వాలులో చుట్టుకొని గుండెల్లో పొదువుకొని భర్త వెంట నడిచి పోతున్నది. వెంట యశోద దర్జాగా నడిచి వస్తున్నది.

## సత్సంగం



## జగన్మిథ్య

ఆధ్యాత్మిక సాధకునిగగా, జగత్తు మిథ్య అనే అనాలి. వేరే మార్గం లేదు. సత్యము, నిత్యము, సర్వశక్తి సమన్వితమూ అయిన బ్రహ్మమే తానని మనిషి మరచి, జగత్తులో వస్తూ పోతూండే అనేక పదార్థాల వలె తాను కూడా కేవలం ఒక దేహాన్నే అన్న భ్రమ ఉంటే, జగత్తు మిథ్యేననీ, ఒక భ్రమేననీ అతనికి గుర్తు చేయవలసిన అవసరముంది. ఎందుచేత? అతను ఆత్మను మరచాడు. అతని దృష్టి ఎంత సేపూ బాహ్యమైన, భౌతికమైన ప్రపంచంలోనే ఉంది కాబట్టి. అతను అంతర్ముఖుడై, విచారణ కొనసాగించాలంటే బయటి భౌతికమైన ప్రపంచమంతా మిథ్యే అని చెప్పాల్సి వస్తుంది. అతనికి ఆత్మ సాక్షాత్కారమయితే, ఆత్మ తప్ప వేరే ఇంకేమీ లేదని తెలుస్తుంది. అప్పుడు విశ్వాన్నంతా బ్రహ్మంగానే పరిగణిస్తాడు. ఆత్మ లేకుండా విశ్వం లేదు. అన్నిటికీ మూలమైన ఆత్మను గమనించక, బయటి ప్రపంచమే వాస్తవము, శాశ్వతము అనుకుంటున్నంత కాలము అతనికి బయటి ప్రపంచం కేవలం భ్రమేనని గుర్తు చేస్తూనే ఉండాలి. ఇది అనివార్యం. ఒక కాగితాన్ని తీసుకో. దానిమీద ఉన్న అక్షరాలనే గమనిస్తాం. ఆ అక్షరాలు వ్రాయబడిన కాగితాన్ని ఎవ్వరూ గమనించరు. అక్షరాలను వ్రాసినా, వ్రాయకపోయినా, కాగితముంటుంది. అక్షరాలే వాస్తవమనుకొనే వారికి, 'కాదు అది వట్టి భ్రమే' అని చెప్పాలి. – ఆ అక్షరాలు కాగితం మీద ఆధారపడిన కారణం వల్ల. జ్ఞాని, కాగితాన్నీ దానిపైన లిఖింపబడిన దానినీ కలిపి ఒకటిగానే భావిస్తాడు. బ్రహ్మము, జగత్తు కూడా అంతే.

నిప్పుని పొగ మరుగుపరుస్తుంది. అట్లాగే, చైతన్యకాంతిని నామరూపాల సమ్మేళనమైన ప్రపంచ మరుగు పరుస్తుంది. కరుణామయమైన భగవదనుగ్రహం లభిస్తే మనస్సు పరిశుద్ధమవుతుంది. అప్పుడు, ప్రపంచపు నైజం, భ్రమకొల్పే రూపాలే కాదు, సత్యమేనని విశదమవుతుంది.



'జగత్తు సత్యమ'నే వాక్యాన్ని ఎవరు అర్థం చేసుకోగలరు? మాయ అనే దుష్టశక్తికి అతీతమైన మనస్సు కలిగి, ప్రపంచపు ధ్యాస విడిచి, దాని పట్ల అనురక్తి లేకుండా ఉండి, తద్వారా పరమ సత్యాన్ని గ్రహించిన వారే అర్థం చేసుకోగలరు. అసలైన జ్ఞానం వల్ల దృక్పథం పరివర్తన చెందితే, ఆకాశాది పంచభూతములు కల విశ్వం, వాస్తవంగా పరమసత్యంగా గోచరిస్తుంది.

అనేక నామరూపాలతో క్రిక్కిరిసి పోయి, ఇప్పుడు విభ్రమం కొల్పే ప్రపంచం యొక్క స్వరూపం ఆనందమే. ఏకమే. పంచరంగుల నెమలి యొక్క గుడ్డులోని సొన ఒకటే. ఆత్మనిష్ఠతో, ఈ సత్యాన్ని గుర్తుంచుకో. నీవు సత్యాన్ని మాత్రమే అన్వేషిస్తూంటే ఈ ప్రపంచం మిథ్య అని అంగీకరింపక తప్పదు.

దీనికొకే ఒక కారణముంది : ఈ ప్రపంచం వాస్తవం కాదు అని నువ్వు అనుకోకపోతే నీ మనస్సు ప్రపంచం వెంట పడుతూనే ఉంటుంది. ఉన్నది ఒకే ఒక సత్యమే అయినా, పైకి కనపడేదే వాస్తవమనుకుంటే యథార్థమెప్పుడూ నీదు తెలియదు. ఈ విషయానికి ఉపమానం – త్రాడూ, సర్పమూను. ఒక త్రాడుని చూచి సర్పమని నీవు మోసపోవచ్చు – ఆ త్రాడు సర్పమేనని నీవూహించుకున్నత సేపూ త్రాడుని త్రాడుగా గమనించలేవు. లేని సర్పమే నీకు వాస్తవమవుతుంది. వాస్తవమైన త్రాడు మాత్రం లేనట్టే అనిపిస్తుంది.

కలగన్నప్పుడు కలలోని ప్రపంచం కూడా వాస్తవమే. కల ఉన్నంత సేపూ అందులో కనబడేవన్నీ నిజమే అనిపిస్తాయి.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1 హైదరాబాద్ నవంబర్ : 2022


# సంకీర్తనల్లో అన్నమయ్య లోకజ్ఞత

**డా. ఏలె విజయలక్ష్మి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 83099 63643

**సంగీతమపి సాహిత్యం సరస్వత్యా: స్తనద్వయమ్।**
**ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతమ్॥**

సంగీత మాధుర్యానికి సాహిత్యామృతాన్ని మేళవించి దానికి భక్తిని అంతర్లయను జేసి అద్భుతమైన సంకీర్తనలు రాసిన ధన్యజీవి అన్నమాచార్యులు. దక్షిణ భారతీయ వాగ్గేయకారులలో అద్వితీయుడు. 32 వేల సంకీర్తనలు రాసిన 'పదకవితా పితామహ' బిరుదాంచితుడు.

ఈయన కడపజిల్లా పొత్తపినాడులోని 'తాళ్లపాక' గ్రామంలో క్రీ.శ. 1424లో జన్మించాడు. పదహారవ ఏటనే శ్రీ వేంకటేశ్వరస్వామి సాక్షాత్కారాన్ని పొంది, ఆయన కరుణతో సంకీర్తనలు రాయడం. ప్రారంభించాడట. విజయనగర రాజు సాళువ నర్సింహరాయలకు సమకాలికుడు. బాల్యమిత్రుడు.

సాధారణంగా కవులను వారు సృజించిన సాహిత్యం ఆధారంగా ఈ కోవకు చెందినవారని నిర్ణయిస్తుంటారు. అయితే వారు కృషి చేసిన సాహితీరంగం ఏదైనప్పటికి ప్రధానంగా కవులు సామాజికులు. వారి రచనల్లో సామాజిక అంశాలు కనిపించడం ఇందుకు నిదర్శనం. కావ్య ప్రకాశాన్ని రాసిన మమ్మటుడు "నిపుణతాలోక శాస్త్ర కావ్యాద్య వేక్షణాత్" కవికి లోకజ్ఞత ఉన్నప్పుడే కావ్యాన్ని సామాజికులు ఆస్వాదించి ఆనందిస్తారు. కవులెంత భావనా ప్రపంచాన్ని కల్పించుకున్నా దానికి ఆలంబన సమకాలీన సమాజమే! మను చరిత్రలో పెద్దన హిమాలయాల్లో కేదారభూముల్ని సృష్టించడమే వెనుకనున్న కారణం ఇదే! అన్నమయ్య సంకీర్తనల్లో ముప్పేటగా పెనవేసుకున్న భక్తి, శృంగార, ఆధ్యాత్మిక భావనల్లోనూ ఆయన జీవించిన కాలంనాటి సమాజం తొంగి చూస్తుంటుంది. లోకపు నడతకు స్పందించి, విశ్లేషించి, విమర్శించి, దాని తాత్వికతను వ్యాఖ్యానించడమే లోకజ్ఞత. అన్నమయ్య సంకీర్తనలు ఆధారంగా ఆయన లోకజ్ఞతను ఈ వ్యాసంలో పరిశీలిద్దాం.

**"ఒక్కరు తలఁచినట్టు ఒక్కరి తలఁపు రాదు**
**పక్కన నందరికి బహుభావాలు"**
**"పొరుగువానిచేత ఆ పొరుగువాఁడు మెచ్చఁడు"**
**"గరిమ నన్నమొకటే కడుపు తనవి వేరు"**
**"కడఁగి దరిద్రుని మాట కలవాని కింపుగాదు"**
(అన్నమయ్య శృంగార సంకీర్తనలు - సంపుటి 7)

'పుర్రెకో బుద్ధి - జిహ్వకో రుచి' అన్న సామెత లోక ప్రసిద్ధం. ఒకరికి తప్పనిపించేది. ఇంకొకరికి ఒప్పుగా తోస్తుంది. ఎవరికి వాళ్లు తామే కరెక్ట్ అనుకుంటారు. పొరుగువాని గొప్పతనాన్ని




మెచ్చుకునే వాళ్లు అరుదుగా కనిపిస్తారు. ఒకవేళ మెచ్చుకున్నా అందులో మనస్ఫూర్తి ఎంతుందో చెప్పలేం. ధనబలం మనిషికి అహంకారాన్ని పెంచుతుంది. ధనవంతుడికి పేదవాడు మనిషిగానే కన్పించడు. ఇంక వాడి మాటెంత. ఇక్కడ అన్నం అంటే భోజనం అది కేవలం కడుపు నింపుకోవడానికైతే ఏదైన సరిపోతుంది. కాని తృప్తి ముఖ్యం. దానికి రుచి ఆధారం. రుచుల కోసమే కదా మనిషి విషయ లోలుడయ్యేది. లోకాన్ని ఎంత ఆకళింపు చేసుకుంటే ఇలాంటి మాటలు చెప్పడం సాధ్యం.

మరో సంకీర్తనలో రక్తసంబంధాల గుట్టును ఇలా విప్పి చెబుతాడు కవి.

**"ఇద్దరు దేహ సంబంధమిదివో మాయ**
**............................**
**తోడబుట్టిన మమత తొడఁగి కొన్నాళ్లకు**
**వాడిక పుత్రుల మీద వలెనుండదు**
**వేడుక వారెవ్వరో వీరెవ్వరో కాని**
**కూడపెట్టి వీరికే, కొట్లాడే వారిక**
**తల్లిమీద గల భక్తి తనకే కొన్నాళ్లకు**
**ఇల్లాలు మీఁద వలె వింత ఉండదు"**
**(ఆధ్యాత్మిక సంకీర్తనలు, సంపుటి 6, సంకీర్తన 92)**

"అన్నదమ్ముల పొత్తు చిన్నప్పుడు, అక్కాచెల్లెళ్ల పొత్తు పెద్దయ్యాక" అనే మాట గుర్తుకు వస్తుంది. ఒక్క కంచంలో అమ్మచేతి ముద్దలను పంచుకు తిన్న అన్నదమ్ములు పెళ్ళిల్లయ్యి వేరు కాపురాలు పెట్టినాక ఒకరి పట్ల ఒకరికున్న ప్రేమ హుష్‌కాకి అవుతుంది. తమ బిడ్డల మీదున్న ప్రేమ ముందు అదెక్కడో మరుగున పడిపోతుంది. కొన్నిసార్లు ఆ అన్నదమ్ములే ఒకరి బిడ్డల అభివృద్ధికి మరొకరు ఓర్చుకోలేరు. ఈర్ష్యలతో, స్వార్థాలతో రగిలిపోతారు. 'పాలివాని పగ' అన్న సామెతకు నిదర్శనమౌతారు. ఇది మనకు ఇండియా పాకిస్థాన్ క్రికెట్ మ్యాచుల్లో ప్రత్యక్షమౌతూనే ఉంటుంది కదా. అందుకే అన్నమయ్య కూడా 'పెట్టేది వీరికి కొట్లాడేది వారికి' అని అన్నాడు. అట్లాంటిదే తల్లిమీద ప్రేమ. భార్య మీది ప్రేమ ముందు మసక బారిపోతుంది. 'పెళ్లాం బెల్లం అవుతుంది. తల్లి అల్లం' అవుతుంది. ఇందుకు భిన్నంగా కూడా కొంతమంది లేకపోలేరు. కానీ ఎక్కువ సమాజంలో కనిపించేదాన్ని అన్నమయ్య ఎత్తి చూసాడు.

జీవితంలో అనేక బంధాలతో మనుషులను ముడివేసి బంధిస్తుంది. బంధాలతోనే ఆనందం. వాటితోటే దుఃఖం. అందుకే అన్నమయ్య ఎన్నడు విజ్ఞానమిక నా అనే సంకీర్తనలో ఇలా అన్నాడు.

**"పాసిన పాయవు బంధములు**
**ఆస దేహమున్నన్నాళ్లు**
**కోసిన తొలగవు కోరికలు**
**గాసిలి చిత్తము కలిగినన్నాళ్లు"**
**- అన్నమయ్య సంకీర్తన రత్నాకరము - వెంకట్ గరికపాటి**

అలమేలుమంగ వేంకటేశ్వరులను నెపంతో అన్యాపదేశంగా స్త్రీ పురుషుల సొగసులను, మనసులను, పెక్కు విధాలుగా వర్ణించాడు. అన్నమయ్య ఎంత వర్ణించాడంటే అని శృంగార కీర్తనలుగానే ప్రసిద్ధమయ్యేంత అయితే వాటిల్లోనూ అన్నమయ్య లోకజ్ఞత తొంగి చూస్తూనే ఉంటుంది.

15,16 శతాబ్దపు సమాజంలో స్త్రీ విలాస వస్తువుగా కనిపిస్తుంది. మగవాళ్లంతా దక్షిణ నాయకులే. ఆ విషయమే ఎత్తి చూపుతుంది పై సంకీర్తన. తుమ్మెద ఒక్క పూదోనతో తృప్తి పడదు. చిలక ఒక చెట్టున విశ్రమించదు. తిరుగుతూనే తోటంతా ఉంటుంది. మగవాని మనస్తత్వాన్ని ఎంత స్పష్టంగా చెప్పాడో.

ఆరోజుల్లో ఎక్కువగా మగవాళ్లు ఇలాగే ఉన్నారు కాబట్టి వాళ్లను మచ్చిక చేసుకోవడానికి అనుసరించే పద్ధతుల్ని స్త్రీలకు బోధిస్తున్నాడు మరో కీర్తనలో ఇలా.

**"పతితోడ సతికిని పంతము లాడదందగదు**
**మితిమీరిన గర్వంలో మించంగ దగదు"**
**- అన్నమయ్య శృంగార సంకీర్తనలు, సం. 2, 200**

**"మంచితనముకే మగలు లోనౌదురు**
**ఇచ్చిన చనవులకే యాడు జోడై చిక్కుదురు**
**- అన్నమయ్య సం 13, - సంకీర్తన 105**

ఇట్లా స్త్రీలకే కాదు పురుషులకు మార్గదర్శనం చేస్తాడు మరో కీర్తనలో -

**"వలచిన యాదవారు వాదులాటక వచ్చేన**
**చలము సాధించువాడు జాణండా వాడు**
**చనువు గలుగువారు గుణంగులఁ దిట్టంగాను**
**కవలి యెగ్గు ఘనుండా వాడు**
**గునసి సవతులపై కోపాన పతినంటెను**
**విని నవ్వకుంటె వాడు విభుడా వాడు"**
**అన్న - శృంగా, సంపుటి - 2, సంకీర్తన**

ఒక మగవానికి అనేకమంది స్త్రీలతో సంపర్కం ఉన్నప్పుడు అతను శ్రీకృష్ణుడిలాగా ఓర్పు కలిగి ఉండాలట. పేరలుకలతో కాలితో తన్నినా అబ్బా! నొచ్చిందా! అంటూ గారవం చెయ్యాలట. అంతేగాని కోపగించుకోరాదట. స్త్రీ అలుకను జాణతనంతో తీర్చి తాను సుఖపడి ఆమెను సుఖపెట్టాలట. తనచుట్టూ ఉన్న లోకాన్ని ఎంత పరిశీలిస్తే ఇంత చక్కని సలహాలు ఇవ్వడం సాధ్యమౌతుంది.

వివాహం దంపతులతో బాటు బంధు మిత్రులందరిని అలరించే వేడుక. స్త్రీ పురుష సంబంధాలకు పరమార్థమైన తంతు. తనకాలం నాటి వివాహాన్ని కళ్లకు కట్టినట్లు ఈ విధంగా వర్ణించాడు అన్నమయ్య ఈ సంకీర్తనలో.

**"పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు కొంత**
**పెడమరలి నవ్వీనె పెండ్లికూతురు**
**పేరు కల జవరాలె పెళ్లి కూతురు పెద్ద**
**పేరుల ముత్యాల జడ పెళ్లి కూతురు**
**పేరంటాండ్ల నడిమి పెండ్లి కూతురు విభు**
**పేరు కుచ్చ సిగ్గువడీ పెండ్లి కూతురు**
**..............................**
**పెనుగుచు పేగులు పెట్టేరదో**
**ఘనులు బ్రహ్మాదులు కట్నములు చదవగ**
**కోమరార విడేలందు కొనెరదె"**

ఇందులో జరిగినది ఆలమేలుమంగ వివాహమే అయినా నూత్న వధువు పెడమరలి నవ్వడం - పెండ్లికొడుకు పేరును ఆమెతో గుచ్చించడం - సేసలు పట్టడం, కట్నములు చదవడం ఒకరి నోటిలోని తాంబూలాన్ని మరొకరు నోటితోనే అందుకోవడం వివాహమపు వేడుకనంతటినీ కళ్లకు కట్టినట్లు వర్ణించాడు అన్నమయ్య. ఈ సంకీర్తనలోని ప్రాసాలంకారాలు వినేవాళ్ల చెవులకు మధురిమను పంచుతాయి. తందనా అహి తందనానా పురి

తందనానా బళా! అనే ప్రసిద్ధ కీర్తనలోను సమాజపు తాత్త్వికతనంతా ఈవిధంగా ఎంతో చాకచక్యంగా ఎత్తి –

**"నిండారు రాజు నిద్రించు నిద్రయునొకటే**
**అండనే బంటునిద్ర అదియునొకటే"**

నిద్ర సుఖమెరుగదు అన్న నానుడిని తలపిస్తుంది.

**"మెండయిన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే**
**చండాలుండేటి సరి భూమి యొకటే"**

తనకాలం సమాజంలో కుల వ్యవస్థను నిరసిస్తూ ఈ మాటలలో నిలదీస్తాడు అన్నమయ్య.

**"కడిగి ఏనుగు మీద కాయు ఎండయినొకటే**
**పుడమి శునకము మీద పొలయు ఎండొకటే"**

భగవంతుడు తన కరుణను కురిపించడనికి హెచ్చు తగ్గులను చూడడు. అందరికీ సమంగానే ఇస్తాడు. మనం దానిని అర్థం చేసుకోక అజ్ఞానంలో అహంకరిస్తాం. తన చుట్టున్న సమాజపు తీరుతెన్నులను గర్హిస్తూ చెప్పిన ఈ మాటలు ఆయన లోకజ్ఞతను ఎత్తి చూపుతున్నాయి.

వండుకున్న అన్నాన్ని తింటామో లేదో తెలియని క్షణభంగురమైన జీవితాలు మనవి. అయినా నాది నాదని అహంకరిస్తాం. ఎక్కువశాతం సమాజికులు ఇలాగే ఉంటారు. వారందరినీ చూసిన కవి లోకజ్ఞతకు సాక్ష్యాలీ మాటలు. ఇక్కడ వత్తి శరీరం, నూనె ప్రాణం. విత్తు అత్మయితే పొల్లు శరీరం. పామరులకు కూడా తెలిసిన ఈ సత్యాన్ని పట్టించుకునే వారెందరు. ఇంకొక సంకీర్తనలో సమాజపు తీరుతెన్నులను మరో కోణంలో ఎత్తిచూపినాడు అన్నమయ్య.

**"చిక్కుపడ్డ పనికి జేసినదే చేత**
**లెక్కలేని యప్పునకు లేమే కలిమి**
**తగవులేమికేదిరి ధనమే తన సొమ్ము**
**జగడానికి విరసమే కూడు**
**పతి లేని భూమికి బలవంతుడే రాజు**
**గతిలేని కూటికి గన్నదే కూడు"**

**– అన్నమయ్య శృం.సంకీర్తనలు, సం.6, సంకీర్తన 63**

ఒక్కోసారి పూనికతో ప్రారంభించిన పని ఏదో కారణం వల్ల ఆగిపోతుంది. చేసిన చేత వృథా అయిపోయి, చేసిన కష్టమే మిగులుతుంది. అలాగే లేమి పెరిగినకొద్దీ అప్పు కూడా పెరుగుతుంది. లేమి అనే కలిమె అప్పుకు ఆధారమయ్యింది అంటాడు కవి. ఎదుటివాడి ధనం మీద ఆశ వున్నవాళ్లు తగవులాడటానికి వెనకడుగు వేస్తారు. విరోధిమీద అనిష్టత జగడానికి భూమిక అవుతుంది. అలాగే వారసుడు లేని భూమికి ఆక్రమించుకునే సత్తా గలిగినవాడు వారసుడవుతాడు. ఇక దరిద్రుడు అన్నం కరువయి అలమటించేవాడికి దొరికిందే కూడు. ఆకలి రుచులెరుగదు కదా!

ఈ సంకీర్తన అన్నమయ్య సమాజ పరిశీలన శక్తికి అద్దం పట్టింది. మరో సంకీర్తనలో సమాజపు తీరుతెన్నులను ఔరా అనిపించేటట్లు ఇలా ఎత్తి చూపాడు.

**"ఊరిలేని పొలిమేర పేరు పెంపు లేని బ్రదుకు**
**గారవంబు లేని ప్రియము కదియ నేటికే**
**యెండలేని నాటి నీడ యేమి సేయనే**
**మెచ్చులేని చోట నెంతమేలు గలిగె నేమి శెలవు**
**మచ్చిక లేనిచోట మంచిమాట లేటికి**
**పెచ్చు పెరుగలేని చోట ప్రియము కలిగిన యేమి ఫలము"**

**– అన్నమయ్య శృం.సంకీర్తనలు – సంపుటి2,**

ఈ సంకీర్తనలో ఊరికి పొలిమేర ఎంత అవరమో, బతుకుకి అభివృద్ధి అంతే అంటున్నాడు అన్నమయ్య. ప్రేమ మనసులో ఉంటే సరిపోదు. దాన్ని వ్యక్తపరచాలి. అలుకును ఆదరంగా గారవించాలి అంటున్నాడు. ఇది అన్ని మానవ సంబంధాలకు వర్తించే మాట. అలాగే ఎండలో కాగినపుడే నీడ విలువ తెలుస్తుంది. కష్టం తర్వాత వచ్చే సుఖపు విలువ కూడా అలాంటిదే. ఎంతటి సంతోషమయిన ప్రశంసతో కూడినప్పుడే ద్విగుణీకృతం అవుతుంది. ప్రియము అంటే ఆనందం. అంతకంతకీ పెరగనప్పుడు ఫలితం ఏముంది. అలాగే మనను ఇష్టపడని వాళ్లను ఎంత పొగిడినా అపార్థానికే తావిస్తుంది.

అన్నమయ్య రాజ్యాధికారం కోసం తనవాళ్లని చంపుకున్న రాజుల వైఖరిని నిరసించాడు. విజయనగర రాజుల చరిత్ర ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది. రెండవ విరూపాక్షరాయలు తన కొడుకు చేత హత్య చేయబడితే, ఆయన చిన్న కుమారుడు ప్రౌఢ దేవరాయలు తన అన్నను చంపించాడు. తన కాలం రాజుల తీరుతెన్నులను ఈ సంకీర్తనలో ఇలా వివరించి బాధ పడ్డాడు.

**"దేహమిచ్చిన వారిని! దివిరి చంపెడు వాడు**
**ద్రోహి గాక నేడు దొరయాటా**
**తోడ బుట్టిన వాని దొడరి చంపెడువాడు**
**చూడ దుష్టుడు గాక సుకృతి యట**
**కొడుకు నున్నతమతిం గోరి చంపెడువాడు**
**కడుఁ బాతకుడు గాక ఘనుడటా**
**తల్లిఁ జరిపెడువాడు తలఁప దుష్టుడు గాక**
**యెల్లవారల కన్న నెక్కుడటా**
**కల్లరి యనుచు లోకమున రోయుపని యిది**
**చెల్లఁబో నేనేమి సేయుదునయ్యా"**

**– అధ్యాత్మిక సంకీర్తనలు – 38 వరకు**

క్రీ.శ.14,15 శతాబ్దాలలోని విజయనగర రాజులు అన్నమయ్యకు అటు ఇటుగా సమకాలీకులు కేవలం వాళ్లే కాదు అటు ఢిల్లీ నేలిన

రాజులు కూడా ఇంకా వెనక్కి వెనక్కి వెళ్లి చూస్తే అనాదిగా రాజ్యాధికారం కోసం బంధాలు, బంధుత్వాలు బలి అవుతూనే ఉన్నాయి. కానీ కథలుగా వినడం వేరు, కళ్లార చూడటం వేరు. అన్నమయ్య కళ్లార చూసిన దురంతాలను తట్టుకోలేక ఆక్రోశించాడు పై సంకీర్తనలో.

**"తతిగాని యీ పాటు దైవమా విచారించవే**

**.........................................**

**తెరలకెట్టుండిరో దిక్పాలులు" అన్న సంకీర్తనలో**

మనిషి అధికార దాహంతో తోటి మనిషిని హింసించి వికట్టహాసం చేయడం మానవత్వం మరిచి చిన్న పిల్లలను, స్త్రీలను పీడించడం. పూజించాల్సిన గోవును, చంపి తినడం. బ్రాహ్మణున్ని నిర్దాక్షిణ్యంగా హత్య చేయడం. వీటన్నింటి తన కాలపు సమాజంలో కళ్లార చూశాడు అన్నమయ్య. అందుకే అధర్మాలకు ఆలవాలమైన లక్ష్మీదేవిని, మిన్నంటిన పసివాళ్ల రొదను జీర్ణం చేసుకున్న ఆకాశాన్ని, అరాచకాన్ని సహిస్తున్న ధర్మదేవతను, సాక్షీభూతంగా నిల్చిన దిక్పాలకులను ఆక్రోశంతో నిలదీసి అడగుతున్నాడు. ఇంతటి అకృత్యాలను భరిస్తున్న సమాజాన్ని కళ్లముందు ఆవిష్కరిస్తున్నాడు.

అన్నమయ్య మరికొన్ని కీర్తనల్లో సామాజిక నడవడిని ఎంతో చక్కగా ఎత్తిచూపారు. అవి ఆయన కాలంనాడే కాదు ఈనాడు కనిపించే దృశ్యాలే.

**"తనకు సంతసమైతె తన భాగ్యము వొగడు**
**తనకు జింత పుట్టితే దైవము దూరు"**

అన్నమయ్య ఎంతో లోకజ్ఞతతో చెప్పిన మాటలివి. నిర్వివాద నిత్యసత్యాలు. మనిషికి కష్టమొచ్చినప్పుడు తప్ప దేవుడు గుర్తుకురాడు.

**"కులమెంత గలిగెనది కూడించు గర్వంబు"**

లోకంలో కొందరికి ధనగర్వముంటే, మరికొందరికి కుల గర్వముంటుంది. దాంతో అహంకరించే మనుషుల్ని చూసిన చెప్పిన మాటలివి. ఇది కులాల అంతరాలను సంఖ్యను కూడా సూచిస్తుంది.

**"కనుచూపులు నొక్కటే కాంక్షలే వేరు"**

కనుచూపుకు పరమార్థం ఎదుటి వస్తువును దర్శించడం. కానీ ఆ చూపు వెనక ఉన్న ఆలోచన భిన్నం. ఒక పువ్వును చూసినప్పుడు ఒకరు అందాన్ని ఆస్వాదించి సంతోషిస్తే మరొకరు దాన్ని తుంపి తలలో పెట్టుకోవాలనుకుంటారు. ఇంకొకరు దేవుని పాదాల ముందుంచి నమస్కరించాలనుకుంటారు. చూపుల వెనకున్న కాంక్షల గురించి చెప్పడం వెనుక కవి లోకజ్ఞత సాక్షాత్కరిస్తుంది.

కవుల భావనలకు ఆధారం వారిచుట్టూ ఉన్న లోకమే! తమ సమకాలీన సమాజాన్ని ఆకళింపు చేసుకునే కదా కవులు నూతన సృష్టి చేస్తారు. శృంగారాది రసాల సృష్టికి కూడా లోకమే ఆలంబన. కవికున్న లోకజ్ఞత సహృదయుల్ని సద్యఃపర నివృతుల్ని చేస్తుంది. రసోత్పత్తిని కలిగిస్తుంది. అన్నమాచార్యుల సంకీర్తనలు ప్రజలనింత ఆకట్టుకున్నాయంటే అందుకు కారణం ఆయనకున్న అపారమైన లౌకిక జ్ఞానమే.

## సాధన పంచకమ్

**క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం ప్రతిదినం భిక్షౌషధం భుజ్యతాం**
**స్వాద్వన్నం న తు యాచ్యతాం విధివశాత్ ప్రాప్తేన సంతుష్యతామ్**
**శీతోష్ణాది విషహ్యతాం నతు వృథావాక్యం సముచ్చార్యతాం**
**ఔదాసీన్య మభీప్స్యతాం జన కృపా నైష్ఠుర్య ముత్సృజ్యతామ్॥**

**తాత్పర్యం :** 1. ఆకలి రోగమును నయం చేసికొనవలెను. 2. ప్రతిదినము భిక్షాన్నమును ఔషధముగా భుజింపవలెను. 3. రుచికరమైన ఆహారమును కోరకుండా ఉండవలెను. 4. విధివశాత్తుగా లభించిన దానితో తృప్తి చెందవలెను. 5. శీతోష్ణాదుల వంటి ద్వంద్వములను సహించవలెను. 6. వ్యర్థమైన మాటలను మాట్లాడకుండా ఉండవలెను. 7. ఉదాసీనమును ఇష్టపడవలెను. 8. జనుల యొక్క కృపను కోపగించుటను (నిష్ఠురత్వమును) విడిచి పెట్టవలనెను.

**వివరణ**

**1. క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతామ్ –**

ఆకలిని రోగంతో పోల్చి, దానిని నయం చేసుకోమంటున్నారు శ్రీ శంకరాచార్యులు. చాలా గొప్పమాట. శరీరానికి వ్యాధులు వస్తుంటాయి, పోతుంటాయి. కాని ఆకలి అనే వ్యాధి మాత్రం పుట్టిన నాటినుండి గిట్టేంతవరకు విడువకుండా వెంటనే ఉంటుంది.

వ్యాధికి మందు తీసుకుంటున్నట్లుగా, ఆకలివ్యాధికి ఆహారం తీసుకుంటున్నాం. అయితే డాక్టరు సలహా ప్రకారంగా మందును ఒక క్రమంగా, ఒక పద్ధతిగా వాడుకొంటున్నాము. అందువలన వచ్చిన వ్యాధి నయమౌతూ ఉంది. అట్లే ఆహారాన్ని తీసికొటే ఆకలి రోగం నయమౌతుంది. కాని ఒక నియమం లేకుండా మోతాదును వదిలిపెట్టి ఆహారం తీసుకొంటున్నాం. యోగశాస్త్రం మరియు ఆరోగ్యశ్శాస్త్రం ప్రకారంగా కడుపులో సగభాగం ఆహారంతో, పావు భాగం నీళ్ళతో నింపి, మిగిలిన పావుభాగం ఖాళీగగా ఉంచాలి అనేది నియమం. ఇంతేగాక –

"యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా"

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2022

# భారతీయీకరణ – 6

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.





అందువల్ల సహజంగానే అనేక ఉపాసనా మార్గాలు దేశీయైక్యతకు ఏ విధంగానూ భంగం కలిగించకుండా ఈ దేశంలో ఇరుగుపొరుగులుగా అభివృద్ధి చెందినయి. ఇతర ఉపాసనా మార్గాలతో సహజీవనమూ, సహనమూ, సంప్రదాయంగా లేని యూదులు, సిరియన్ క్రైస్తవులు మొదటిసారిగా భారతదేశంలోకి వచ్చినప్పుడు, వారికి కేరళ ప్రజలు, పాలకులూ, సంపూర్ణ రక్షణ, ఉపాసనా స్వేచ్ఛ కల్పించినారు. దీనితో వారెంతగానో ప్రభావితులయినారు. వారు కూడా ఇదే ధోరణిని అలవరుచుకొని, పెంపొందించుకున్నారు. అంతే కాదు, వారి మతవిశ్వాసాలనూ, ఉపాసన మార్గాలనూ, ఏమాత్రం వదులుకోకుండానే భారతీయ సమాజంతో ఏకమయిపోయినారు. ఏడవ శతాబ్దంలో భారతదేశానికి వచ్చిన పారసీల విషయంలోనూ ఇంతే జరిగింది. ఇన్ని శతాబ్దాలుగా భారతీయులు వారి మతవిశ్వాసాలను, ఉపాసనా మార్గాలను మన్నించి గౌరవించారు. దీని ఫలితంగా, పారసీలు తమంతట తామే ఈ దేశంలోనూ, సమాజంలోనూ ఇమిడిపోయినారు. పారసీల ఈ రీతి భారతీయీకరణ అమలు విషయంలో ఒక ఉత్తమమయిన ఉదాహరణ. పారసీలు ఇక్కడి సమాజంలో ఎంతగా కలిసిపోయినారంటే, విభజించి పాలించు విధానంలో అతి చాతుర్యం గల ఆంగ్లేయులు ఎన్నోవిధాల దుష్ప్రయత్నాలు చేసినా గూడా భారతీయులకు పారసీలకు మధ్య అగాథం సృష్టించలేకపోయినారు.

ఈ పరిస్థితి ఇస్లాం ఆగమనంతో మారిపోయింది. ఇస్లాం వ్యాప్తి కూడా ఒక ప్రధాన ప్రేరకమయిన విదేశీయాక్రమణదారుల భుజాలెక్కి ఇస్లాం ఈ దేశంలోకి విచ్చేసింది. మత విషయికంగా దాని ప్రధాన లక్షణం భారతీయాలోచనా విధానానికీ, ప్రవృత్తికీ పూర్తిగా విభిన్నమయింది. భారత దేశంలో అనేక రీతులయిన ఉపాసనా మార్గాలూ ఆలోచనా విధానాలూ కలిసిమెలిసి సహజీవనం సాగిస్తున్న ఆ కాలంలో ఏకోపాసనా మార్గానికే అందరూ కట్టుబడి ఉండవలెనన్న సిద్ధాంతాన్ని ఇస్లాం నెలకొల్పింది. ఇతర ఉపాసనా మార్గం విషయంలో దానికి ఏ విధమయిన సహనమూ లేదు. అవసరమయితే మెడమీద కత్తిపెట్టయినా సరే, భారతీయులందరినీ ఇస్లాం మతంలోకి మార్చటం మాత్రమే దాని ఉద్దేశ్యం కాదు. అట్లా మార్చబడిన వారందరూ, ఈ మార్పిడికి పూర్వం వారనుసరించిన రీతని పూర్తిగా నిరాకరించడం, పూర్వీకులను పూర్తిగా మరచిపోవడం కూడా అది ఉద్దేశిస్తున్నది. ముస్లింల ప్రధాన గ్రంథమైన ఖురాన్– జార్జిసేల్ చేసిన అనువాదం– అనుసరించి రక్తసంబంధీకులయినాసరే, విగ్రహారాధకులు (కాఫిర్లుగా మరణించి) నరకానికి వెళ్ళినారని తెలిసి,వారి కోసం భగవంతుని ప్రార్థించడం

గాఢమయిన మతవిశ్వాసం గల వారికీ, వారి ప్రవక్తకూ విధాయకం కాదు.

ముస్లిం ఆక్రమణ దారులందరూ ఈ దేశ ప్రజలను కాఫీర్లు- విరుద్ధ మతావలంబకులుగానే గుర్తించినారు. ఖురాన్ ప్రతిపాదించిన దేవుని తప్ప, ఇతర దేవుళ్ళనూ, దేవతలనూ, పూజించే వారందరూ "కాఫీర్లు"గా భావించబడ్డారు. పైగా, కాఫీర్లకు వ్యతిరేకంగా "జీహద్"- మత యుద్ధం- సాగించడం నిజమయిన ప్రతి ముస్లిం యొక్క ధర్మంగా భావించబడింది.

ఈ కారణంగా ఇస్లాంను భారతదేశంలోకి తెచ్చిన ముస్లిం అరబ్బులూ, తురుష్కులు కూడా భారత ప్రజల విషయంలో చాలా ఆటవికంగా ప్రవర్తించినారు. అనేక దేవాలయాలను గ్రంథాలయాలను నాశనం చేసినారు. అతిదుష్టంగా విధ్వంసకాండ జరిపినారు. భారతీయ కాఫీర్ల విషయంలో వారి క్రూరత్వానికీ, దుడుకుతనానికీ హద్దు, ఆటంకం లేకపోయింది. గజినీ మహమూద్ మధురలోని దేవాలయాల వైభవాన్ని, నిర్మాణ, శిల్పచాతుర్యాన్నీ చూచి ఆశ్చర్యచకితుడయిపోయినాడు. వాటిని మనుషులు కాక, దేవతలే నిర్మించి ఉంటారనీ, వాటి నిర్మాణానికి శతాబ్దాల కాలంపట్టి ఉంటుందని ఎంతో మెచ్చుకున్నాడు. కాని అతని ఇస్లాం ఆసక్తి ఆ నిర్మాణాలను నేలమట్టం చేయడానికి అతన్ని బలవంత పెట్టింది. భారతీయులకు పరిచితమయిన పూర్వపు యుద్ధాల వలే కాకుండా, స్త్రీ బాల వృద్ధులకూ రైతులకూ బాధలు కలిగిస్తూ, దేవాలయాలను ఇతరోపాసనాస్థానాలనూ అపవిత్రం చేస్తూ, వాటిని నేలమట్టం కావిస్తూ చెలరేగిన ఈ క్రొత్త ఆక్రమణదారుల ఆటవిక ప్రవృత్తిని చూచి భారతీయులు నిశ్చేష్టులయి పోయినారు.

ప్రొఫెసర్ హబీబ్ చెప్పినట్లు, ఈ కారణంగానే ఇస్లాం భారతదేశంలో ఏ విధమయిన వాద ప్రసక్తి లేకుండానే శిక్షార్హంగా నిందింపబడింది. భారతీయ ప్రమాణాలకూ, రీతులకూ అసహ్యమయిన ఇస్లాం భక్తుల ప్రవర్తనను బట్టి ప్రజలు ఇస్లాం మంచి చెడ్డలను నిర్ణయించినారు.

ముస్లిం- ముస్లిమేతరుల మధ్య వివాహ సంబంధాలను ఇస్లాం నిషేధించడం, ఆక్రమణదారులుగా వచ్చిన ముస్లింలకూ బలవంతంగా మార్పిడి వల్ల ఏర్పడ్డ ముస్లింలకూ, మిగిలిన భారతీయ సమాజంలోని వారికీ మధ్య సహజీవనాన్ని మరింత దుర్భరం చేసింది. ఈ వివాహ విషయంలో ఖురాన్ ఇట్లా చెప్పుతున్నది. "ముస్లింలు విగ్రహారాధకుల స్త్రీలను- వారికి నాపై విశ్వాసం కలిగే వరకూ పెండ్లి చేసుకొనవద్దు. నీ విష్టపడిన స్త్రీ ఆమె విగ్రహారాధకులయితే- ఆమెను పెండ్లి చేసుకొనడంకన్నా ఒక బానిస పిల్లను వివాహమాడటం ఉత్తమం. మరియు ఒక ముస్లిం స్త్రీని ఒక విగ్రహారాధనకునికి- అతనికి నా మీద విశ్వాసం కలిగే వరకూ ఇచ్చి పెండ్లి చేయగూడదు. ఎందుకంటే, నీకు ఒక విగ్రహారాధకుడంటే ఇష్టం ఉండవచ్చు కానీ, అతని కన్నా ఇస్లాంను నమ్మే ఒక బానిస ఉత్తముడు."

ఈ విధమయిన ఖురాన్ నిబంధనలు మలేషియా మొదలయిన ఇస్లాం దేశాలలో అమలులో ఉన్న- ముస్లిం కానంతవరకు ఏ ముస్లిమేతరుని ముస్లిం కన్య, అట్లాగే ముస్లిమేతర కన్యను ముస్లిం యువకుడు వివాహమాడరాదని నియమించే న్యాయసూత్రాలను స్పష్టీకరిస్తాయి. జాకీర్ హుసేన్ కూడా, తన మనుమరాలు, ఆమె ప్రేమించిన శ్రీ మిశ్రా ముస్లింగా మారేంతవరకూ వివాహమాడడానికి అనుమతించలేదు. ఇంతేకాదు, 1923లో అఖిల భారత కాంగ్రెసు కమిటీకి అధ్యక్షుడయిన మౌలానా మహమ్మదాలీ, తన దృష్టిలో - మహాత్మాగాంధీ కన్నా ఒక గుండా, లేక ఒక వ్యభిచారి అయిన ముస్లిం వెయ్యి రెట్లు గొప్పవాడు అని చేసిన దుష్ప్రసిద్ధ ప్రకటన ఈ అంశంలోని దౌష్ట్యాన్ని మరింతగా సువ్యక్తం చేస్తుంది.

అయితే, ఈ విధంగా దేశీయుల విషయంలో అసహనం ప్రకటించే ప్రవృత్తి ఈ నూతనాక్రమణ దారులలో ఎంతగా ఉన్నా గూడా, అన్నింటినీ జీర్ణం చేసుకొనగల భారతీయ మేధాశక్తి చేత వారు కూడా ప్రభావితులు కాకుండా ఉండలేకపోయినారు.

ప్రధానంగా పై తరగతులలోని వ్యక్తులు బలవంతంగానో, ఆర్థికసంకటంవల్లనో, తమ భూములనూ ఆస్తులనూ బిరుదులనూ ఇంకా ఇతరమైన వాటిని రక్షించుకొనడం కోసమో మతం మార్చుకొని ముస్లింలయినారు. అయితే, వారు వెంటనే ఇస్లాం- భారతీయ జీవన విధానాల మధ్య సమన్వయం కలిగించడానికి ప్రయత్నించినారు. దీనివల్ల భారతీయతావరణ ప్రభావం విదేశీయ ముస్లింల మీద పనిచేయడం ప్రారంభించింది.

ఇస్లాం మరియు మహమ్మదూ ఆధ్యాత్మిక సత్యాన్ని చేరుకొనడంలో ఒక మార్గమని భారతీయ భావ ధోరణిలో సూఫీతత్వమూ, మలిక్ మహమ్మద్ జాయసీ వంటి సూఫీకవుల హిందీ రచనలూ ఇస్లాంను ప్రస్తుతీకరిగించడం, ఇస్లాం భారతీయాకరణ ఆహ్లాదకరంగా ప్రారంభం కావడాన్ని సూచిస్తుంది.

"హింద్ తురక్ దువౌభ యే స్మి అస్నే అస్నే దీన్"- హిందువులకూ తురకలకూ వారివారి విశ్వాసాలు వారి వారికున్నాయి - అని "పద్మావత్" లో మహమ్మద్ జాయసీ వ్రాసిన ప్రసిద్ధ పంక్తులను ఉభయులూ గౌరవించినారు.

(మిగతా వచ్చే సంచికలో...)

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1 (23) హైదరాబాద్ నవంబర్ : 2022

గ్రంథాంతరంగం 18

# బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటు

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076



"బ్రౌన్‌ను గురించి ఎవరు మాత్రం ఈనాడు ముందు మాటలు తప్ప ఆఖరు మాటలంటూ ఎట్లా చెప్పగలరు? అది దుస్సాధ్యం! ఎందువల్ల నంటారా? ఆ తెలుగు సూర్యుడు, 'కారణజన్ముడూ' అయిన బ్రౌన్ మనకు మిగిల్చి పోయిన అక్షరసామ్రాజ్యం ఎంత విస్తారమైంది! ఎంత విలువైంది!" (ముందుమాటలు : బ్రౌను లేఖలు పేజి : ix, 1977) ఔను కదా మరి! తెల్లదొర సి.పి.బ్రౌన్ తెలుగువాళ్లకు ఇచ్చి పోయిన సాహిత్య, జ్ఞాన పాథేయం ఎంత గొప్పదని! ఆ సాహిత్య సముద్రంలో మునిగి తేలిన గజ ఈతగాడు బంగోరె చెప్పిన పై మాటలు అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ శిలాక్షరాలే.

సి.పి.బ్రౌన్ చేసిన సాహిత్య కృషి అంతా ఒక ఎత్తయితే, ఆయన నిర్మించిన నిఘంటు సౌధాలు ఎంతెంత ఎత్తో మరి! ఆ నిఘంటువులు సుభద్రమైన పునాదుల మీద తలెత్తిన వైజయంతులే కదా! సి.పి. బ్రౌన్ నిఘంటు నిర్మాణంలో చరిత్ర సృష్టించిన యుగకర్త. ఆయన ఏళ్ల కొద్దీ శ్రమించి, నానా జాతుల, వృత్తుల ప్రజలచే సమాచారం సేకరించి, పండితుల సాయంతో ఈ నిఘంటువులు సిద్ధపరిచారు. బ్రౌన్ దొర నిర్మించిన నిఘంటువులు ఐదు. మొట్టమొదట అచ్చుయినది జిల్లా డిక్షనరీ (1852) తర్వాత అదే సంవత్సరంలో ముద్రితమైనవి ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువు, తెలుగు - ఇంగ్లీష్ నిఘంటువు (1852) ఎ లిటిల్ లెక్సికన్ - లఘుకోశం (1852)

బ్రౌన్ తయారు చేసిన తెలుగు వాచకం (టెలుగు రీడర్) మొదటి మూడు అధ్యాయాల్లో వచ్చే తెలుగు పదాలకు ఇంగ్లీష్ వివరణలున్న లఘు కోశమిది. ఇది కూడా 1852లోనే ప్రచురింపబడింది. చివరి నిఘంటువు బ్రౌణ్య మిశ్ర భాషా నిఘంటు (1854). ఇది విశిష్టమైన, విలక్షణమైన శబ్దకోశం. ఈ నిఘంటు వెలువడటానికి రెండేళ్ల ముందు జిల్లా నిఘంటువు (1852) వచ్చింది. ప్రజల నోళ్లల్లో నానుతున్న దారోగా లాంటి పదాలు ఈ నిఘంటువులో కనిపించడం లేదనీ, పైగా పలుకుబళ్లకు సరైన అర్థాలు వివరించలేదనీ విజ్ఞులు అభిప్రాయాలు వెలిబుచ్చారు. తాను ప్రచురించిన రచనలన్నింటి పైకి పేలవమైనది ఈ రచనే అని బ్రౌన్ దొర తన స్వీయచరిత్రలో విచారం వ్యక్తం చేశారు కూడా. బ్రౌన్ దొర సంకలించిన ఈ 'జిల్లా నిఘంటువు' గురించి వివరంగా తెలియ చేసిన తొలి తెలుగు పరిశోధకులు డా. పి.ఎస్. గోపాలకృష్ణగారు. (తెలుగు దారిలో వెలుగు దీపిక - సి. పి. బ్రౌన్.(పేజి: 245-248) 2012. సి.పి బ్రౌన్ అకాడమి. హైదరాబాద్.

ఈ నేపథ్యంలో బ్రౌన్ 1854 లో ప్రచురించిన 'బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటు' ప్రత్యేకత, విశిష్టతలేమిటో తెలుసుకొందాం. నవాబుల పాలన కాలంలోనూ, ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారావధిలోనూ తెలుగుభాషలో అరబ్బీ, పార్సీ, ఉర్దూ, ఇంగ్లీషు రెవెన్యూ, న్యాయాలయ పారిభాషిక పదాలు, దైనందిన జీవితంలో వుపయోగపడే ఎన్నో పదాలు చేరిపొయ్యాయి. ఈ పదాలకు సరైన అర్థాలు తెలుసు కోవడం పండిత పామరులకూ కష్టమే.

ఈ ఇబ్బందిని గ్రహించి, సి.పి. బ్రౌన్ **'బ్రౌణ్య మిశ్ర భాషా నిఘంటు'** (Dictionary of Mixed Telugu) సిద్ధపరిచి తెలుగు భాషకు అమోఘమైన సేవ చేశారు. ఆ మహానుభావుడు 'పీఠిక' లో ఇలా సెలవిచ్చాడు. The present vocabulary of the mixed dialects therefore forms a requisite supplement to a Dictionary of the Telugu Language; and it contains only those phrases which are current among the natives,............

Indeed the business dialect may lee considered another language, often deviating both in words and syntax from correct Telugu బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటు. A Dictionary of the Mixed Dialects and Foreign Words. Madras the Christian Knowledge Society Press. Church Street, Vepery, 1854. Preface: iii)

ఈ మిశ్రభాషా నిఘంటు ప్రచురణ నేపథ్యాన్ని డా.పి.ఎస్. గోపాలకృష్ణ ఇలా వివరించారు. 1824లో కుంఫిణీ ప్రభుత్వం వారు పరిపాలనలో వాడే పదాల శబ్దకోశం తయారు చేయించారు. అరబ్బీ, పార్శీ పదాల ప్రయోగం వున్న సంక్షిప్త కోశంలోనికి మరికొన్ని పదాల్ని జోడించసాగారు బ్రౌను. ఆ తెల్లదొర సిద్ధపరిచిన రాతప్రతి (GOML ఆభాసాంధ్ర నిఘంటువు D-1372) ఎన్నో చేర్పులు, మార్పులతో 1854లో 'బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటు' గా అవతార మెత్తిందని అంటారు డా. పి.ఎస్. గోపాలకృష్ణ (పేజీలు: 238-240. తెలుగు దారిలో వెలుగు దీపిక: సి.పి. బ్రౌన్ అకాడమీ, 2012) ఇది తెలుగు-ఇంగ్లీషు నిఘంటువుకు అనుబంధంగా వెలువడింది. ఇందులో 2286 ఆరోపాలున్నాయి. వీనిలో సుమారు 2,000 లు అరబ్బీ, పార్శీ, ఉర్దూ పదాలున్నాయి. తర్వాత ఇంగ్లీషు పదాలు రెండో స్థానంలో వున్నాయి. పిదప తెలుగు మాండలికాలు, పిదప తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, బెంగాలీ, ఒరియా, ఫ్రెంచి, టిబెట్ పదాలు వస్తాయి.

సి.పి.బ్రౌన్ సామాన్య జనులు దైనందిన జీవితంలో వాడే మాటలకు 'మిశ్రభాషా నిఘంటు'లో స్థానం ఇవ్వడం తప్పక గమనించాల్సిన సంగతి. ఈ పదాలు చాలా మటుకు అరబ్బీ, ఫారసీ, ఇంగ్లీషు, ఫ్రెంచి మొదలైన విదేశీ భాషల పదాలే. కొన్ని మాత్రం దక్షిణాది, మరాఠీ పదాలు. చాలా తక్కువ పదాలు బెంగాలీ, ఒరియా పదాలు ఉన్నాయి. కొన్ని విదేశీ పదాల్ని పరిశీలిద్దాం.

**1.అస్తా వెస్తము :** (బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటు: పేజి: 8) ఫూలిష్ నెస్, మ్యాడ్ నెస్ అనే ఇంగ్లీషు అర్థాలు ఇయ్యబడ్డాయి. తెలుగులో 'చాదస్తము' అనే అర్థం ఇచ్చారు నిఘంటుకారుడు. 'అస్తా వెస్తపు మనిషి' అనే ప్రయోగం చూపిస్తూ 'చాదస్తుడు' అనే అర్థం ఇయ్యబడింది. 'అస్తావెస్తం' అనే పదం 'అస్తవ్యస్త' అనే సంస్కృత పదానికి బిగడాయింపబడ్డ రూపమేమో. 'అస్తవ్యస్త' పదానికి ఈ రోజుల్లో చెల్లా చెదరుగా వున్న, గందరగోళం అనే అర్థాలు వాడుకలో వున్నాయి.

**2. ఆదా చేయుట :** (పేజి:8) ఆదా పరచుట పదాలకు రాబట్టుట, చెల్లించుటయున్ను అనే అర్థాలు ఇవ్వబడ్డాయి ఈ రోజుల్లో ఈ పదానికి పొదుపు చేయడమనే అర్థం. బ్రౌన్ చెప్పిన అర్థాలు సరైనవే. కాని కాలక్రమంలో పదాలకు అర్థాలు మారటం సహజమే.

**3. ఆమదని :** (పేజి:9) ఆముదను, ఆముదని: పదాలకు ఇంగ్లీషులో ఇన్‌కమ్, రెవెన్యూ అనే అర్థాలు ఇస్తూ తెలుగులో వచ్చుబడి అనే తెలుగు పదమిచ్చాడు. ఈ పదం ఆయన కాలంలో వుండేదికాని వర్తమాన కాలంలో ఆదాయం, రాబడి అనే పదాలే వాడుకలో వున్నాయి. 'వచ్చుబడి' పదప్రయోగం చక్కని పదం. కాని ఇప్పుడు మాత్రం చిక్కదు కదా!

**4. ఇత్తరాజి :** (పేజి:11) ఈ పదానికి కోపము, చలము అనే అర్థాల్నిచ్చారు బ్రౌన్. కాని సరైన అర్థం అభ్యంతరం అనేదే.

**5. ఖామందు, ఖావందు :** (పేజి: 23) 'ఖావింద్' అనే ఉర్దూ పదం తెలుగులో ఇలా ప్రయోగింపబడింది. యజమానుడు, స్వంతగాడు అన్న నైఘంటికార్థాలు సరైనవే. కాని 'నాయకుడు' అన్న మాట లాక్షణికార్థాన్ని తెలియచేస్తుంది.

**6. గయావాళి :** (పేజి: 19) అపరకర్మలు చేయించే గయ (బీహారు)లోని బ్రాహ్మణులు. బ్రౌన్ 'అప చరితుడుగా వుండే బ్రాహ్మణుడు, అఘాత్యగాడుగా వుండే బాపడు' అనే చక్కని, చిక్కని అర్థాలిచ్చారు.

**7. గవారు :** (పేజి: 21) రూడ్, వల్గర్, డర్టీ మొదలైన ఇంగ్లీషు అర్థాలు ఇస్తూ తెలుగులో వ్యవహరింపబడే మడ్డి, మోటు అనే రాయలసీమ మాండలికాలు ఇచ్చారు దొరగారు. మొరటు అనే పదం కూడా ఇతర మండలాల్లో వాడుకలో వున్నదే.

**8. జోక్యము :** (పేజి : 40) 'జోఖమ్' అనే విదేశీ పదానికి నష్టము, అపాయము, సరకు, వాడ, జోక్యము అనే తెలుగు అర్థాలిచ్చి 'రిస్క్ ఆఫ్ షిప్ రెక్' అన్న ఇంగ్లీషు ప్రయోగం ఇచ్చారు నిఘంటుకర్త. 'జోక్యము' అనే పదానికి సరైన అర్థం ఏదైనా విషయంలో కాని సంబంధం వున్నా, లేకున్నా అనవసరంగా తలదూర్చడం. సి. పి. బ్రౌన్ పొరపడింది. ఎక్కడంటే 'జోఖిమ్' అనే ఉర్దూ పదానికి సరైన అర్థం ధైర్యం చెయ్యడం, సాహసం చెయ్యడం అని. 'అపాయము' అన్నమాట కొంత వరకు సమంజసమైనదే. కాని 'జోక్యము' అన్న ఆరోపానికి సరైన అర్థం తోచలేదు దొరగారికి.

**9. ఠికానా-ఠికాణా :** (పేజి : 42) వుండే చోటు. ఈ రెండు అర్థాలకు తగిన విధంగా వ్యవహారాలలో వున్న ప్రయోగాలు కూడా ఇచ్చారు. 'కూటికి ఠికాణా లేదు' 'వానికి యివ్వడమునకు నాకు యేమిన్నీ ఠికాణా లేదు.' మొదటి ప్రయోగంలో 'ఠికాణా' పదానికి 'గతి' అన్న అర్థం సరిపోతుంది. రెండో వాక్యంలోని 'ఠికాణా' పదానికి శక్తి, సత్తా అనే అర్థాలు సూక్తమైనవి.

**10. ఢంకా :** (పేజి: 40) గుర్రము మీద వేసికొట్టే చర్మవాద్యము. సరైన అర్థమే. ప్రజల జీవితాన్నీ, వాళ్లు మాట్లాడే భాషనూ కంఠదఘ్నంగా అర్థం చేసుకొన్న బ్రౌన్ 'వాడు ఢంకా కొట్టినాడు 'హి డైడ్' అన్న అర్థవంతమైన వ్యావహారిక పద ప్రయోగాన్ని ఉదహరించారు.

**11. ధామ్మనుట: ధమ్మనుట :** (పేజి: 41) ఇది గ్రాంథిక పదం కాదు. అక్షరాలా వ్యావహారిక పదమే. 'చనిపొయ్యాడు' అన్న అర్థంలో ఆనాడు వాడబడింది. అయితే ఈ రోజుల్లో కూడా ప్రయోగింప బడుతూ వుంది- అకస్మాత్తుగా, అనుకోకుండా ఉన్నట్టుండి

మరణించాడు అన్న సందర్భంలో. చటుక్కున చచ్చుట, ధమ్ము కొట్టి చచ్చె, వాడు ధమ్మనెను. ఇవి బ్రౌను ఇచ్చిన సంగతమైన అర్థాలు. 'ధమ్ముకొట్టి చచ్చె' అన్న ప్రయోగానికి రూఢ్యర్థం కలరా, ప్లేగు, మహమ్మారి లాంటి రోగాలు తలవని తలంపుగా, ఆకస్మికంగా వాటిల్లి చావడం. రాయలసీమలో ధూము తగులా, ధూము కొట్టా అనే తిట్లు ఈ రోజుల్లోనూ అక్కడక్కడ వినపడటం కద్దు. ఇదే పేజీలోనే 'దమ్మనుట' అనే మరో ఆరోపం ముందే వుంది. 'గచ్చుకొట్టుట', వాడు ధమ్మన్నాడు' అన్న వ్యావహారిక జాతీయాలు ఇయ్యబడ్డాయి.

**12. తలమరలుగా :** (పేజి: 44) దీన్ని బ్రౌన్ తమిళపదంగా పేర్కొన్నారు. వంశపరంపరగా, అనేక తలమరలుగా అన్న అర్థాలు ఇయ్య బడ్డాయి. 'తలమరలుగా' అన్న పదం తలెమారు, తలెమారుగళు (తరం, తరాలు) అన్న కన్నడ భాషా పదాలకు దగ్గరైనది కాని బ్రౌన్ పేర్కొన్నట్టుగా తమిళ పదానికి సమీపమైనది కాదని నా భావన. కన్నడ భాషా ప్రభావానికి లోనైన అనంతపురం, కర్నూలు సరిహద్దు ప్రదేశాల్లో 'తలమరలు' ఇన్నూరేళ్ల కిందట వాడుకలో వుండి వుండొచ్చు. కాని ఈ పదప్రయోగం ఇప్పుడా సరిహద్దు ప్రదేశాల్లో వినపడటం లేదు. ప్రసిద్ధ కన్నడ ఆచార్యులు త.సు. శ్యామరాయరు 'మూరు తలెమారు' (మూడు తరాలు) అన్న కుతూహల కరమైన, విశిష్టమైన స్వీయచరిత్ర రాశారు.

**13. తొన్ని :** (పేజి: 56) an albino, or person of a fair complexion: such persons among the Telugus are quite as fair as Europeans. పుట్టుపాప? అని అర్థమిచ్చారు బ్రౌన్. కాని తొన్ని, తొన్ను అనే పదాలు రాయలసీమలో చర్మవ్యాధిని తెలియ చేస్తాయి. ఒంటి మీద అక్కడక్కడ తెల్లమచ్చులు– చిన్నవీ పెద్దవీ వుండి కొందరికి కాలక్రమంలో దేహమంతా పాకే చర్మవ్యాధిని ఈ పేరుతో పిలుస్తారు. నిఘంటుకారులు ఈ సంగతి విస్మరించడం ఆశ్చర్యమే.

**14. దరిబేసి, దరబేసి, దర్బేసి :** (పేజి: 46) ఈ పదాలు రాయలసీమలో నేడు కూడా వినపడతాయి. నిఘంటుకర్త 'ఎ బెగ్గర్' 'పూర్' అనే ఆంగ్ల పదాల్ని అర్థరూపంలో ఇచ్చారు. పై మూడు ఆరో పాలకు మూలం – 'దర్ వేష్' అనే విదేశీ పదం. వీళ్లని బిచ్చ గాళ్లు అనడం అర్ధసత్యం. దర్ వేష్లు, దరబేషీలు నల్లటి, పొడవైన అంగీలు (అంగరఖాలు) ధరించి, దప్పు వాయిస్తూ అరబ్బీ భాషలోని ఆధ్యాత్మిక, భక్తి గీతాల్ని పాడుతూ వుంటారు. వీళ్లు ఇద్దరు, ముగ్గురు, నలుగురు కలిసి వీధుల్లో పాడుతూ, బిచ్చం అడుగుతూ ముందుకు సాగుతుంటారు. వీళ్ల కట్టుబట్టలు మురికిగా వుంటాయి కాబట్టి మురికి బట్టలు కట్టి, గలీజుగా కనపడే వాళ్లని దరి బేసులుగా పిలవడం కద్దు. అనంతపురం, కడప, కర్నూలు, బళ్లారి జిల్లాలో ఈ 'దరిబేసి' పదం తిట్టుగా నేడు కూడా చాల్తీలో వుంది.


బ్రౌణ్య
మిశ్రభాషా
నిఘంటు

DICTIONARY

OF MIXED TELUGU.

ALSO AN

EXPLANATION OF THE TELUGU ALPHABET.

MADRAS:
PRINTED AT THE CHRISTIAN KNOWLEDGE SOCIETY'S PRESS,
CHURCH STREET, VEPERY.
1854.

Digitized by Google

**15. దుబారా :** (పేజి: 53) రెండుమాట్లు అని అభిధార్థ మిచ్చారు. నిఘంటుకారుడు అర్థమివ్వడం సరైనదే. కాని రాయలసీమలో దుబారుగా అంటే ఎక్కువ అని ఈ రోజుల్లో వాడబడుతుంది. 'వాడు దుబారాగా ఖర్చు చేస్తాడు' అంటే ఒకటికి రెండింతలుగా ఖర్చు చేస్తాడు అని అర్థం. కోస్తా ప్రాంతాల్లో 'దూబారాగా' అనే ప్రయోగం వ్యవహారంలో వుంది.

**16. బడాయి :** (పేజి: 64) ఈ పదానికి జంభాలు అని సరైన అర్థమే ఇచ్చారు బ్రౌన్ సాహెబ్. మరో ఆరోపంగా కార్పెంటర్, వడ్లవాడు అన్న మరో అర్థం కూడా ఇచ్చారు దొరగారు. మొదటి ఆరోపం 'బడాఈ' అన్న హిందీ పదం నుండి ఆవిర్భవించింది. పోతే రెండో ఆరోపం 'బఢ ఈ' అన్న హిందీ పదం నుంచే పుట్టింది. రాయలసీమలో వడ్రంగుల్ని వడ్డేవాళ్లు అని అంటారు. అయితే ఇళ్లు కట్టే సమయంలో పునాదులు తవ్వడం, గోడలు కట్టడం, పైకప్పు వేయడం మొదలైన పనులు చేస్తారు. కాని కిటికీలు, వాకిళ్లు ఇత్యాది చెక్కపనులు చేయడం మాత్రం వడ్రంగుల (కార్పెంటర్ల) కార్య విశేషం. వడ్డేవాళ్ళు, వడ్రంగులు అన్న అర్థం ఈ 'బడాయి' శబ్దానికి కుదరదు.

**17. బణజిగ– బణిజిగ :** (పేజి: 64) శూద్రుల్లోని ఒక తెగ అంటారు. కాని నిఘంటుకర్త 'లంబాడి' అని అర్థమివ్వడం చర్చనీ యాంశం. బణజిగ, బణిజిగ అనే పదాలు కాలక్రమంలో 'బలిజ' గా రూపొందాయి. కర్ణాటకలో ఈ పదం 'బణజిగ' అనే రూపంలో

నేటికీ చలామణిలో వుంది. ఈ పదం వాణిజ్యకార, వణిజార, వణిజ అనే రూపాంతరాలు చెందిందని భాషాశాస్త్రవేత్తలు పేర్కొంటారు.

**18. బయానా :** (పేజి: 66) సంచ కరువు 'సంచకార' అన్న పదం కన్నడంలో వుంది. మోసం, పెద్ద పొరపాటు అనే అర్థంలో ఇది వాడుకలో వుంది. రాయలసీమలోని కర్నాటక సరిహద్దు ప్రాంతాల్లోనూ, కన్నడ భాషీయులు ఎక్కువగా వున్న ప్రదేశాల్లోనూ రైతాంగం 'సంచకారం' (అడ్వాన్సు) అనే అర్థంలో దీన్ని వాడు తుంటుంది. కోస్తా ప్రాంతాల్లో 'బయానా' పదానికి వాడుక ఎక్కువ.

**19. 'భోళా' :** (పేజి: 84) కపటి కాని, మనసులో దాచని భోళా మనిషి అన్నారు. బ్రౌను దొర వాడుక లో వున్న కొన్ని పదాలకు స్పష్టమైన అర్థాల్నిచ్చారు.

**20. మనవర్తి :** (పేజి: 87) మనువర్తి, మనోవర్తి స్టైపెండ్, పెన్షన్, అలవెన్స్ అనే ఇంగ్లీషు అర్థాలిస్తూ 'యింటి శలవు' అన్న తెలుగు అర్థమిచ్చారు. ఈ ప్రయోగం బ్రౌన్ కాలంలో వుండి వుంటుంది. ఈ పదం రాయలసీమలోనూ, కోస్తా ప్రాంతాల్లోనూ వాడుకలో వుంది. కాని న్యాయాలయాల్లో నేడు 'భరణం' అనే పదం ఈ రోజుల్లో వాడబడుతూంది.

'బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటు' నిర్మాణం బ్రౌన్ ప్రతిభా కిరీటంలో తురాయి లాంటిది. ఈ మహానుభావుడు సంకల్పించి, సఫలీకృతుడైన విశిష్ట, విలక్షణ ప్రక్రియ ఇది. బ్రౌన్ తలపెట్టి, తరించిన భాషా సముద్రమిది. ఈయన అరబ్బీ, ఇంగ్లీషు ఫారసీ, హిందీ, ద్రావిడ భాషల, మరాఠీ మొదలైన భాషల్లోని పదాలు తెలుగులో కలిసిపోయి, నేటికీ చలామణి అవుతున్న విధానం కొన్ని పదాలు అర్థపరిణామం చెందడం మనం గమనించవచ్చు. కొన్ని పదాలకు అర్థం తెలియకపోతే ప్రశ్నార్థక చిహ్నం వుంచడం బ్రౌన్ సాహెబ్ గారి ప్రామాణికతను సూచిస్తుంది. ఈ మహానుభావుని భగీరథ ప్రయత్నం సాధన, సిద్ధుల గురించి డా. కొత్తపల్లి వీరభద్ర రావుగారి మాటలు అక్షర సత్యాలు–

"ఇట్టి మహానుభావుని కృషిలో కొన్ని లోపములున్నవని అనువారు ను లేకపోలేదు. దోషములును, లోపములును అందరికిని గలవు గాని, ఇంత కృషి చేసిన ఘనత మాత్రము అందరికిని లేదు." (పేజి: 351. సి. పి. బ్రౌన్, ద్వితీయ ముద్రణ 1988)

బ్రౌన్ మహాపండితుడు విద్వాంసుల సాయంతో నిర్మించిన నిఘంటువుల్ని భాషాశాస్త్రవేత్తలు లోతుగా పరిశీలించి ఆయన కరామత్తును వెలుగులోకి తేవడం అవశ్యం. మహాభాగులైన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ చేసిన తెలుగు సాహిత్య సేవ– అందులోనూ నిఘంటు నిర్మాణ కౌశలం గురించి నా వినమ్ర నివాళిని తాళ్ళపాక అన్నమయ్య మాటలో ఈ విధంగా అర్పిస్తున్నాను–

**"ఆకాశము పొడవు ఆకాశమే యెరుగు**
**ఆకడ జలధి లోతు ఆ జలధే యెరుగు."**

('బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటు' జెరాక్సు ప్రతిని నాకు పంపి తోడ్పడిన యువ మిత్రులు డా. టి. సతీశ్ గారికి కృతజ్ఞతలు)


# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# తెలంగాణ కథ – వస్తురూప వైవిధ్యం

డా. కసప నరేందర్, అధ్యాపకులు, తెలుగు శాఖ, నిజాం కళాశాల, ఫోన్ : 9491548746

కథ ఆధునిక ఆలోచనలకు అనువైంది. కథలో విషయం ఒకటే ఉంటుంది. ఒక సంఘటకు పరిమితమై ఉంటుంది. 'ఇతివృత్తంతు కావ్యస్య శరీరం' ఇతివృత్తం కావ్యానికి శరీరంలాంటిదని భరతుడు చెప్పాడు. ఇతివృత్తమే 'వస్తువు' అనే మాటలో మనం ఉపయోగిస్తు న్నాం. 'కథ'కు కూడా వస్తువు శరీరం లాంటిదే. వర్ణనలు, పరిసరాలు, ప్రదేశాలు, సంఘటనలు కథకు లోపల భాగమై ఉంటాయి. 'నవల' లేదా మరొక ప్రక్రియకు ఉన్న విస్తృతి 'కథ'కు ఉండదు. పరిమిత పద్ధతిలోనే కథ సాగుతుంది.

రచయిత తనకు నచ్చిన కథాలక్షణాల్ని మాత్రమే యిరికించి చిన్నకథలని నిర్వచిస్తున్నాడు. అంతేకాని ఏవిధంగా రాసినా పాఠకుల్ని ఆకర్షిస్తే ఆ విధానం మంచిదని మనం గుర్తించాలని పాశ్చాత్య రచయిత సోమర్‌సెట్ మామ్ అభిప్రాయపడినాడు. కనుక రచయితకు కథ విషయంలో విశాలస్థితి లేదు. ఒకరకంగా నవలకు ఉన్న వెసులుబాటు లేదు. అయినా కథను నిర్మించడంలో అతడు ఒక శిల్పి.

కథ నిర్మాణంలో చిన్నదే అయినా ప్రచారంలో పెద్దది. కథకు ఉన్న క్రేజ్ ఎక్కువే. కథ మానవజీవితంతో పెనవేసుకుపోయింది. దాని పరిధిని వివరిస్తూ బాలగంగాధర్‌తిలక్ కథ అనేది మన జీవితంలో జీవిత రహస్యంతో, జీవితవైచిత్రితో కొంత కొత్త పరిచయం కలగ చెయ్యాలి. కథ చెప్పే విధానమే కథకి అందాన్ని, బలాన్ని ఇస్తుంది అన్నారు. కథాకథనం ఎలా ఉన్నా వస్తువురీత్యా కథ ఒక సముద్రంలా ఉంటుంది.

తెలుగు కథ ధాతువుల రూపం... ముఖ్యంగా తెలుగు కథలో తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల సామాజిక జీవితాలు ప్రతిబింబిస్తాయి. భాషా సౌందర్యం, మాండలిక ప్రయోగ శబ్ద లయాత్మకత ఉంటుంది.

**తెలంగాణకథ – వస్తు వైవిధ్యం**

వస్తువు పాతకాలం నాటిదైనా భాషాశైలిని బట్టి అది సమకాలీనతను కలిగి ఉంటుంది. ఎందుకంటే రచయిత నివసిస్తున్న కాలంనాటి భాషనే ఉపయోగిస్తారు. కనుక అతడు ఉపయోగించిన భాషను బట్టి ఆ రచయితను, ఆ కథను ఏ కాలంనాటిదో అంచనా వేయొచ్చు. కథకు వస్తువు శరీరం లాంటిది. వస్తువే కథకు ప్రాణం పోస్తుంది. కథలోని పాత్రలు, కథాకథనం అన్నీ ఆ కథకు బిగువును కలిగిస్తాయి.

'నిగూఢ బీజస్థితినుంచి వెలికి వచ్చిన విషయాంకురం కథావస్తువు. వికాసోన్ముఖత దీని స్వభావగుణం. ప్రేరకబీజం ఏదైనప్పటికీ దానిలో ఉండే ఒకానొక విలక్షణత రచయితను ఆకట్టుకొన్నపుడు కథావస్తువు రూపొందుతుంది.' (పే.నెం. 239 కథానిక స్వరూప స్వభావాలు)

తెలంగాణకథ ప్రత్యేకమైన వస్తు సౌందర్యాన్ని, రూపసౌందర్యాన్ని కలిగి ఉంటుంది. పదప్రయోగం, మాండలిక శైలి, వాడుక పదాలశోభ గంభీరంగా ఉంటాయి.

తెలుగు, ప్రాకృత, సంస్కృత మేళవింపు భాషలో కనిపిస్తుంది. శాతవాహనులు, రాష్ట్రకూటులు, కాకతీయులు, మొఘులులు, కుతుబ్‌షాహిలు, అసఫ్‌జాహీలు, నిజాం పాలకులు ఈ నేలను పరిపాలించారు.

తెలంగాణ గొప్ప సాంస్కృతిక కేంద్రం అని చెప్పాలి. హిందూ, బౌద్ధ, జైన మతాలు ప్రాచీనమైనవి ఆ ఆచారాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అవి ఆధునిక తెలంగాణ సాంస్కృతికతలో భాగం అయినాయి.

చారిత్రకంగా, సామాజికంగా ఎంతోఖ్యాతిని సాధించిన తెలంగాణ, భౌగోళిక విశిష్టత ద్వారా సుసంపన్నమైంది. 'గోదావరి' నదీతీరప్రాంతం సస్యశ్యామలమైన నేల, కృష్ణానదీతీరం సువర్ణ భూయిష్టమైనది. మంజీర, మూసీ, ప్రాణహితలాంటి నదులు వ్యవసాయ ఆధారితమేకాక సుందరమైన వన కళాకృతులకు హేతువులైనవి. ఉత్తర, దక్షిణ తెలంగాణలు, పచ్చదనానికి ప్రకృతి శోభకు ఆనవాళ్లు, నల్లమల్ల అడవులు సహజ సుందర ప్రతీకలు.

గోదావరి, కృష్ణా నదీతీర ప్రాంతాల గిరిజన, ఆటవిక, ఆదివాసి, మూలవాసి, తెగల సాంస్కృతికత గొప్పది.

ఇక ఉపనదులైన తుంగభద్ర, భీమ, మంజీర, ప్రాణహిత, మూసీ, దిండి, పాలేరు, మున్నేరు, పెన్‌గంగా మొదలైన నదులు తెలంగాణను విస్తరించి ఉండడంవల్ల చెరువుల నిర్మాణానికి అనుకూలమైంది. చెరువుల ద్వారా వ్యవసాయం ఇక్కడ ఎక్కువ.

నీరు నదుల రూపంలో చెరువుల రూపంలో విస్తరించి ఉండటం వల్ల పచ్చని పంటలతో సిరులతో సుభిక్షంగా ఉండేది. బొగ్గుగనులు, ఖనిజ సంపద, ఇనుప గనులు, ఆజ్‌బెస్టాస్, బైరైట్స్, సున్నపురాయి, నాపరాయి లాంటి సంపద, నల్లమల్ల అటవీ సంపద మొదలైనవి తెలంగాణ ప్రాంతాన్ని ఆర్థిక స్థితిలో ఉన్నతంగా ఉంచాయి.

ఇక్కడి ప్రాంతంలో పండగలు, వాస్తు, శిల్పకళలు ప్రత్యేక

సంస్కృతికి ఆనవాళ్లు. బతుకమ్మ, బొడ్డెమ్మ, బోనాలు, పండగలు విశిష్టమైన సాంస్కృతిక ఆనవాళ్లు ఆధునిక అస్తిత్వానికి ప్రతీకలు కూడా. సమ్మక్క, సారక్క పండగలు ఇక్కడి గిరిజన సాంస్కృతికతకు ప్రతీకలు ఇక్కడి ప్రాంతంలో గిరిజన పండగలేకాక, ఆటలు, పాటలు, నృత్యాలు ప్రత్యేకత గల్గి ఉన్నాయి. దింసా, గుస్సాడి, గరగలనృత్యం. గంగిరెద్దులాట, ఒగ్గుకథ, బుడబుక్కలు, పిచ్చుకుంట్ల ఆటలు అతి ప్రాచీనమైనవి.

తెలంగాణ చరిత్ర – సంస్కృతి చాలా గొప్పది. చారిత్రకత కలిగి ఉంది. తెలంగాణ కథ వస్తు రూపాన్ని చెప్పుకున్నప్పుడు గతచారిత్రక, సామాజిక, సాంస్కృతిక అంశాలను, అలాగే భాష, మత, కళా రంగాలను కూడా విశ్లేషించుకోవాల్సి ఉంటుంది.

తెలంగాణ సాహిత్యానికి ప్రత్యేక ప్రతిపత్తి ఉంది. బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ మత సంప్రదాయాలను అంతర్భాగంగా కలిగి ఉంది. మార్గ సంప్రదాయంతోపాటు, దేశీ సంప్రదాయ సాహిత్యం ఎక్కువగా ఉంటుంది.

సాహిత్యంలో జానపదుల జీవనస్థితిగతులు, దేశప్రజల ఆచారాలు, కులవృత్తులు, జానపద వృత్తులను స్పృశిస్తూ సాహిత్యం వచ్చింది. శాసనాల కాలం నుంచి తెలుగు భాష స్థితిగతులు తెలుపుతూ భాషా, సాహిత్యాలలో వచ్చిన పరిణామాలు కూడా తెలంగాణ కథలో కనిపిస్తాయి.

తెలంగాణ కథకు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, భాష, కళా రంగాలు ఒక నమూనాగా ఉన్నాయి. ఈ అంశాలే కథలో దర్శనమిస్తాయి.

తెలంగాణ కథకు చారిత్రక నేపథ్యం ఉంది. బండారు అచ్చమాంబ మొదటి కథారచయిత్రి ఆధునిక కథకు పాశ్చాత్య అభినివేషం ఉంది. ఆ కోణం నుంచి చూసినపుడు 1930 నుంచి 'తెలంగాణ కథ'ను పేర్కొనవల్సి వస్తుంది.

వస్తువు పరంగా భాషా శైలి పరంగా కూడా కథలో వైవిధ్యం కనిపిస్తుంది. 1930 నుంచి 1956 వరకు, 1957 నుంచి 1990 వరకు, 1991 తర్వాత నుంచి 2000 వరకు, 2001 నుంచి 2020 వరకు వచ్చిన కథలలో వస్తువు బహుముఖ కోణంలో కనిపిస్తుంది. అలాగే పుష్కలమైన వైవిధ్యం ఆవిష్కృతమై ఉంది.

1930 నుంచి 1957 వరకు తెలంగాణ కథలో ఉన్న వస్తు రూపాన్ని చెప్పుకున్నపుడు 'వస్తువు' స్థితి సామాజిక పరిణామాలతో జత కలిసి ఉంది. విలక్షణత, విశ్వసనీయత ఉంది. ముఖ్యంగా తెలంగాణలో ఫ్యూడల్ భావజాలం ఉంది. భూస్వామ్య, పెత్తందారి వ్యవస్థ రూపురేఖలు చాలావరకు కనిపిస్తాయి.

గ్రామీణ ప్రాంతాలలో పటేల్, పట్వారీ, దేశ్‌ముఖ్, దొరల ఆధిపత్యం, పెత్తనం కనిపిస్తుంది. దొరల ఏలుబడిలో గ్రామాల అభివృద్ధి కూడా కుంటువడిన స్థితి కనిపిస్తుంది.

నిరాటంకంగా సాగిన వెట్టిచాకిరీ కనిపిస్తుంది. దొరా నీ బాంచన్, నీ గులామోన్ని అంటూ ప్రజలు బానిసలుగా బ్రతికారు. పొట్లపల్లి రామారావు 'న్యాయం', ఎన్వీ తిరుపతయ్య 'న్యాయం' కథలు భూస్వాముల పెత్తనాన్ని, దౌర్జన్యాన్ని చూపిస్తాయి. అల్లం రాజయ్య 'భూమి' కథ కూడా దొరల, జాగిర్దారుల సంకుచిత స్వభావాన్ని వెల్లడిస్తుంది.

తెలంగాణలో నిజాం పాలన రాక్షస పాలననే మీర్ ఉస్మాన్ అలీఖాన్ సహచరుడు ఖాసీంరజ్వీ 'రజాకార్' గూండాలకు నాయకుడు. అతని అనుచరులు గ్రామాలపై పడి మాన ప్రాణాలను తీసేవారు. సంపదలను దోచుకెళ్లేవారు. ముఖ్యంగా హిందువులను టార్గెట్ చేస్తూ హింసించేవారు.

నైజాం రాజుకు, ఖాసీం రజ్వీలకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోరాటం చేసేవారు. ప్రజలకు ఆంధ్ర మహాసభ అండగా ఉండేది.

ఆనాటి పోలీసులకు, దొరలకు వ్యతిరేకంగా పోరాడే యువకుల, ప్రజల పోరాటాలను చిత్రిస్తూ ఎన్నో కథలు వచ్చాయి. రైతాంగ పోరాటాలను, భూమికోసం, భుక్తికోసం, విముక్తి కోసం జరిగిన ప్రజా పోరాటాలు తెలంగాణ కథకు వస్తువైంది.

పి.వి.నరసింహారావు 'గొల్ల రామవ్వ' కథలో ఆనాటి స్థితిగతులు కనిపిస్తాయి. వస్తువుపరంగా, పాత్ర పోషణ పరంగా, విలక్షణంగా సాగిన కథ గొల్ల రామవ్వ. ఇది 1949లో కాకతీయ పత్రికలో వచ్చింది.

రజాకార్ల నాటి కాలానికి అద్దంపట్టే కథ నిప్పుపూలు. ఈ కథ కూడా 1949లో వచ్చింది. 1956 వరకు సరళ గ్రాంధికంలోనే రచయితలు కథలు వ్రాసారు. 1956 తర్వాత నుంచి తెలంగాణ కథలో భాషలోను, సామాజిక స్థితిగతుల్లోను అనేక మార్పులు వచ్చాయి. దీనికి కారణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడటమే. ఇది ఒకరకంగా తెలంగాణ రచయితకు కష్టమే. ఎందుకంటే నైజాం కాలంలో రాజభాష ఉర్దూ కనుక చాలామటుకు ఉర్దూ, అరబ్బీ, పారశీ పదాలు, మాటలలోను, రాతలోను చోటుచేసుకున్నాయి. 1956 తర్వాత ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు ప్రాంతాల భాష ప్రామాణిమైంది.

అయినా తెలంగాణ కథారచయితలు, తమ మాండలికంలోనే రాసేవారు. పాకాల యశోదారెడ్డి 'కోడలమ్మ వెతలు', నిశ్చితార్థం', 'ఎచ్చమ్మ కథలు' గ్రామీణ జీవనస్థితికి అద్దం పడతాయి.

గూడూరు సీతారాం 'నారయ్య బతుకు', వల్లపు బుచ్చారెడ్డి 'ఇద్దరు ఖైదీలు', 'సురమౌళి', 'అంగుడుపొద్దు', 'ముక్కోటి బలగమోయి' లాంటివి తెలంగాణం మాండలిక ప్రయోగానికి ఉదాహరణలు. చెరబండరాజు 'చిరంజీవి', మాదిరెడ్డి సులోచన 'హక్కు', అంపశయ్య నవీన్ 'హత్య' సి.హెచ్. మధు 'నేను చచ్చిపోయాన', సదానంద్ శారద 'జాడీ', నందిని సిధారెడ్డి 'చిత్రకన్ను', తుమ్మేటి రఘోత్తమరెడ్డి 'చావువిందు', 'పనిపిల్ల', వుప్పల నరసింహం "ఇత్తనప్పుకోడే" మొదలైనవి భూస్వామ్యవర్గ భావజాలాన్ని, ఆ భావజాలానికి ఎదురు నిలబడి పోరాటం చేస్తున్న ఉద్యమాన్ని, ఉద్యమకారులను చిత్రించారు. 1970 తర్వాత 'నక్సల్ బరి' ఉద్యమం కథకు వస్తువైంది. రచయితలు వామపక్ష భావ జాలం, అభ్యుదయ భావజాలాన్ని నింపుకున్నారు. అంటే కథలో అభ్యుదయ భావాలు, తర్వాత విప్లవభావాలు చిత్రించ బడినాయి. గ్రామీణ ప్రజలను చైతన్యం చేస్తూ దొరల పాలనకు చరమగీతం పాడే కథలు వచ్చాయి.

శ్రామిక జీవన నేపథ్యంగా కథలు రాసినవారు బి.ఎస్. రాములు, కాలువ మల్లయ్య, బోయ జంగయ్య, దేవరాజు మహారాజు, జూకంటి జగన్నాథం, పులుగు శ్రీనివాస్, బి.ఎస్. రాములు 'వారసత్వం' కాలువ మల్లయ్య 'ఊరుమ్మడి బ్రతుకు', పులుగు శ్రీనివాస్ 'ఆరు కార్మికుల కథలు', బోయ జంగయ్య 'బొమ్మల ప్రయాణం', దేవరాజు మహారాజు 'పొడవని పొద్దు', ముక్తవరం పార్థసారథి 'మిణుగుర్లు' మొదలైనవి. కులవర్గానికి వ్యతిరేకంగా శ్రామిక జీవన స్థితులను వర్ణిస్తూ వచ్చినవి. ముఖ్యంగా దళిత జీవితాలను ఆవిష్కరిస్తూ వారి దీనమైన బ్రతుకును చిత్రించాయి.

1990 నుంచి తెలంగాణకథలో అస్తిత్వ, ప్రాంతీయ, ప్రపంచీ కరణ ప్రభావాలు వస్తువుగా కనిపిస్తాయి. ముఖ్యంగా రాజకీయపాలన, సీమాంధ్రుల ఆధిపత్య వ్యతిరేకత కనిపిస్తుంది. విపరీతంగా జరిగిన రాజ్యహింస, బూటకపు ఎన్‌కౌంటర్‌లు, ఎమర్జెన్సీ ఛాయలు కనిపిస్తాయి. ప్రత్యేకరాష్ట్ర వాంఛ కూడా కనిపిస్తుంది. వీటితోపాటు దళిత, స్త్రీవాద, మైనార్టీ వాదాలు వస్తువులుగా తెలంగాణ కథలో కనిపిస్తాయి. సామ్రాజ్యవాద పెత్తనం ప్రపంచీకరణ నేపథ్యంలో గ్రామాల శోభను కోల్పోయి క్షోభిస్తున్న తీరు, కరువు కాటకాలు, అధిక ధరలు, భారమైన బ్రతుకు చావులు, అక్షరాస్యత ఉద్యమం లాంటివి ఉన్నాయి కథలో.

బి.ఎస్. రాములు 'సదువు', అల్లం రాజయ్య 'ప్రత్యర్థులు', దిలావర్ 'మార్పు', ముదిగంటి సుజాతారెడ్డి, 'ఊరుబాగుపడేదెపుడు' 'బోధనం' 'పేగుబంధం', పెద్దింటి అశోక్‌కుమార్ 'పడగనీడ', ఎలికట్టె శంకరరావు 'ఒరుగు', బెజ్జారపు రవీందర్ 'పీనుగ', పులుగు శ్రీనివాస్ సంకర 'విత్తులు', కాలువ మల్లయ్య 'యుద్ధభూమి', పి. చంద్, భూనిర్వాసితులు ... సాంస్కృతిక నేపథ్యంలో బెజ్జారపు రవీందర్ రాసిన 'ఒంటికాలి శివుడు' పంజాల జగన్నాథం 'తీర్థం'.

2000 తర్వాతనుంచి తెలంగాణ కథలో వలస బతుకుల గోస కనిపిస్తుంది. దేశంలోని ఇతర రాష్ట్రాలలోనే కాకుండా గల్ఫ్ దేశాలకు వెళ్లి అవస్థలు పడుతున్న వారి జీవితాలను దృశ్యమానం చేసిన కథలున్నాయి. పెద్దింటి అశోక్ కుమార్ ఘర్షణ వలస బతుకుల నేపథ్యంగా వచ్చిందే. జాతశ్రీ 'అంతర్ముఖం' అంబల్ల జనార్ధన్ 'ఒర్రి', బి. మురళీధర్ 'నెమలినార' కస్తూరి మురళీకృష్ణ 'మాయా ప్రపంచం', ఆడెపు లక్ష్మీపతి 'అసందిగ్ధ కర్తవ్యం, రామా చంద్రమౌళి 'దుఖాగ్ని'.

తెలంగాణ బతుకులని చీకటిమయం చేస్తున్న కరెంట్ సమస్య పై బోయ జంగయ్య 'కరెంటుకథ'రాసాడు. తాయమ్మ కరుణ 'వాళ్లు', కె.వి.నరేందర్ 'డబ్బుసంచి' 'ముస్లీం'ల బ్రతుకుల గురించి, సమస్యల గురించి కథలు వచ్చాయి. గీతాంజలి, బచ్చేదాన్, పెహచాన్, అఫ్సర్ గూరీమా, తెలంగీపత్తి, షాజహాన్, సిల్‌సిలా, దీవారే, నిస్సార్‌వతన్, దిలావర్, గీ భూమి నాది.

దళిత జీవన నేపథ్యంలో వచ్చిన కథలు ఉన్నాయి. జాజులగౌరి మన్నుబువ్వ. అనిశెట్టి రజిత మట్టి బంధం లాంటివి మైనార్టీ, దళిత, బి.సి. స్త్రీల జీవిత నేపథ్యంగా వచ్చాయి.

తెలంగాణ కథలో వస్తువు కాలాన్ని వెంటాడింది. కనుకనే కాలంలో వచ్చిన ప్రతి సమస్యను ఆవిష్కరించింది. మొత్తంగా తెలంగాణ కథలో బడుగు, బలహీణ వర్గాల, శ్రామిక, వెట్టిచాకిరీ, భూమి సమస్య, అస్తిత్వ నేపపథ్యంగా సాగిన జీవన పోరాటాలు, ప్రజాపోరాటాలుగా కనిపిస్తాయి.

కులవృత్తుల విధ్వంసం, గ్రామీణ జీవన విధ్వంసం లాంటివి బ్రతుకు దెరువు లేక వలస బతుకుల వ్యథలు, కరెంట్ కష్టాలు, కరువు కాటకాలు, నిరుద్యోగం, ఆత్మగౌరవ నినాదం, స్వరాష్ట్ర ఆకాంక్ష, అందుకోసం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదలైనవి వస్తువులుగా కనిపిస్తాయి.

**ఆధార గ్రంథాలు :**

1. తెలంగాణ చరిత్ర – సంస్కృతి – తెలుగు అకాడమి
2. అస్తిత్వ ప్రాతినిధ్య తెలంగాణ కథలు – తెలంగాణ సాహిత్య అకాడమి
3. కథానిక స్వరూప స్వభావాలు – పోరంకి దక్షిణామూర్తి
4. తెలంగాణ తెలుగుకథ – కాలువ మల్లయ్య

# ప్రాచీన భారతీయ జ్ఞానం – ఆధునిక శాస్త్రాల విజ్ఞానపు మేలు కలయిక : జాతీయ విద్యావిధానం – 2020

డా. సురేశ్ ఎనుగంటి, డా. రవి సబావత్, ఫోన్ : 9553138181, 9701225152

భారతదేశం ఒక దేశంగా వివిధ కాలాలలో అనేక సంవత్సరాల సుదీర్ఘ చరిత్రను కలిగి ఉంది. చాలా మంది చరిత్రకారులు ఈ కాలాలను పురాతన, మధ్యయుగ మరియు ఆధునికంగా వర్గీకరిస్తారు. ఈ కాలాల్లో భారతదేశం ముఖ్యంగా విద్యావ్యవస్థలో విభిన్నమైన మరియు ముఖ్యమైన పరివర్తనలను చూసింది. వేద గ్రంథాలు పురాతన భారతీయ విద్యా వ్యవస్థను ఎక్కువగా ప్రభావితం చేశాయి. నీతి కథల ఆధారంగా లోతైన తాత్విక మరియు శాస్త్రీయ భావనలను ప్రచారం చేయుటకు నాటి విద్యావ్యవస్థ ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చింది. కళ, సాహిత్యాలు వికసించినప్పుడు జ్ఞాన ప్రసరణ ఎక్కువగా సంత చెప్పడం మరియు మేధోపరమైన చర్చలపై ఆధారపడి ఉండేది. ఆనాడు ప్రసిద్ధ గురుకులం వ్యవస్థ కూడా అభివృద్ధి చెందింది. నేటి సహాధ్యాయి అభ్యసనం (peer learning) విధానానికి మాతృకగా ఈ విధానాన్ని పేర్కొనవచ్చు. ఆ కాలంలో విద్య అనేది సామాజిక మద్దతుతో పవిత్రమైన అంశంగా పరిగణించబడింది. భారతదేశంలో వికసించి, ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది, వివిధ దేశాల నుండి విద్యార్థులను ఆకర్షించబడిన బహు విభాగాలతో కూడిన తక్షశిల మరియు నలంద విశ్వవిద్యాలయాలు భారతీయ ప్రాచీన విద్య వ్యవస్థకే తలమానికం. వ్యాకరణం, యుద్ధరీతులు మరియు ఇటీవలి కాలం వరకు కూడా తక్కువ దృష్టి కేంద్రీకరించబడిన ఖగోళ, జ్యోతిష శాస్త్రాలు వంటివి చాల అభివృద్ధి చెందాయి.

మధ్యయుగ కాలంలో విద్యావ్యవస్థ ఎక్కువగా ఇస్లామిక్ దండయాత్రలచే ప్రభావితమయ్యింది . మత విలువల ప్రచారం విద్య యొక్క ప్రధాన ధ్యేయంగా స్థిరపడి, స్త్రీల విద్యపై ప్రత్యేక పరిమితులతో కొద్దిమందికి పాఠ్యాంశంగా చేయడం ద్వారా భారతీయ విద్యావ్యవస్థ యొక్క ప్రాచుర్యం మరియు వైవిధ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఆధునిక భారతీయ విద్యావ్యవస్థ ప్రధానంగా బ్రిటిష్ కాలంలో అమలు చేయబడిన విద్యావిధానాల నుండి ప్రేరణ పొందింది. స్వీయ ప్రయోజనాల కోసం పూర్తి దూరదృష్టితో రూపొందించిన బ్రిటిష్ వారి విధానాలు దేశీయ విద్యా పద్ధతులను పక్కన పెడుతూనే గొప్ప విద్యా వారసత్వాన్ని క్రమపద్ధతిలో నాశనం చేసేందుకు దోహదపడ్డాయి. పురాతన మూలాలు మరియు జ్ఞానంతో సంబంధం చేరిపేసి జ్ఞానం ఏకీకృత అంశంగా కాకుండా వేర్వేరు విభాగాలుగా కృత్రిమంగా విభజించబడి బోధించబడ్డాయి. ఈ విధానాలు బ్రిటీష్ వారికి బాగా పనిచేశాయి. స్వాతంత్ర్యం నుండి చాలా సంవత్సరాల తరువాత కూడా భారతదేశం దురుద్దేశాలతో రూపొందించబడిన బ్రిటిష్ వారి విధానాల బారి నుండి విముక్తి పొందలేకపోయింది.

**జాతీయ విద్యావిధానం – 2020 : భారతీయ జ్ఞాన వారసత్వంకు సంబంధించి కీలక ప్రతిపాదనలు**

జాతీయ విద్యావిధానం – 2020 అనేది భారతీయ విద్యా వ్యవస్థ యొక్క ఉద్దేశ్యం మరియు జ్ఞానవారసత్వాన్ని రెండింటినీ పునరావిష్కరించడానికి తీసుకొనబడిన ఒక సాహసోపేతమైన చొరవ. భారతీయ పురాతన పద్ధతులు వాటికున్న విలువల ఆధారిత అస్తిత్వం కారణంగా కాలం అనే పరీక్షకు తట్టుకొని నిలబడి విజయం సాధించడమే కాకుండా ఆధునిక యుగంలోనూ జాతీయ విద్యా విధానం – 2020 ద్వారా సమకాలీన ఔచిత్యం మరియు ఆమోదాన్ని పొందాయి.

**1. బహుభాషా అభ్యాసాన్ని ప్రోత్సహించడం** – భాష ముఖ్యమైనది. ఎందుకంటే, ఇది వ్యక్తిగత అర్థాన్ని కలిగి ఉంటుంది. సంస్కృతం ప్రపంచంలోని పురాతన భాషలలో ఒకటి మరియు వేదయుగంలో మహాభారతం, అర్థశాస్త్ర, ఆర్యభటీయ వంటి సాహిత్యం, సైన్స్ మరియు గణిత శాస్త్రాలలో కొన్ని గొప్ప గ్రంథాలతో సహా దాదాపు అన్ని వేద గ్రంథాలు సంస్కృత భాషలో రూపొందించబడ్డాయి. ఈ గొప్ప వైవిధ్యంతో కూడిన సాహిత్యం ఒక తరం నుండి మరొక తరానికి సామాజిక వారసత్వంగా అందించబడినవి. స్థానిక మాండలికాలు మరియు మాతృభాషలలోని సూచనల ఫలితంగా పూర్వ కాలంలో విస్తారమైన ప్రజాదరణ మరియు విజ్ఞాన వ్యాప్తి జరిగింది. చాలా కాలంగా ఆలోచనలను నేర్చుకోవడానికి మరియు ప్రసరణ చేయడానికి భాషలు గొప్ప సాధనంగా పరిగణించబడుతున్నాయి. వాస్తవానికి, అనేక అధ్యయనాలు మాతృభాష యొక్క ప్రాముఖ్యతను ముఖ్యంగా పిల్లల జీవితంలోని ప్రారంభ పన్నెండు సంవత్సరాలలో బోధనా మాధ్యమంగా గుర్తించాయి. భారతదేశంలో ప్రస్తుతం అనేక గుర్తింపు పొందిన భాషలు మరియు స్థానిక మాండలికాలు ఉన్నాయి. సంస్కృతం వంటి వాటిలో కొన్ని 5000 సంవత్సరాల నుండి ఉనికిలో ఉన్నాయి. మరో మాటలో చెప్పాలంటే, ఈ భాషలు ప్రాచీన వైవిధ్యం మరియు జ్ఞానం యొక్క చెరిగిపోని ముద్రలు. జాతీయ విద్యావిధానం – 2020 ఈ భాషలను అంతరించి పోకుండా రక్షించడానికి ప్రాంతీయ భాషల అభ్యాసాన్ని ప్రత్యేకంగా ప్రోత్సహించడం ద్వారా ప్రాచీన సంప్రదాయం మరియు జ్ఞానాన్ని పరిరక్షించాలని ఉద్ఘాటించింది.

**2. అభ్యసన కొనసాగింపును ప్రోత్సహించడం :** సంపన్నమైన భారతీయ సాంస్కృతిక వారసత్వం వయస్సు లేదా స్థలం యొక్క ఏవైనా అడ్డంకులు లేకుండా నిరంతర అభ్యాసం యొక్క ప్రాముఖ్యతను రుజువు చేసే ఉదాహరణలతో నిండి ఉంది. అభిమన్యు (మహాభారతం) మరియు ప్రహ్లాదుడు యొక్క పూర్వ అభ్యాసం, మదాలసా లాలి పాటలు, యుద్ధభూమిలో అర్జునుడికి (భగవద్గీత) శ్రీకృష్ణుడి జీవితాన్ని మార్చే ఉపన్యాసాలు వయస్సు లేదా ప్రదేశం యొక్క ఏవైనా అడ్డంకులు లేకుండా నేర్చుకోవడంపై మన కీలక అవగాహన ప్రాముఖ్యతను చాటి చెబుతాయి. జననపూర్వ అభ్యసనం, పుట్టుకకు ముందు భాషణ ప్రసరణ వంటి కొన్ని ఆలోచనలు తరువాత శాస్త్రీయంగా నిరూపించబడి న్యూరల్ ప్లాస్టిసిటీని అనే విభాగం ఆవిర్భవించింది. ఈ పరిణామాల రీత్యా జాతీయ విద్యా విధానం – 2020 పిల్లవాడి పూర్వ బాల్యదశ విద్యపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తుంది.

**3. బహుళ విభాగ అభ్యసనంను ప్రోత్సహించడం :** ఆధునిక సమస్యలు మరియు సవాళ్లు ప్రకృతిలో బహుళ విభాగాలతో సంబంధం కలిగి ఉంటాయి. అందువల్ల, వాటిని పరిష్కరించడానికి బహుళ విభాగాల అధ్యయనం అవసరం. తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలు వైవిధ్యభరితమైన అనుభవాలతో ఉన్నత అనుభవాలకు కేంద్రంగా ఉన్నాయి. పాఠ్యాంశాల్లో ఖగోళ శాస్త్రం, వేదాంత, ఆయుర్వేదం, వ్యవసాయం, న్యాయ మరియు వాణిజ్యం అన్నీ కూడా ఏకీకృత మొత్తంగా బోధించబడ్డాయి. జాతీయ విద్యావిధానం – 2020 కళలు, వాణిజ్యం, చట్టం, భాష, సాహిత్యం, సంస్కృతి, థియేటర్, సంగీతం, సైన్స్, గణిత శాస్త్రాలకు బహిర్గతం చేయడాన్ని ప్రోత్సహించే పురాతన జ్ఞానం నుండి ప్రేరణ పొంది, ప్రస్తుత ప్రత్యేక విభాగాల విధానాన్ని సంస్కరించి బహుళ విభాగాల అధ్యయనం కేంద్రాలుగా వాటిని మార్చడానికి పూనుకుంటుంది. తర్కం, క్రీడలు, వైద్యం, పర్యావరణం, యోగా, మనస్తత్వశాస్త్రం, తత్వశాస్త్రం మరియు సామాజిక శాస్త్రం అన్నీ ఒకే చోట అభ్యాసకుల సమగ్ర వికాసానికి సంబంధించిన అభిప్రాయాలు, చర్చలు మరియు విభిన్న సమస్యలపై చర్చల ఆధారంగా బట్టీపద్ధతిలో కాకుండా విశ్లేషణాత్మకంగా మరియు అర్థవంతమైన అభ్యసనాన్ని ప్రోత్సహిస్తుంది.

**4. ప్రపంచ మేథో కేంద్రంగా భారత్‌ను పునరావిష్కరించడం :** ప్రాచీన భారతీయ విద్యా విధానం ప్రపంచ స్థాయి మరియు ఆకర్షణీయంగా ఉండేది మరియు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలైన కొరియా, చైనా, టిబెట్, జపాన్ మొదలైన అనేకమంది పండితులు సందర్శించి మేథో చర్చలలో పాల్గొన్నారు. వివిధ సమయాల్లో ఈ ప్రదేశాలను సందర్శించిన ఫా–హెయిన్, హువాన్–త్సాంగ్ మరియు ఐ–త్సింగ్ వంటి చైనీస్ పండితుల నివేదికలలో ఇటువంటి అనేక ఆధారాలు ఉదహరించబడ్డాయి. జాతీయ విద్యావిధానం – 2020




భారతీయ విశ్వవిద్యాలయాలను ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యను అందించడం ద్వారా ఇతర దేశాలకు తమ పరిధిని విస్తరించడం ద్వారా భారత్‌ను ప్రపంచ మేథో కేంద్రంగా తీర్చిదిద్దుటకు సంకల్పించింది.

**5. సహాధ్యాయుల అభ్యసనను ప్రోత్సహించడం :** సహాధ్యాయుల అభ్యసనను మానిటరింగ్ సిస్టమ్ ద్వారా అమలు పరిచి ఇంగ్లాండ్ అద్భుతమైన ఫలితాలు ప్రాథమిక విద్యలో సాధించింది. కాని, ఈ పద్ధతి అది ఆవిర్భవించిన భారతదేశంలో మాత్రం శక్తిని కోల్పోయింది. పూర్వపు వేద గ్రంథాలు సహాధ్యాయుల అభ్యసనను పద్ధతి యొక్క ప్రాధాన్యతను నొక్కిచెప్పాయి. ఇది ప్రాచీన భారతదేశంలోని గురుకుల విద్య వ్యవస్థలో ఒక విడదీయరాని భాగంగా ఆచరించబడింది.

**6. మౌలిక సదుపాయాల మద్దతును ప్రోత్సహించడం :** పరిశోధన కార్యకలాపాలను వృద్ధి చేయుటకు మరియు నిధులు సమకూర్చుకొనుటకు కొత్త మార్గాలను అన్వేషించుటకు నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (NRF)ను, విద్యను తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రభావవంతంగా అందించుటకు నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరమ్ (NETF) అను వ్యవస్థలను నిర్మించే ఆలోచనలను ఇది వ్యక్తం చేసింది. ఇవి విద్య సమాజ వనరుల సహాయంతో దాతృత్వం ద్వారా పూర్తి ఉచితంగా అందించబడాలనే పురాతన విద్యావ్యవస్థ ద్వారా ప్రేరణ పొందాయి.

**7. నైపుణ్య శిక్షణలను ప్రోత్సహించడం :** ప్రారంభ వృత్తి శిక్షణను ప్రోత్సహించే ఆలోచన ఇది. ఆరు సంవత్సరాల వయస్సు నుండి కంప్యూటేషన్ ఆలోచనను మరియు వృత్తి విద్య వంటి విద్యా సాంకేతికతను పాఠశాల పాఠ్యాంశాల్లో విలీనం చేయాలి. విజ్ఞాన శాస్త్రాల యొక్క పరిధి తెలియని వాటిని కనుగొనడం లేదా

అన్వేషించని వాటిని అన్వేషించడంపై ఆధారపడి ఉంటుంది. ఇది ప్రధాన భారతీయ తత్వశాస్త్రంలో లోతుగా పాతుకుపోయిన ఆలోచన.

**8. సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించడం:** ప్రాచీన భారతదేశం అంకగణితం, సైనిక శాస్త్రం, న్యాయం, ప్రదర్శన కళలు, నీతి మరియు కళ మరియు వాస్తుశిల్పానికి సంబంధించిన అద్భుతాలతో నిండి ఉంది.

**9. ప్రాచీన భారతదేశంలో గణితం :** దశాంశ సంఖ్య వ్యవస్థ, శూన్య (సున్నా), కలన గణన, త్రికోణమితి వంటి అనేక అద్భుతమైన రచనలు ఆర్యభట్ట, బ్రహ్మగుప్తుడు, భాస్కర-2 మరియు వరాహమిహిర యొక్క గణిత మేధావుల కారణంగా సాధ్యమయ్యాయి. హరప్పా మరియు మొహెంజొదారో యొక్క త్రవ్వకాల ప్రదేశాలు కూడా సింధు లోయ నాగరికత సమయంలో అధిక స్థాయి ఖచ్చితమైన కొలతలు లేదా ఇతర మాటలలో వ్యావహారిక గణిత అభ్యాసాల సాక్ష్యాన్ని సమర్థించాయి. వేదయుగం నుండి శుల్బసూత్రం వంటి అనేక గొప్ప ఉదాహరణలు రేఖాగణిత వ్యక్తీకరణకు అత్యంత ప్రాచీనమైన ఉదాహరణ. తరువాత కాలంలో దీనిని పైథాగరస్ సిద్ధాంతం అని పిలుస్తున్నారు.

**10. వేద యుగంలో ఖగోళ శాస్త్రం (జ్యోతిష) :** పూర్వపు భారతీయ జ్ఞాన వ్యవస్థలో ఖగోళ శాస్త్రం ఒక ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంది. వేదసాహిత్యం గ్రహాలు, సూర్యుడు, చంద్రుల కదలికలతో మన పూర్వ పరిచయాన్ని ఉదహరించే ఉదాహరణలతో నిండి ఉంది. ఆర్యభట్ట, బ్రహ్మగుప్తుడు, వరాహమిహిర తిథి, నక్షత్రం, యుగం, విషువత్తులు మరియు అయనాంతం గణనలో చేసిన కృషి ప్రతి కోణంలోనూ అపురూపమైనది. ఆ కాలంలో అపారమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్న వివిధ ఆచారాలకు సరైన సమయాలను గుర్తించడం వారి కృషి యొక్క ఉద్దేశ్యం.

**11. ప్రాచీన భారతదేశంలో వాస్తుశిల్పం :** ప్రాచీన భారతదేశంలో వాస్తు శాస్త్ర అధ్యయనాలు వాస్తువిద్య లేదా శిల్పశాస్త్రం అని పిలువబడేవి. దేవాలయాలు, భవనాలు, డ్రైనేజీ వ్యవస్థలు మరియు రోడ్ల ప్రణాళిక మరియు నిర్మాణం కోసం మొట్టమొదటి సాంకేతిక విషయం ఉపయోగించబడింది. మొహెంజదారో యొక్క గ్రేట్ బాత్ వంటి సంక్లిష్ట నిర్మాణాలు అధునాతన ప్రణాళిక మరియు నిర్మాణ నైపుణ్యాలను ప్రదర్శించాయి. భోజరాజు (క్రీ.శ.1010-55) 'సమరాంగణ సూత్రధార' అనే గ్రంథం సమర్థవంతమైన నిర్మాణం కోసం ప్రదేశాలు మరియు నేల ఎంపిక మరియు ఇతర నిర్మాణ సామగ్రి యొక్క ప్రాముఖ్యతను కూడా చర్చిస్తుంది. సాంఖ్యాయన గృహ్య సూత్రం, మయమత మరియు మానసార వంటి అనేక ప్రాచీన గ్రంథాలు ప్రత్యేకంగా వాస్తుశిల్పంలోని వివిధ అంశాలకు సంబంధించినవి. వివిధ దేవాలయాలు, కోటలు, స్థూపాలు, కొండలను తొలచి నిర్మించిన గుహలు, ఏకశిలా స్మారక చిహ్నాలు ఏ పురాతన అద్భుతాల కంటే కూడా తక్కువ కాదు.

జాతీయ విద్యావిధానం - 2020 పురాతన జ్ఞానం యొక్క సువాసనలతో నిండి ఉండిన కొత్త పువ్వుల వంటి కొత్త నైపుణ్యాలతో ప్రకాశించే నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని ఊహించింది. ఇది బహుళ-విభాగ విధానాన్ని అవలంబించే సార్వత్రిక ఉన్నత విద్యను ఆమోదించింది. ఇది నలంద, తక్షశిల మొదలైన ప్రపంచ ఆకర్షణలతో కూడిన పురాతన అభ్యాస కేంద్రాల సమగ్ర అభివృద్ధి విధానం నుండి ప్రేరణ పొందిన విధానం. ప్రాచీన భారతీయ జ్ఞానం అభ్యాసం విషయంలో అంతర్గత మరియు బాహ్య అనుభవాలచే ప్రభావితమైన ప్రధాన భావనలపై ఆధారపడి ఉంటుంది. ఒక వైపు, నైపుణ్యం-ఆధారిత అభ్యాసం ప్రముఖంగా ఉంచబడి, మరొక వైపు అంతర్గత అనుభవాలలో లోతైన అంతర్దృష్టులు మరియు ఉనికిని మించిన జ్ఞానం ప్రముఖ పాత్రను ఆక్రమించాయి. వ్యక్తి యొక్క సంపూర్ణ అభివృద్ధికి ఈ ఆలోచనలు అన్ని దోహదపడే విధంగా జాతీయ విద్యావిధానం - 2020 అన్ని జాగ్రత్తలు తీసుకుంది.

**జాతీయ విద్యావిధానం - 2020**

**ఆచరణలో ఎదురయ్యే కొన్ని సవాళ్లు**

1. బహుళ భాషలు, సహాధ్యాయి విధానాలు ఆచరించడానికి శిక్షణ పొందిన మానవశక్తి మరియు సమయం పరంగా అనేక వనరులు అవసరం.

2. విశ్వవిద్యాలయాలను బహుళ- విభాగాల సామర్థ్యానికి వృద్ధి చేయడం, వాటి మధ్య అనుసంధానతను ఏర్పరచడం సవాలుతో కూడుకున్న పని.

3. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అవస్థాపన సౌకర్యాల కల్పన, పాఠ్యాంశాలను పునఃరూపకల్పనకు సృజనాత్మక ప్రయత్నాలు అవసరం.

4. అభ్యాసకుల సమగ్ర అభివృద్ధిని అంచనా వేయడానికి కొత్త వ్యూహాలు అవసరం.

5. అందరికి విద్య అను లక్ష్యాన్ని మరిన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు, ఆన్‌లైన్ విద్య వ్యూహాన్ని అనుసరిస్తూ సాంకేతికతను ఉపయోగించడం ద్వారా సాధించవచ్చు. దీనికి మళ్లీ కనీస హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్ మరియు మారుమూల ప్రాంతాలకు బలమైన సిగ్నల్స్ కలిగిన అంతర్జాల సౌకర్యం అవసరం.

6. జాతీయ విద్యావిధానం - 2020 పాఠశాల స్థాయిలో ప్రారంభ దశలోనే వృత్తిపరమైన భాగాలను పరిచయం చేస్తుంది. మన దేశ మానవ వనరులను సమర్థంగా ఉపయోగించుకోవడం మరియు ఆర్థికాభివృద్ధికి ప్రపంచ నైపుణ్యాల డిమాండ్‌ను తీర్చడం వంటి దృక్కోణం నుండి ఇది స్వాగతించదగినదే. కాని, దీనికి తగినట్లు

విద్యార్థులు, తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల వైఖరులలో మార్పు తీసుకురావడం అతిపెద్ద సవాలు.

**ముగింపు**

ప్రపంచంలోని పురాతన నాగరికతలలో భారతీయ నాగరికత ఒకటి. భారతదేశం ఒకప్పుడు విద్య మరియు వ్యక్తి మూర్తిమత్వం రూపొందించుటలో ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా ఉండేది. కాలానుగుణంగా విదేశీ యాత్రికులు, సందర్శకులు మరియు పండితులు చేసిన విభిన్న వ్యాఖ్యానాలలో మన గొప్ప వారసత్వం యొక్క గాథ చిరస్థాయిగా నిలిచిపోయింది. పురాతన నాగరికతలు మానవుడు అద్భుతంగా జీవించడానికి ఏర్పరుచుకున్న అభివృద్ధి చెందిన డ్రైనేజీ వ్యవస్థలతో చక్కగా ప్రణాళికాబద్ధమైన పట్టణాలను నిర్మించడం నాటి భారతీయుల నైపుణ్య ఔన్నత్యాన్ని సూచిస్తున్నవి. ఏ విధమైన నైపుణ్య శిక్షణ లేకుండా లేదా ఇతర మాటల్లో చెప్పాలంటే దృఢమైన విద్యావ్యవస్థ లేకుండా ఇది సాధ్యం కాదు. కాబట్టి, భారతీయ విద్యా వ్యవస్థ చరిత్ర కూడా భారతదేశ చరిత్ర పురాతన కాలం నుండి ఆధునిక రోజుల వరకు పరిణామం ద్వారా నిరంతర మార్పును తనలో ఇముడ్చుకుంటుంది. క్రమంగా ప్రపంచం కూడా భారతీయ తత్వశాస్త్రంలో లోతుగా పాతుకుపోయిన యోగా, ధ్యానం మరియు కనీస జీవనం వంటి పురాతన భావనల యొక్క ప్రధానత్వాన్ని అంగీకరిస్తోంది. అందువల్ల, జాతీయ విద్యావిధానం – 2020 వలె సమకాలీన ప్రధాన స్రవంతి జ్ఞాన వ్యవస్థలో భాగంగా భారతీయ జ్ఞాన వ్యవస్థను పునరుజ్జీవింపజేయడానికి మరియు ప్రోత్సహించడానికి ఏ ఆలోచనా ప్రక్రియ అయినా స్వాగతించదగినదే.

**ప్రస్తావనలు**

1. బ్రాక్, సి. (2017). దక్షిణ ఆసియా మరియు హిందూ మహా సముద్ర దీవులలో విద్య. బ్లూమ్స్‌బరీ పబ్లిషింగ్.

2. కొలచన, ఎ., మహేష్, కే., రామసుబ్రమణియన్, కే. భారతీయ గణితం మరియు ఖగోళ శాస్త్రంలో అధ్యయనాలు.

3. జగదీష్ కుమార్, వి. (2020) జాతీయ విద్యా విధానం భారత దేశంలో ఉన్నత విద్యను ఇది ఎలా ప్రభావితం చేస్తుంది?
ఐఇటీఇ సాంకేతిక సమీక్ష, 37:4,327-328, DOI: 10.1080/02564602.2020.1806491.

4. కుమార్, కే., ప్రకాష్ ఏ., సింగ్, కె. (2020). జాతీయ విద్యా విధానం 2020 భారతదేశంలోని భవిష్యత్తు తరాలను మార్చడానికి ఎలా లోడ్ స్టార్ట్ గా ఉంటుంది? జర్నల్ ఆఫ్ పబ్లిక్ అఫైర్స్.

5. గోవిందా, ఆర్.(2020) ఎన్ఇపి2020: ఒక క్లిష్టమైన పరీక్ష– సామాజిక మార్పు, 50(4), పేజీలు. 63 – 67.

6. జాతీయ విద్యా విధానం 2020 భారత మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ. (2020).
https://www.education.gov.in/sites/upload_files/mhrd/files/NEP_Final_English_0.pdf.

7. మీనన్, ఎస్. (2020) ఎన్ఇపి 2020: కొన్ని శోధన ప్రశ్నలు– సామాజిక మార్పు, 50(4), పేజీలు. 599– 602.

8. ఎన్ఇపి 2020: ఉన్నత విద్య సంస్థాగత పునర్నిర్మాణం మరియు ఏకీకరణ (2020 సెప్టెంబర్ 29) ఎడ్యుకేషన్ వరల్డ్,
https://www.educationworld.in/nep-2020-higher-education-institutionalrestructuring-and- consolidation/

9. 21వ శతాబ్దంలో విద్య: ఉద్భవిస్తున్న సమస్యలు మరియు ముందుకు వెళ్లే మార్గం.నమ్య ప్రెస్.

10. పార్టనెన్, ఇ., కుజాలా, టి., నాటానెన్, ఆర్., లియిటోలా, ఎ., సంబెత్, ఎ., హుయోటిలైన్, ఎం. (2013). పుట్టుకకు ముందు స్పీచ్ ప్రాసెసింగ్ యొక్క అభ్యాస–ప్రేరిత న్యూరల్ ప్లాస్టిసిటీ. నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రొసీడింగ్స్, 110(37),15145–15150.

11. పారక్, ఆర్.పి. (2012). భారతీయ విద్య అభివృద్ధి మరియు సమస్యలు. పియర్సన్ ఎడ్యుకేషన్ ఇండియా.

12. శ్రీనివాస్, ఎం.డి. (2016). అమరభారతి: సంస్కృతం మరియు భారతీయ నాగరికత పునరుజ్జీవనం–II.

13. కపూర్, ఆర్. ప్రిన్సిపల్స్, వాల్యూస్, ఎథిక్స్ అండ్ ది ఎడ్యుకేషన్ సిస్టమ్: యాన్ ఓవర్‌వ్యూ ఆఫ్ ఏన్షియంట్ ఇండియన్ ఎడ్యుకేషన్.

14. యాదవ్, యు. (2018). ప్రాచీన మరియు ప్రస్తుత విద్యా వ్యవస్థ యొక్క తులనాత్మక అధ్యయనం. సైన్స్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ మరియు సోషల్ డెవలప్‌మెంట్‌లో ఇటీవలి ట్రెండ్స్, 160.

**1. డా. సురేష్ ఎనుగంటి**
**ప్రిన్సిపాల్, ఎస్.ఆర్. కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, దుబ్బాక,**
**ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్,**
**మొబైల్: 9553138181**
e-mail: surijrf@gmail.com.

**2. డా. రవి సబావత్**
**అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్టుమెంటు ఆఫ్ పొలిటికల్ సైన్స్,**
**ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్,**
**మొబైల్: 9701225152**
e-mail: naikraviou@gmail.com.

# సాహితీ పురస్కార నవలలు – తెలంగాణ జీవన నేపథ్యం

**డా. లింగాల మంగమ్మ**, పోస్ట్ డాక్టరల్ ఫెలో, తెలుగుశాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఫోన్ : 9652009764

తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం జస్టిస్ ఆవుల సాంబశివరావుగారు అందజేసిన నివేదికను ఆమోదిస్తూ 1985 డిసెంబరు 2న, శాసనసభ ప్రత్యేక చట్టం నెం.27 ప్రకారం ఏర్పాటు చేసింది. తెలుగు విశ్వవిద్యాలయం బోధన, పరిశోధన, శిక్షణ, అభ్యసన, ప్రచురణ లక్ష్యాలను ఏర్పరచుకున్నది. కవులుగా, రచయితలుగా, పండిత పరిశోధకులుగా లబ్ధప్రతిష్ఠులైన ఎంతోమంది ప్రముఖులు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా పని చేశారు. ఆచార్య తూమాటి దొణప్పగారు, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా.సి. నారాయణరెడ్డిగారు, ఆచార్య పేర్వారం జగన్నాథంగారు, ఆచార్య నాయని కృష్ణకుమారిగారు, ఆచార్య ఎన్.గోపిగారు, ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యంగారు, డా. ఆవుల మంజులతగారు, ఆచార్య ఎ.భూమయ్యగారు, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారు, ఆచార్య ఎస్వీ సత్యనారాయణగారు, ప్రస్తుతం ఆచార్య తంగెడ కిషన్‌రావుగారు తమతమ ఆలోచనలతో విశ్వవిద్యాలయాన్ని లక్ష్యసాధనోన్ముఖంగా నడిపారు, నడుపుతున్నారు.

1985లో ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయం 1986 నుండి సాహితీ పురస్కారాలు వివిధ ప్రక్రియల్లో ఉత్తమంగా ఎంపికైన గ్రంథాలకు ఇస్తున్నారు. తెలుగు సాహిత్యంలోని పద్యకవిత, వచనకవిత, బాలసాహిత్యం, కథ, నవల, సాహిత్య విమర్శ, నాటకం, నాటికల సంపుటి, అనువాదం, వచనరచన, రచయిత్రి ఉత్తమ గ్రంథాలకు ఈ సాహితీ పురస్కారాలను అందిస్తుంది. మంచి పుస్తకాలు రావడానికి, రచయితలకు ప్రోత్సాహం ఇవ్వడానికి, ఆయా ప్రక్రియల్లో సాహిత్య ప్రమాణాలను పెంపొందించడానికి ఈ పురస్కారాలు తోడ్పడుతున్నాయి.

అటువంటి ప్రక్రియల్లో భాగమైన ప్రజాదారణ పొందిన నవల ప్రక్రియపై డా.ఎల్.మంగమ్మ అను నేను తెలుగు విశ్వవిద్యాలయం ప్రముఖులతో చర్చించి సాహితీ పురస్కార నవలలను (1986-2010) పిహెచ్.డి పరిశోధనకు తీసుకుని, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 2014లో పరిశోధన పూర్తి చేశాను. అందులో భాగంగా తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కార నవలలైన జాతర (1989–బోయజంగయ్య), బతుకుపుస్తకం (2001- కాలువ మల్లయ్య), జోగిని (2006–వి.శాంతిప్రబోధ) , సలాం హైద్రాబాద్ (2007–లోకేశ్వర్), పొలిమేర (2010–గూడ అంజయ్య) నవలల్లో వున్న తెలంగాణ గ్రామీణ జీవన నేపథ్యాన్ని పరిశోధన వ్యాస నిమిత్తం పరిశీలించి వివరించదలచాను.

**1. జాతర :** బోయజంగయ్యగారు 1942వ సంవత్సరం సెప్టెంబర్ 1న లింగారెడ్డి గూడెం అనే గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు ఎల్లమ్మ, మల్లయ్య. ఈయన రాసిన జాతర నవల 1989వ సంవత్సరంలో తెలుగు విశ్వవిద్యాలయం వారి నుండి ఉత్తమ నవలగా సాహితీ పురస్కారాన్ని పొందింది. పిల్లలు కలుగక పోవడమనే కుటుంబ సమస్యను ఇతివృత్తంగా తీసుకుని రాసిన నవల జాతర. ఈ నవలలో కుటుంబ సమస్యలతో పాటు సమాజంలోని మూఢాచారాలను, బ్రాహ్మణ ఆధిపత్య భావజాలాన్ని, స్త్రీల కష్టాలను ఇతివృత్తంలో భాగంగా చేసుకుని చాలా వివరంగా చిత్రించారు. తెలంగాణ గ్రామీణ జీవన నేపథ్యంతో చిత్రింపబడిన నవల ఇది. కథా రచయితగా పేరు పొందిన బోయజంగయ్య రాసిన మొదటి నవల ఇది.

ఈ నవలలో పూజారి చేసే తతంగం స్త్రీలపై సంప్రదాయ ముసుగులో జరిగే అన్యాయానికి ఇదొక ప్రతీక. ఆ ఊరిలోని పిల్లలులేని స్త్రీలందరికీ లింగపూజ తర్వాత మన్మథ పూజ చేయించే పూజారులు, వారి భార్యలకు పిల్లలు పుట్టకపోతే వారిని మాత్రం లింగపూజకు తీసుకురారు. దీన్ని గమనించైనా మూఢవిశ్వాసాలను పెద్దవారు, వాటిని నమ్మేవారు ఎందుకు వదులుకోరో? ఆలోచిస్తే అందులోని లోగుట్టు తెలుస్తుంది. ఇది బ్రాహ్మణేతర స్త్రీలపై జరిగే లైంగిక చర్య. ప్రధాన పాత్ర అయిన రాధ చేత తెలంగాణ సమాజానికి పూజారి మోసానికి మూఢవిశ్వాసాల పేరుతో బలైన రాధ ద్వారా **"ఒక మనిషి అవసరం మీద మరో మనిషి ఎప్పుడు వల విసురుతూనే ఉన్నాడు. యితరుల అవసరాన్ని గుర్తు చేసి భయాన్ని మనిషే సృష్టిస్తున్నాడు. దేవుని పేరు చెప్పి ఆ భయాన్నే అణిచివేస్తున్నాడు. ఈ మధ్యలో తన అవసరాలను తీర్చుకుంటున్నాడు. భయం ఉన్నంత వరకు ఈ బాధలు తప్పవు మరి"** (జాతర,పు.111) అని, తన మామయ్య సీతయ్యపటేల్ మాటలన్నీ మూఢనమ్మకాలనీ, కులవృత్తి చేసే రజక మంగి మాటలు జీవిత సత్యాలని తెలియజేస్తూ, తెలంగాణ గ్రామ స్త్రీలు, ప్రజలు ఎలా మోసాలకు గురవుతున్నారో తెలియజేశారు బోయజంగయ్యగారు.

జాతర నవలలో రచయిత పాలేరు రంగడు పాత్ర ద్వారా అయ్యవార్లు తమకు ఉపయోగపడే విధంగానే ఏదైనా చేస్తారు. వారు తెలివిగలవారనీ ఈ విధంగా అనిపిస్తారు. **"గొర్రె పిల్లను అడిగిన మల్లయ్య రంగడుతో గొర్రెపిల్ల ఎందుకు ఆవుదూడ అయితే అది పెద్దదవుతూ కదుతూ ఈనుతూ ఉంటే అయ్యగార్లందరికీ పాలు, పెరుగు, నెయ్యి ఉంటాయి"** అంటాడు. ముసిముసిగా నవ్వుతూ అందుకు రంగడు **"హు, ఆల్లు సదుకున్నోలు నీవోలే, నావోలే ఎడ్డి**

**సన్నాసులుకారు. ఏది సేచిన కూసున్న సోటికే కబడొస్తట్టే సూసుకుందురు"** (జాతర,పు.7) అంటూ పూజారుల స్వభావాన్ని తెలియజేస్తారు.

గుర్రపు బండి నడిపే రాజయ్య ద్వారా ఎంతకష్టపడినా కష్టం తప్ప ఫలితం దక్కదనే సత్యాన్ని గ్రహించి పట్నం పోతేనే ఆర్థికంగా బాగుపడగలమని వలస విధానాన్ని, తెలంగాణలోని గ్రామ జీవితాన్ని రచయిత తెలియజేశారు. అక్కడ గ్రామాల్లో వ్యభిచారం చేసిన స్త్రీలను ఎర్రగా కాల్చిన గడ్డపారను రెండు చేతులతో పట్టుకుని నిజాయితీని చాటమంటారు. దోషి అయినాకాకపోయినా నిప్పు ముట్టుకుంటే కాలుతుంది. కానీ నిప్పు పట్టుకుని నిజాయితీని చూయించమంటూ స్త్రీలను బాధించడమనే దురాచారం ఈ నవలలో కనిపిస్తుంది.

సాధారణంగా ఎక్కువమంది పాఠకులు చివరికేమవుతుంది అన్న ఉత్కంఠతోనే రచనలను చదువుతారు. చక్కటి సన్నివేశాలు కల్పిస్తూ, పట్టుసడలకుండా కథను చెప్తూనే, ముగింపులోని కీలక విషయాన్ని రచయిత తెలియజేశారు. మోతుబరులైన రైతులు, వారి కుటుంబాల లోని స్త్రీలు, నౌకర్లు, కూలీలు, వృత్తిపనివాళ్లు, పోలీసులు, పూజారులు మొదలైనవారితో తెలంగాణ గ్రామీణ వ్యవస్థకు నిండుదనం చేకూర్చారు రచయిత. జాతర, తిరణాలు, ఉత్సవం ఇలా పేర్లు ఏవైనా దేశమంతటా ఇంచుమించు ఒకే విధంగా కొనసాగుతున్న జాతర దృశ్యాలను మన కళ్లకు కట్టినట్టుగా చిత్రించబడ్డాయి. తెలంగాణ గ్రామీణ జీవితంలో జాతర ఎలా జరుగుతుందో తెలుస్తుంది.

**2. బతుకు పుస్తకం :** కాలువ మల్లయ్య కరీంనగర్ జిల్లా జూలపల్లి మండలంలోని తెలుగుకుంట గ్రామంలో 12-1-1953వ సంవత్సరంలో శ్రీ ఓదేలు, శ్రీమతి పోచమ్మ దంపతులకు జన్మించారు. ఈయన తెలుగులో కథ, నవల ప్రక్రియలను స్పృశించారు. బతుకుపుస్తకం నవలకు 2001వ సంవత్సరానికిగాను తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాన్ని ఇచ్చి, గౌరవించింది. ఈ నవలకు ఆటా అవార్డు కూడా వచ్చింది.

కాలువ మల్లయ్య రాసిన బతుకుపుస్తకంలో గత ఐదు దశాబ్దాలుగా తెలంగాణ గ్రామ జీవితంలోని పరిణామాల్ని కళ్ళకు కట్టినట్టుగా చిత్రించారు. తెలంగాణ జీవిత వాస్తవికతను ఆవిష్కరించడం ఈ నవలలోని ప్రధానాంశం. ఎండాకాలంలో ఎండలకు తెలంగాణలో జొన్నపిండి, ఉల్లిగడ్డలతో అంబలి తాగుతారని తెలంగాణ గ్రామీణ జీవితాన్ని తెలియజేశారు. "ఎండలు....ఎండలు....ఎండలు విపరీతమైన ఎండలు.... రోహిణి కార్తె ఎండలు. రోళ్ళను బద్దలు చేసే ఎండలు....పొలాలన్నీ నెర్రెలు బాసున్నాయి. నేలకు పగుళ్ళు.... జబార్ల నిండా నీళ్ళు చేదడానికి కడుపులో పేగులు నోట్లో కొస్తున్నాయి. చల్లని పానీయంగా చాలా ఇండ్లలో జొన్నపిండి. కలితో కాచిన అంబలి వాడుతున్నారు. ఉల్లి గడ్డ కొరుకుతూ అంబలి తాగుతుంటే ఎంతో రుచికరంగా ఉంటుంది ....నోరూరించేట్టుగా ఉంటుంది. ....." అంటూ తెలంగాణ అంబలిని పరిచయం చేశారు. (బ.పు.పుట.45)

తెలంగాణ ప్రాంతంలో అదో ఊరు. పారిశ్రామిక నాగరికతకు సుదూర తీరంలో ఉన్న గ్రామం. ఆ ఊరు చుట్టుపక్కల ఏ పట్టణమూ లేదు. పట్టణ నాగరికత అసలే లేదు. అయితే దొరలు, పట్వారీలు, పోలీసు పటేండ్లలాంటి చిల్లరదేవుళ్లు ఆ ఊళ్లోనూ ఉన్నారు. రామసింహకవి జగిత్యాలకు చెందినవాడు. ఆయన వందలాది కీర్తనలు రాస్తాడు. ఆ కీర్తనల్లో సమాజ ధిక్కరణ ఉంది. సమాజంలోని దుర్మార్గాలను, అవినీతిని నిరసించడం కూడా ఈ నవలలో ఉంది. బతుకుపుస్తకం నవలలో గత ఐదు దశాబ్దాలుగావున్న గ్రామ జీవితం లోని పరిణామాలూ, తెలంగాణ గ్రామీణ వాస్తవికత దర్శన మిస్తున్నాయి.

**3. జోగిని :** 'జోగిని' నవలను వి.శాంతిప్రబోధ రాశారు. ఈ నవల 2006వ సంవత్సరంలో తెలుగు విశ్వవిద్యాలయం వారిచే ఉత్తమ నవలగా సాహితీ పురస్కారం పొందింది. ఈ నవల తరతరాల దురాచారాలపై సమగ్ర కథాత్మక రచన. పల్లెసీమల్లోనూ ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో తరతారలుగా ఎందరో మహిళల జీవితాలను నరకంగా మార్చిన జోగిని దురాచారాలపై పరిశీలన జరిపి రాసిన వాస్తవిక కథ ఈ నవలలోని ఇతివృత్తం.

మహాభారతంలోనూ మాతంగుల ప్రస్తావన కనిపిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో వీరిని 'జోగినులు' అంటారు. ఏడాది మొదలు 12, 13 సంవత్సరాలలోపు పిల్లలను దేవతలకు జోగినిగా అంకితం చేస్తారు. ముఖ్యంగా షెడ్యూల్డు కులాలకు చెందిన మాల, మాదిగ కులాల్లోనే ఈ ఆచారం ఎక్కువగా కనిపిస్తుంది. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ ప్రాంతంలో ఒక ఊరిలోనే 20 నుండి 30 వరకు జోగినులు కనిపిస్తారు. ఎల్లారెడ్డి ఏరియాలో నాలుగైదు ఊర్లకు కలిపి ఒకరు ఉంటారు. అది ఆ కుటుంబానికి వంశపారంపర్యంగా వచ్చే ఆచారం.

జోగినుల చారిత్రక నేపథ్యం చూసినట్లైతే ప్రాచీన కాలం నుంచి పెళ్లికాని ఆడపిల్లలను దేవాలయంలో సేవకోసం మొక్కుబడిగా సమర్పించేవారు. వారు శాస్త్రబద్ధమైన నాట్యం చేసేవారు. రాజులు కూడా 'దేవాలయ కాంతల' పద్ధతిని పోషించి వారి వలన వచ్చే రాబడిని సైన్యపు ఖర్చులకు ఉపయోగించేవారు. దేవుని పేరుమీద వదిలివేయబడినవారు తర్వాత వీరు పడుపు వృత్తిలోకి దిగజార్చ బడ్డారు. తెలుగు దేశంలో వీరిని బసివిరాండ్రులనీ, దేవదాసీలు అని వ్యవహరించేవారు. బసవల పేరు మీద వదిలిన వారిని బసివిరాండ్రని (శైవమతంలో), వైష్ణవులకు సమర్పించిన వారిని దేవదాసీలని (వైష్ణవ మతంలో) పిలిచేవారు. బసివి సంప్రదాయం శైవమతాన్ని ఆదరించిన కాకతీయ, రెడ్డి, వెలమ రాజులకాలంలో మొదలై ఉండవచ్చు. బసివిరాండ్రినే జోగినులు, బసివిలు, మాతంగులు, మాతమ్మలు,

శివసతులు, పార్వతులు అని రకరకాలుగా పిలిస్తే వైష్ణవులు మాత్రం దేవదాసీలు అనేవారు. పురాణేతిహాసాలలో దేవదాసీల ప్రస్తావన ఉంది.

కులాలు, సంప్రదాయాలు, ఆచారాలంటూ జోగినులు ఎంత హింసకు గురవుతున్నారో రచయిత్రి ముందుగా విద్య పాత్ర ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేశారు. 'నవ వ్యవస్థాపనకు నిర్మాతలు మీరే' అనే స్పృహను జోగినులలో ముఖ్యంగా దళిత స్త్రీలలో కలిగిస్తుంది ఈ నవల. మార్పు వెంటనే రాదు దానికోసం ఎదురుచూడాలి. కానీ అది వస్తే మన అభివృద్ధికి మనమే బాధ్యులమని రచయిత్రి తెలియజేశారు. పోతురాజు వీరిలో ముఖ్యపాత్ర. ఇతను లేనిదే జోగినీ వ్యవస్థ లేదు. పరశురామ చరిత్రలో పోతరాజు కథ ఉండడంవల్ల వారి ప్రస్తావన అప్పటి నుండీ వుంది. జోగినులకు లగ్గం చేసేదగ్గర నుండీ అంతా పోతురాజే చూసుకుంటాడు. ఇతను ఆ వ్యవస్థకు ఒక పూజారిలాంటివాడు. ఇతను చెప్పినట్టు అందరూ వింటారు. వీరిని కూడా జోగినులతో పాటు ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది.

జోగిని నవలలో ముత్తెమ్మ, విద్యపిన్ని కూతురు రమ, కవిత వాళ్ళ అమ్మ రాంబాయి తమ సమస్యలను ఎదుర్కోలేక, మానసికంగా ఎన్నో సమస్యలకు గురికావడం, కోరికలు అణచివేయబడడంతో ఆ ఒత్తిడిని తట్టుకోలేక శరీరం ఏర్పరచుకునే స్థితే హిస్టీరిక్ స్థితి. ఆ హిస్టీరిక్ స్థితి ఆ ముగ్గురు స్త్రీలు కలిగివున్నారు. ఏ జాతియైనా, కులం అయినా స్త్రీకి కష్టాలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. ఆమె ఎవరికీ ఎదురు చెప్పలేక, మానసికంగా చిత్రహింసలు పడుతూనే ఉంది. జోగిని అయితే మానసికంగా, శారీరకంగా హింసకు గురవుతుంది. పితృస్వామిక వ్యవస్థ ఏవిధంగా స్త్రీని అణచివేస్తుందో, హిస్టీరిక్ స్థితి అంటే పూనకం వచ్చిందనో, మరేదో వచ్చిందనో వారు తమ బాధలను తెలియజేయలేక హిస్టీరిక్ స్థితిలోకి వెళ్ళిపోతున్నారు.

స్త్రీ ఎంత చదివినా, ఎదిగినా బాధ పడాలనే విధంగా, మనకు పాతతరం రాంబాయి, బాధపెట్టేవాడిగా రాజాగౌడ్ కనబడితే, కొత్తతరంలో కవిత, ఆమె భర్త రూపంలో అదే సమస్య. స్త్రీ బాధ, స్త్రీ అణచివేయబడడం, తక్కువగా చూడబడడం కనబడుతుంది. జోగినీ అయినా ఆదర్శమూర్తిగా, గొప్ప వ్యక్తిత్వం గలదిగా, ఆత్మ స్థైర్యంతో ముందుకు నడిస్తే సామాన్య స్త్రీ చదువుకున్నాకూడా కొంతవరకు మగవాడి బానిసత్వానికి బలవుతూనే ఉంది. జోగిని అయినా, దళిత స్త్రీ అయినా, ఏ స్త్రీ అయినా పరిపాలనా వ్యవహారంలో ముందుంటే ఆ గ్రామం, ఆ మండలం, ఆ రాష్ట్రం, ఆ దేశమే అభివృద్ధి చెందుతుందనడానికి జోగిని పోశవ్వ పాత్రే ఉదాహరణ.

జోగిని నవలలో రాజాగౌడ్, భోజాగౌడ్, ఆనాటి జమిందార్లు, జానారెడ్డి, వెంకన్నపటేల్, జగపతిరావు, ఉపసర్పంచ్ శివప్ప వీరందరు అధికారంతో తమ పబ్బాలు గడుపుకుంటూ, పోశవ్వకు ప్రతినాయకులుగా చెలామణి అవుతారు. వీరిని సహజంగా చిత్రించారు రచయిత్రి. జోగిని నవలలో 1995 మార్చిలో వచ్చిన ఎన్నికల్లో 73వ రాజ్యాంగ సవరణను ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుంది. ఈ క్రమంలో సిరిపురం గ్రామ పంచాయితీ జనరల్ మహిళకు రిజర్వు అవ్వడం. జనరల్ అభ్యర్థిగా వకుళాదేవి నిలబడడం. ఆమెకు ప్రత్యర్థిగా రాజాగౌడ్ దళిత మహిళ జోగిని అయిన పోశవ్వను నిలబెట్టే సన్నివేశమే ఈ నవలకు ముఖ్యమైన మలుపు. అది జోగిని వ్యవస్థకే గొప్ప మలుపుగా భావించవచ్చు. పోశవ్వ పోటీ చేయడమనే సన్నివేశంను రచయిత్రి ఏర్పరచడం జోగినీ వ్యవస్థకే విముక్తిగా భావించవచ్చు.

జోగిని నవలలో కథను రచయిత్రిగారు ఊరపండగ ఉత్సవం ద్వారా నేరుగా జోగినులను ప్రస్తావిస్తూ, విద్య పాత్ర ద్వారా కథను నడిపించారు. జోగినులలో ఉండే అజ్ఞానాన్ని సూర్యోదయం వెలుగు నింపుతుందనే సామాజిక స్పృహను కలిగిస్తూ నవలను సూర్యోదయ వర్ణనతో ప్రారంభం చేశారు రచయిత్రి. జోగిని నవల ముగింపు ఊహాతీతమైంది. జోగినిగా ఎన్నో అవమానాలను, బాధలను ఎదుర్కొన్న పోశవ్వ పంచాయితీ మెంబరుగా, మండల అధికారిగా ఎదగడం, ఎల్లారెడ్డి మండలానికి, ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాలకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేయడం, చివరకు ఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదగా 'నీరజా బానాత్' అవార్డును అందుకోవడం పాఠకుని ఊహకు అతీతమైంది. రాంబాయిలా కవిత, రాజాగౌడ్‌లా ఆమె భర్త చదువుకున్న వారైనప్పటికీ అలాగే ప్రవర్తించడం, జోగిని అయిన పోశవ్వ ఒక మహోన్నత స్థాయికి చెరుతుందని విద్య భావించడం ఇందులోని ముగింపు. పోశవ్వ స్థితిని పాఠకుడు ఊహించడు. అంతేగాక రాంబాయి, రాజాగౌడ్‌లకు ప్రతిరూపంగా కవిత, ఆమె భర్త సామ్యం కలిగి ఉండడం అనేది చదువులేని జోగిని వ్యవస్థకు గురైన పోశవ్వ మారగా చదువుకుని నాగరికత కల్గిన కవిత, ఆమె భర్త మారకపోవడం పాఠకుని ఊహకు అతీతమైన ముగింపుగా చెప్పవచ్చు.

**4. సలాం హైద్రాబాద్ :** సలాం హైద్రాబాద్ నవలకు 2007 లో తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. ఈ నవలలో స్వామి అనే 55 సంవత్సరాల వ్యక్తి నాలుగు వందల సంవత్సరాల చరిత్రవున్న చార్మినార్‌కు, అతనికి 18 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు తన జీవితంలో జరిగిన సంఘటనలు అతని పాత్ర ద్వారా రచయిత లోకేశ్వర్ తెలియజేస్తారు. స్వామి 17వ ఏట 1969 జనవరి 15న ప్రారంభమై 1970 జులై 10న వెంకటాపుసత్యం, ఆదిభట్ల కైలాసం ఎన్ కౌంటర్ వార్త తెలిసిన రోజుతో ముగుస్తుంది ఈ నవల.

మధ్యతరగతి కుటుంబాల యొక్క పరిస్థితులను, కుల వృత్తుల గురించి, వారి నివాసం, వారి ఆహారపు అలవాట్లు, వారి సంస్కృతి మొదలైనవన్నీ కుటుంబ నేపథ్యంగా తెలుస్తున్నాయి. తెలంగాణలో

స్థానిక ప్రజలు రెండు వందల సంవత్సరాలుగా ఈ అన్ని కారణాల వల్ల కోల్పోతున్నదేమిటో అది ఎలా 1969 ఉద్యమంలో వ్యక్తమైందీ, స్థానికత ఒక అస్థిత్వ ఉద్యమంగా రూపదిద్దుకున్నదో, ఆ తర్వాత అనేక ఉద్యమాలకు ఏవిధంగా దోహదం చేసిందో, ఎందరో అమరవీరుల ప్రాణత్యాగాలు, జై తెలంగాణ నినాదాలు, అమాయకుల రక్తంతో తడిసిన తెలంగాణ నేలలు, చదువుకోల్పోతున్న ఎందరో విద్యార్థులను స్వామి, అశోక్ వంటి పాత్రల ద్వారా తెలుసుకోవచ్చు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జెఫ్రీ, రేణుక, ప్రేంకిశోర్ వంటి విద్యార్థులు తమ ప్రాణాలనే అర్పించారు. ఎందరో అమాయకులు, విద్యార్థులు అంగ వైకల్యాన్ని పొందారు. ఆనాడు వార్తాపత్రికలు ఏవిధంగా ఉండేవి, రేడియోలలో వచ్చే వార్తలు ప్రజల్ని ఏవివధంగా ఆకర్షించేవో కూడా తెలుస్తుంది. పోలీసుల జులూం, లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగాలు ఏవిధంగా ఉన్నాయో ఈ నవల తెలియజేస్తుంది.

చార్మినార్తో తన గత చరిత్ర తాలూకు గాయాల్ని, రగిలిన జ్వాలలను స్వామి చెప్పుకున్నాడని ఈ నవల ద్వారా మనకు తెలుస్తున్నది. ఇదొక "హైద్రాబాదీ" ఆత్మకథ. తెలంగాణ నవలేగానీ ఇది చార్మినార్ ఆత్మచారిత్రాత్మక నవల. 1969లో ప్రత్యేక తెలంగాణ పోరాట ఉద్యమానికి గుండెకాయ వంటి హైద్రాబాద్ అరుదైన చరిత్ర. అణచివేయబడిన పోరాట చరిత్ర. రక్తమాంసాలున్న మనుషులు మన కళ్లముందు చరిత్రలోని పాత్రలుగా, నవలలోని పాత్రలుగా, చరిత్ర నిర్మించిన వాళ్లు ఈ నవలలో కనిపిస్తున్నారు. ఒక రాజకీయ పోరాటంలో పాల్గొంటున్న ఈ మనుషులు తమ అభిరుచులు, స్నేహాలు, ప్రేమలు, అనుబంధాలతో మనను చుట్టుముడతారు. అంతేగాక ఈ నవలలో చార్మినార్, గోల్కొండ, నిజాంకాలేజి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, బషీర్ బాగ్, లక్డీకాపూల్, కోఠి మొదలైన ప్రదేశాలు హైదరాబాదులో ఉన్నాయని చెబుతూ వాటి ప్రాచీనతను తెలియజేశారు రచయిత. అంతటి గొప్పదనం కలిగిన హైదరాబాదుకు ఆయన సలాం హైద్రాబాద్ అనే నామకరణం ప్రదేశాన్ని బట్టి సూచించారు. ప్రశ్నోత్తర సంభాషణలు కూడా ఈ నవల్లో ఉన్నాయి

సలాం హైద్రాబాద్ నవలలో వేణు ఆదర్శవంతమైన పాత్ర. ఇతను తండ్రి చనిపోయిన తర్వాత కుటుంబ భారాన్ని మోస్తూ, ఒకవైపు చదువుకుంటూ, మరొక వైపు ఉద్యోగం చేస్తూ, కుటుంబానంతా పోషిస్తూ, కేవలం కుటుంబ బాధ్యతేకాక దేశసేవ చేయాలనే కాంక్షను కూడా కలిగి ఉంటాడు. అనేక కవిత్వాలు రాశాడు. తెలంగాణ ఉద్యమంలో పోల్గొన్నాడు. చివరకు వేరొక ప్రదేశంలో ఉద్యోగం వచ్చి వెళ్ళే సమయంలో తన స్నేహితుడైన స్వామికి జీవితంలో ఎలా ఉండాలో చెప్పి వెళ్తాడు. ఏం సాధించాలనే జ్ఞానోదయం స్వామికి కలిగిస్తాడు. నేలతల్లి రుణాన్ని అక్షరాభిషేకం ద్వారా తీర్చుకోవాలన్న తపన లోకేశ్వరం రాసిన నవల.

సలాం హైద్రాబాద్ నవల మొహరం పండగను ఇలా తెలియజేశారు రచయత. **"మొహరం పండగను తెలంగాణలో పీర్ల పండగ అంటారు. నిజానికి ఇది పండుగ కాదు. మహమ్మద్ ప్రవక్త మనుమలైన హసన్, హుస్సేన్‌ల అమరత్వాన్ని స్మరించుకుని జరిపే సంతాపదినాలే మొహరం."** సలాం హైద్రాబాద్ నవలలో రచయిత హైదరాబాదు గొప్పతనాన్ని స్వామికి 17వ సంవత్సరం అప్పుడు అతను చూసిన వైభవాన్నీ, చారిత్రక విషయాన్ని తెలియజేస్తూ కథలోకి సూటిగా ప్రవేశిస్తారు. ఆ నవలలో స్వామి పాత్ర ద్వారా ఏ విషయాన్ని చెప్పాలనుకున్నారో దానిని సూటిగానే తెలియజేశారు రచయిత. ఈ నవలలో ముగింపు అనేది ఇంకా ఏదో జరుగుతుంది అని అనిపిస్తుంది. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు అర్పించినా, కొంతమంది దేశభక్తులు తమ ప్రాణాలు కోల్పోయినా, కొంతమంది విడిపోయినా, విషాద ఛాయలు ఏర్పడినా, ఫలితం అనే తెలంగాణ మాత్రం రాలేదు అన్న దిగులు ఉన్న స్వామిని అన్ని కష్టాలు తట్టుకుని నిలబడిన తల్లిలా చార్మినార్ దగ్గరికి తీసుకుంది అనే రచయిత భావంతో ఈ నవల ముగుస్తుంది.

**5. పొలిమేర :** ఈ నవలను గూడ అంజయ్య రాశారు. గూడ అంజయ్య సహజకవి, విప్లవ భావకుడు, తెలంగాణ గుండె దరువు మిత్రుడు. గూడ అంజయ్య రాసిన గేయాలు ఇప్పటికే తెలంగాణ ప్రజల హృదయాలు దోచుకున్నాయి. **'ఊరు మనదిరా – ఈ వాడమనదిరా'** అనే గేయం దేశమంతా మారుమ్రోగుతున్నది. తెలంగాణ అస్తిత్వ చైతన్యానికి ఊపిరులూదిన గేయాలు రెండు – **'అయ్యోడివా నువ్వు అమ్మోడివా? తెలంగాణోడికి సాటి పాలోనివా?', 'నా తెలంగాణ – నా తెలంగాణ'....** ఈ గేయాలు గూడ అంజయ్య నిబద్ధతకూ, ధర్మాగ్రహానికీ నిలువుటద్దాలు.

ఆధునిక విప్లవ వాగ్గేయకారుడిగా తెలుగు సాహిత్య చరిత్రలో విశిష్టమైన స్థానం సంపాదించుకున్న గూడ అంజయ్య కలం నుండి ఏర్పడిన గొప్ప నవల పొలిమేర. ఈ నవల 1975 నాటి ఎమర్జెన్సీ చీకటి రోజుల నేపథ్యంలో విప్లవ విద్యార్థి నాయకుడు, ప్రజా గాయకుడు గోపి అన్న ప్రధాన పాత్రను కేంద్రబిందువుగా తీసుకుని ఆనాటి సామాజిక, రాజకీయ పరిణామాలను రచయిత ఈనవలలో ఆవిష్కరించారు. నమ్మిన విశ్వాసాల కోసం, అంకితమైన ఎందరో శ్రమ జీవుల త్యాగాల బలిదానం మరెందరో వీరుల అమరత్వం ఇతివృత్తంగా పొలిమేర నవల రూపు దుద్దుకుంది. పొలిమేర నవల 2010లో తెలుగు విశ్వవిద్యాలయం వారిచే సాహితీ పురస్కారం పొందింది.

ఆత్మ విమర్శ చేసుకోవడం ఒక కమ్యూనిస్టులకే సాధ్యం. అందుకే వారు ఒక ప్రత్యేకమైన మూసాలో పెరిగిన మనుషులు. ఏ సమస్యనైనా కూలంకషంగా చర్చించడం ఒక్క కమ్యూనిస్టులకే సాధ్యం అని తెలియజేస్తుంది ఈ నవల. గోపి ఉద్యమాల్లో సమానంగా

పాల్గొంటూ, తన అన్నయ్య కంటే ముందే ఉద్యోగంలో చేరతాడు. దళితుల ఇంటపుట్టి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని ఉద్యోగం సంపాదిస్తాడు. రాజకీయాలకుపోయి చదువుకోల్పోతాడనుకున్న గోపి స్నేహితులు, లెక్చరర్స్ గోపికి ఉద్యోగం రావడంతో చాలా సంతోషిస్తారు. ఐ.డి.పి.ఎల్.లో ఒక పోస్టు రిజర్వు పోస్టుగావున్నా, గోపి పట్టణంలో ఉండకుండా గ్రామీణ ప్రజలకోసమే సేవ చేయాలనుకుని ఆదిలాబాదు మారుమూల అడవీ ప్రాంతాల్లో ఉద్యోగంలో చేరడం గోపికి సమాజంపై వున్నబాధ్యత వ్యక్తమవుతుంది. పొలిమేర నవలలో గోపి పాత్ర ఆదర్శవంతమైనదే. గోపి దళసభ్యులతో తిరిగినప్పటికీ, చివరకు మంచి ఉద్యోగం తెచ్చుకుని జీవితంలో ఉన్నత స్థితికి రావడం ఆదర్శవంతంగా చెప్పవచ్చు.

జీవితాన్ని, సమాజాన్ని, మానవ మనస్తత్వాల్ని లోతుగా అధ్యయనం చేసిన ఒక చింతనాపరుడిగా రచయిత ఈ నవలను నడిపాడు. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు ఎందరో మనకు ఆ చరిత్ర తెలియనవ్వలేదు. విప్లవ నిర్మాణంకోసం అనేక వందలమంది శ్రమించారు. వారి చరిత్రనంతా భద్రపరచవలసిన అవసరముంది. రామాయణంలో ఉడుత చేసిన శ్రమను కూడ గుర్తించారు. విప్లవోద్యమాల్లో ఎందరో త్యాగాల చరిత్రను మనం విస్మరిస్తున్నాం. 30 సంవత్సరాల క్రితం చుట్టూ అలుముకున్న ఆనాటి పరిస్థితులను అక్షరబంధం చేస్తూ నవలను రూపొందించారు రచయిత. ఇందులోని పాత్రలన్ని సజహసిద్ధమే. నవలలో ఎక్కడా మహోపన్యాసాలు లేవు. కృత్రిమమైన సాహసకృత్యాలు లేవు. మానవ సంబంధాలు, రాజ్యహింస, బూటకపు ఎదురుకాల్పులు, యువకుల అక్రమ నిర్బంధాలు, విప్లవోద్యమ నిర్మాణంలో మొక్కవోని ధైర్యంతో, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ నమ్మిన విశ్వాసాల కోసం అంకితమై పనిచేస్తున్న శ్రమజీవుల త్యాగాల వంటి ఎన్నో విషయాలను ఈనవల నేటి తరానికి పరిచయం చేస్తుంది. చారిత్రకంగా, సామాజికంగా తెలంగాణలో వచ్చిన మంచి నవలల్లో ఒకటిగా నిలిచి పోతుంది పొలిమేర. పొలిమేర నవల ఒక అద్భుత కల్పితం కాదు. ఆధునిక ఆకలి కేకల బతుకు పోరాటంగా కనిపిస్తుంది.

పొలిమేర అంటే సరిహద్దు. యుద్ధం సరిహద్దు దాటాలని రాసిన నవల ఇది. సమాజంలో వున్న సమస్యలను ఎదుర్కొనే యుద్ధం పొలిమేర దాటడంతో ఆ యుద్ధం ముగుస్తుంది. అన్నలు సమాజంలో వున్న సమస్యలను పొలిమేర దాటించారు. ఆ సమస్యను పొలిమేర దాటించడానికి అనేక పొలిమేరలలో వాళ్ళు పర్యటించారు. అందుకే రచయితగారు అన్నలు తిరిగిన సరిహద్దులను తీసుకొని ప్రదేశ సూచకంగా ఈ నవలకు పొలిమేర అని నామకరణం చేసివుంటారు. పొలిమేర నవల ఆత్మాశ్రయ పద్ధతిలో రాయబడింది. మానవ సంబంధాలు, యువకుల అక్రమ నిర్బంధాలు, నమ్మిన విశ్వాసాల కోసం అంకితమై పనిచేస్తున్న శ్రమజీవుల త్యాగాలు మొదలైన విషయాలన్నీ రచయిత ఆత్మాశ్రయ పద్ధతిలో తెలియజేశారు. పొలిమేర నవలను రచయిత ఊహాతీతంగా ముగించారని చెప్పవచ్చు. దళ సభ్యుల్లో చేరినవారు సాధారణంగా వాటితోనే వారి జీవితం ముగిసి పోతుంది అంటుంటారు కానీ ఈనవలలో గోపి దళసభ్యుల్లో పనిచేసినప్పటికీ చివరకు చదువు ముగించుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడడం కాస్త ఊహాతీతంగానే ఉంది. కావున రచయిత ఈ నవలను ఊహాతీతంగా ముగించారని చెప్పవచ్చు.

**రచనా శైలి** : సమకాలీన సమాజం మూఢవిశ్వాసాల నుండి బయటపడాలనే ఉద్దేశంతో రచయిత తన భావాలకు అనుగుణంగా జాతర నవలకు నామకరణం చేశారు. ఆత్మాశ్రయ పద్ధతిలో కథ నడిపారు రచయిత. ఇద్దరు వ్యక్తుల సంభాషణతో ప్రారంభమైన ఈ నవల, అందులోని మూఢాచారాలను, అందుకు బలవుతున్న అమాయకుల్ని (ప్రధాన పాత్రతో సహా) ప్రధాన పాత్ర ద్వారా తెలియజేస్తూ కథ నడిపారు. కథా ప్రారంభంలో రాధకు పిల్లలులేరనీ, ఆమెతో ఆమె భర్త రాడు అనే కథా విషయాన్ని ప్రారంభంలోనే పాఠకునికి విశదపరుస్తూ, మన సమాజం మూఢ విశ్వాసాల నుండి, దురన్యాయాల నుండి, దుష్ట సంప్రదాయాల నుండి బయట పడాలనే సందేశంతో నవలను ముగించారు. సమాజానికి గొప్ప సందేశాన్ని రచయిత ముగింపు ద్వారా అందించారు. ప్రజా చైతన్యంతో, సంఘ సంస్కరణ దృష్టితో రాసిన నవల ఇది. అర్థంలేని ఆచారాలను, మూఢ విశ్వాసాలను ఖండించడంలో నవలా ప్రయోజనం నెరవేరిందని చెప్పవచ్చు.

జాతర నవలలో నల్గొండ జిల్లా పల్లె వాతావరణాన్ని సహజ సుందరంగా చిత్రించారు రచయిత. ఈ నవలను సహజ సుందరగా రూపొందడానికి తెలంగాణ సజీవ భాష దోహదపడింది. ఈ నవలలో పాత్రలచేత నల్లగొండ జిల్లా ప్రవాసభాషను, రచయిత వ్యాఖ్యానాలకు శిష్టవ్యవహారికం వాడారు. దీనివల్ల నవలకు చివరివరకు చదివించే గుణం ఏర్పడింది. బతుకుపుస్తకం నవలలోని సంభాషణలూ, స్వగతాలు, మనోగతాలు రచయితగారు తెలంగాణా మాండలికంలో తెలియజేశారు. సలాం హైద్రాబాద్ నవలలో ప్రారంభం నుండి ముగింపు వరకు తెలంగాణ భాషలోనే అనగా హైదరాబాదీ భాషలోనే రచయిత రచన చేశారు. పొలిమేర నవల తెలంగాణ మాండలికంలో రాయబడింది. పొలిమేర నవలలో మాండలిక భాష, పాత్రోచిత భాష, ప్రాంతీయ పదాలు, వాక్య నిర్మాణం, చిన్నపదాల నుండి వాక్యాలు, పెద్ద వాక్యాలుగా భావోద్వేగాలను తెలంగాణ భాషలోనే తెలియజేస్తున్నాయి.

బతుకుపుస్తకం నవలలో పాచిపండ్లోడు సంపాయిస్తె బంగారు పండ్లోడు ఖర్చు చేస్తాడంట (పుట.27), అక్క చుట్టమైతే లెక్క చుట్టమా (పుట.30), దరిద్రునికి సంతానమెక్కువ (పుట.33), ఎంత చెట్టుకు అంతగాలి (పుట.33) మొదలైన సామెతలు ప్రయోగించబడ్డాయి.

జోగిని నవలలో రచయిత్రి మట్టిలో మాణిక్యం, కాలుదుమ్ము కంట్లో పడ్డట్టు మొదలైన జాతీయాలను ప్రయోగించారు. అంతేగాక ఇందులో 'పంకజంలోంచి విసిరిన పద్మం' అనే ఉపమాలంకారం కూడా కనిపిస్తుంది. జోగిని నవలలో శాంతిప్రబోధగారు సందర్భానుగుణంగా సామెతలను ప్రయోగించారు. చదరపుటెత్తుగడ, కక్కలేక మింగలేక, గోతికాడి గుంటనక్కల్లా, పేనుకు పెత్తనమిస్తే గుండంతా గోకేసిందట, నక్కకీ నాగలోకానికీ, గుడ్డెద్దు చేలో పడ్డట్టు, పెద్దచేప చిన్నచేపను మింగుతలేదా, పజినోల్లెప్పుడూ చెడినోల్లు గాదులె, ఏరెల్లినంక తప్ప తగలేసినట్లు మొదలైన సామెతలను రచయిత్రి ప్రయోగించి జానపదత్వాన్ని కలిగించారు. సలాం హైద్రాబాద్ నవలలో చచ్చినోడి పెళ్ళికి వచ్చిందే కట్నం, శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు మొదలగు సామెతలను సందర్భానుసారంగా వివరించారు. పొలిమేర నవలలో కత్తిమీదసాము (పుట.2), తీగలాగితే డొంక కదిలింది (పుట.3), ఆకలి రుచెరగదు (పుట.14), వడ్డించిన విస్తరి (పుట.17), జీవితాన్ని కాసివడబోయడం (పుట.19), అరటిపండు వొలిచినట్లు (పుట.32), రెక్కాడితేగాని డొక్కాడదు (పుట.73),ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతకాలి (పుట.108), అగ్గిమీద గుగ్గిలం (పుట.110) మొదలైన సామెతలను వివరించారు. పొలిమేర నవలలో జీవితం ఉప్పులేని కూడు లాంటిది (పుట.13), పోరాడితే మనకు పోయేవి బంధనాలే (పుట.32) మొదలైన సూక్తులు సందర్భానుసారం రతయితలు ప్రయోగించారు.

ఆధునిక సాహితీ ప్రక్రియలలో నవలా ప్రక్రియ బహుళ ప్రజాదరణ పొందడమేకాకుండా సమకాలీన సామాజిక సమస్యల్నీ, ఆర్థిక రాజకీయ పరిస్థితుల్నీ చిత్రించడంలో ప్రముఖపాత్ర వహిస్తుంది. అంతేగాక సమకాలీన తెలంగాణలోని సాంఘిక, ఆర్థిక, ఆనాటి రాజకీయ పరిస్థితులు, సామాజిక అసమానతవంటి అంశాలను రచయితలను సామాజిక స్పృహగల రచయితలుగా తీర్చిదిద్దడానికి కారణమయ్యాయి. అట్టి పరిస్థితులను ఎదుర్కోవడానికి రచయిత ఒక సామాజిక, చారిత్రక బాధ్యతను గుర్తించిన వ్యక్తులుగా తమదైన శైలిలో నవలలను వెలువరించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహితీ పురస్కారాన్ని పొందిన నవలలోని ఇతివృత్తాలు ఎక్కువగా అట్టడుగు వర్గాల, మధ్యతరగతి వర్గాల సమస్యల్ని తెలంగాణ నేపథ్యంలో, తెలంగాణ చరిత్రను చిత్రించి మరెన్నో రచనలకు మార్గదర్శంగా నిలిచాయి.

## స్వర్గ మేది - నరకమేది



రాజుల పాలన స్వర్గం - రాజకీయుల పాలన నరకం
సఫలమైన ప్రేమ స్వర్గం - విఫలమైన ప్రేమ నరకం
మధురమైన మాట స్వర్గం - పరుషమైన పదం నరకం
హిమనీ నదులు స్వర్గం - హేయ భావాలు నరకం
విజయం స్వర్గం - విఫలం నరకం
పొగడ్త స్వర్గం - విమర్శ నరకం
భవిష్యత్ స్వర్గం - వర్తమానం నరకం
జీవితం స్వర్గం - జీవన శైలి నరకం
నువ్వు సాయం చేస్తే స్వర్గం - నువ్వు సాయం అడిగితే నరకం
స్వర్గమేది? నరకమేదీ?
ఆచరిస్తే అన్నీ స్వర్గాలే....
అచరణికి సాధ్యం కానివన్నీ నరకాలే...




రచయత : మురళీ బాసా

# తిల్లా గోవిందమ్మ

ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి, తిరుపతి, ఫోన్ : 9849307333

ఎత్తైన ప్రహరీ గోడల మధ్యనుండే ఖాళీ స్థలంలో అందమైన పూల మొక్కలు, పనస, అరటి, మామిడి, నేరేడు వంటి చెట్లు... వాటి మధ్యలో అందమైన విశాల భవంతి... నగిషీతో చెక్కిన పెద్ద ద్వార బంధం... పక్కనే అందమైన వసారాలు... పెద్ద పెద్ద గుండ్రటి స్తంభాలు... అద్దంలాంటి నునుపు దేలిన గోడలు... గోడల మీద చిత్రకళలకు వేసిన నున్నటి గచ్చు. ఆ గచ్చుల మీద రాధాకృష్ణుల రంగుల ప్రణయ చిత్ర లేఖనాలు... నిజంగా పులులు, సింహాలు, ఏనుగులు, లతలున్నట్లు సహజ సిద్ధంగా కనిపించే రంగుల చిత్రాలు... లోపలున్న పెద్ద కచేరి చావడి గదిలో తూగుటుయ్యాల... ధనవంతులు కూర్చునే పెద్ద పెద్ద ఆసనాలు... అంతఃపురాన్ని తలపిస్తున్నట్లుంది ఆ భవనం.

“అమ్మగారు భోజనానికి సమయమైంది. వడ్డించమంటారా?” అడిగింది ఆ ఇంటి యజమానురాలి చెలికత్తె.

“ఆకలిగా లేదు. తర్వాత తింటాను”

“వారంనుండి మీరు భోజనం సరిగా చేయడంలేదు. చిక్కిపోయారు. ఎన్ని రోజులని గోవిందరాజస్వామిని గూర్చి ఆలోచిస్తూ కూర్చుంటారు?” అన్నది చెలికత్తె.

“గోవిందరాజస్వామి అంటే ఎవరనుకున్నావు? ఆ స్వామి నా ప్రాణనాథుడు. ఈ చిదంబర ఆలయ ప్రాంగణంలో నటరాజస్వామితో పాటు గోవిందరాజస్వామి కూడా కొలువై శైవ వైష్ణవ భక్తులకు కొంగు బంగారమైనారు. కోరిన వరాలిచ్చే దేవుళ్లైనారు. ఎవరి పాపిష్టి కళ్ళు పడ్డాయో? ఏమో? శైవ మతాభిమాని అయిన కులోత్తుంగ చోళ మహారాజుకు గోవిందరాజస్వామి పైన నూరి పోశారు. ఆలయంలో గోవిందరాజ స్వామిని కనిపించకుండా చేయాలనుకొని మత విద్వేషాల్ని రేపారు. ఆలయంలో శైవ, వైష్ణవ ఘర్షణలు తరచూ జరుగుతుండేవి. ఎందుకో నాకు గోవిందరాజస్వామి గుడికెళ్ళినప్పుడల్లా కుడికన్ను అదురుతూనే ఉండేది. కీడు శంకిస్తూనే వస్తున్నాను”.

“అమ్మగారూ కానున్నది కాక మానదు, రానున్నది రాక మానదు... అంతా దైవలీల. మనసు దిటం చేసుకోండి... యథా స్థితికి రండి. మన ఇంట మళ్ళీ పూర్వ వైభవం తీసుకొని రావడానికి కాలికి గజ్జెలు కట్టండి. ఘల్లు ఘల్లుమనే సవ్వడులతో అణువణువూ ప్రతిధ్వనించే మన ఇల్లు మళ్ళీ కళాకారులతో, పోషకులతో కళకళలాడాలి. మిమ్మల్ని నమ్ముకొని జీవిస్తున్న వందలాది మంది ఏమైపోవాలి? మీరు గుళ్ళో నాట్య ప్రదర్శనలు ఇవ్వక పోయినా మన ఇంటికే ఎంతోమంది మీరు ఊఁ అంటే వస్తారు. మీరు దిగాలుగా ఉంటూ, ఇంత పెద్ద భవనం బోసి పోవడం ఏం బాగోలేదు. గోవిందరాజస్వామిని మనసులో నుండి తొలగించండి అమ్మగారూ” అంది చెలికత్తె.

“ఎంత మాట అన్నావు? ఆయన మామూలు మనిషా? లోకాలేలే దేవుడు. నేను తొమ్మిదేళ్ళ వయసులో ఉన్నప్పుడే మా వాళ్ళు నన్ను స్వామికి అర్పించారు. ఆ వయసు నుండి ముసలి వయసు వరకుండే దేవదాసీలతో మెలిగాను. స్వామి ఊరేగింపుల్లో సహ దేవదాసీలతో కలిసి పాటలు పాడాను. వీణా వాద్యంలో ప్రావీణ్యం సంపాదించాను. నృత్యంలో మెలుకువలు నేర్చి ఈ చిదంబరంలోనే నాకు మించిన నాట్యగత్తె లేదని నిరూపించుకొన్నాను. యుక్తవయసు రాగానే పీఠాధిపతులు నన్ను గోవిందరాజస్వామికిచ్చి పెళ్ళి చేశారు. అప్పట్నుంచి మేటి దేవదాసీగా, గోవిందరాజస్వామి ఆస్థాన నర్తకిగా పేరు పొందాను”.

“అమ్మగారూ! మీరు సంగీత సాహిత్య నృత్యంలోనే కాదు అందంలోనూ మీకు మించిన వారు ఈ చిదంబరంలో ఎవరున్నారు. పెద్ద పెద్ద ధనవంతులు మీ చూపు పడితే చాలని తపించి పోతుంటారు. మీ దర్శనభాగ్యం కోసం మన భవంతి ముందు వరుస కట్టడం మీకు తెలిసిందేకదా? అంతెందుకు ఒకనాడు మారువేషంలో కులోత్తుంగ చోళుడే ఆలయంలో మీ నాట్యాన్ని చూసి తన ఆస్థానంలో నృత్యాలు చేయించుకొని మీకు లెక్క లేనన్ని సార్లు కనకాభిషేకం చేసి సంతోషించలేదా? రాజ బంధువులు మిమ్మల్ని కలవడానికి ఎన్ని తంటాలు పడలేదు. కులోత్తుంగ చోళ మహారాజు మీ కోసమే తన రాజధానిని చిదంబరానికి మార్చుకున్నాడనే వదంతులు కూడా మీరు విన్నారు కదా? అంతటి పేరు మోసిన మీరు ఇలా కృంగిపోతారనుకోలేదు” అంది చెలికత్తె.

“ఏకాంత మందిరంలో కులోత్తుంగ చోళ మహారాజుతో నేను సంగీత సాహిత్య నృత్యాలలో మునిగి ఉన్నప్పుడు ఆయన చాలా కాలం పాటు నాతో సరదాగా గడిపేవారు. నాతో పాచికలాడేవారు. మనసువిప్పి ఎన్నో రాజతంత్రాలను చెప్పేవారు. ఈ శైవ పీఠాధిపతులు రాజావారిని తరచూ కలుస్తూ ఆయనలో మత వైషమ్యాలను రెచ్చగొడ్తూ వచ్చారు. వైష్ణవ దేవదాసి అయిన నాతో మెల్లగా దూరమవడం మొదలు పెట్టారు. నేను ఎన్నోసార్లు ఏకాంత మందిరంలో శివకేశవులు ఒకటేనని, వారిద్దరినీ సమానంగా చూడమని బతిమలాడాను. ఆయన మతావేశం ముందు నా ప్రేమానురాగాలు చిన్నపోయాయి. శైవమతంలోకి నన్ను

మారమన్నారు. ప్రాణమన్నా తీసుకుంటాను గానీ గోవిందరాజ స్వామికి అంకితమైన తన జీవితాన్ని మార్చుకోలే నన్నాను. ఉగ్ర రూపం దాల్చి నాముఖం చూపించొద్దని వెళ్ళి పొమ్మన్నారు. అయినా నేను బాధ పడలేదు. ఎప్పటిలాగే గోవిందరాజ స్వామి నృత్య నీరాజనాల్లో పాల్గొంటూ నటరాజ ఆలయంలో ప్రతి ఏటా సంక్రాంతి నెల తర్వాతి నెలలో జరిగే ప్రముఖ పండుగ నాట్యాంజలిలో నృత్యం చేయడానికి మన దేవదాసీలకు నాట్య శిక్షణ ఇవ్వడం మొదలు పెట్టాను. దేశవ్యాప్తంగా వందలాది మంది భరత నాట్య నృత్యకారులు నటరాజ స్వామికి నృత్య సమర్పణకు హాజరవుతారు కదా?... నేను భరత నాట్యంలో అరంగేట్రం చేసినప్పటి నుండి ప్రతి ఏటా నేనే ప్రథమ స్థానంలో నిలిచేదాన్ని. రాజా వారు నన్ను ముఖం చూపించొద్దన్నాడు. కాబట్టి నేను ఈసారి నాట్యాంజలిలో పాల్గొనను. ఎలాగైనా మన ఆలయ దేవదాసీలకే ప్రథమ స్థాన బహుమతి దక్కాలని తాపత్రయపడ్డాను. గోవిందరాజస్వామి ఆలయ పరువు నిలబెట్టాలనుకొన్నాను. నా ఆశలన్నీ అడియాసలైపోయాయి".

"అవును అమ్మగారు... మీరు పడిన శ్రమనంతా నేను కళ్ళతో చూశాను. గోవిందరాజస్వామి కోసం ప్రాణమిచ్చే మనస్తత్వం మీది. ఏమి చేసి ఏం లాభం. ఒక రోజు శైవ పీఠాధిపతులు కులోత్తుంగ చోళ మహారాజును, సైన్యాన్ని తీసుకొచ్చి గోవిందరాజస్వామి గుళ్ళో ఉన్న వారందరినీ బయటకు పంపేశారు. మీరు కులోత్తుంగ చోళు డు ఆలయానికి వస్తున్నాడనేసరికి మన నివాసానికొచ్చేశారు. ఆలయానికొచ్చిన కులోత్తుంగ చోళుడు గోవిందరాజ స్వామి శిలా విగ్రహాన్ని గుడిలో నుండి పెకిలించి తెమ్మన్నాడు. ఆలయం వెలుపలకు విగ్రహాన్ని తెచ్చారు సైనికులు. ఏనుగు పైనున్న అంబారీ మీద కూర్చొని ఉన్న కులోత్తుంగ చోళుడు ప్రజలందరూ విచార వదనంతో చూస్తుండగా మతోన్మాదంతో విష్ణువు ఉండేది పాలసముద్రంలో కాబట్టి ఆయన అసలు నివాసమైన సముద్రానికి గోవిందరాజును పంపించండి అని ఆజ్ఞాపించాడు. అడ్డుపడిన వారిని సైనికులు బందీలను చేశారు. గోవిందరాజస్వామి విగ్రహాన్ని సమీపంలోని సముద్రంలోకి నెట్టేశారు. కులోత్తుంగ చోళుని మత మౌఢ్యానికి చాలామంది భక్తులు తల్లడిల్లిపోయారు. అప్పట్నుంచి మీరు తిండీతిప్పలు మానేసి ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారు. పది తరాలు కూర్చొని తిన్నా తరగని సంపద మీది. చిదంబరంలోనే గొప్ప ధనవంతురాలు మీరు. ఈ రాజభోగం ఎంత మందికొస్తుంది చెప్పండి?. మనసు దిటవు చేసుకొని భవిష్యత్తు కోసం ఆలోచించండి అమ్మగారూ" అంది చెలికత్తె.

ఇంతలో వాళ్ళ రక్షణాధికారి కచేరీ గదిలోకొచ్చి "అమ్మా! ఎం పెరుమానధీయరు రామానుజాచార్యులు పంపగా ఒక వ్యక్తి గుర్రంపై వచ్చి వసారాలో ఉన్నారు. మీరు అనుమతిస్తే లోనికి ప్రవేశ పెడ్తాను" అన్నాడు.



"ప్రవేశ పెట్టండి "

వచ్చిన వ్యక్తి వినయంతో చేతులు కట్టుకొని తలవంచి నమస్కరించి నిలబడ్డాడు.

"ఎవరు మీరు ?"

"అమ్మా! నేను రామానుజ పరివారంలో ఒకడ్ని. ఒక రకంగా చెప్పాలంటే ఆయనకు ఎలాంటి ఆపద కలగకుండా వేయి కళ్ళతో కాపాడుతుంటాను. ఆయనకు ఎంతో నమ్మకస్తుణ్ణి. ఈ లేఖను మీకు అందివ్వమని నన్ను పంపారు" అని గుండ్రని మూరెడు పొడవుండే కొయ్య బరిణెలోని లేఖను అందించి నిష్క్రమించాడు.

కొయ్య బరిణెకు ఒకవైపున్న మూతను విప్పి పొడవాటి గుడ్డమీద రాసి ఉన్న లేఖను చదవనారంభించింది.

"తిల్లా గోవిందమ్మా....చిదంబరంలో జరిగిన అన్ని విషయాలు నాకు తెలుసు. గోవిందరాజస్వామికి అంకితమై, ఆయన ఆటపాటల్లో మునిగి తేలిన నిన్ను నేను గోవిందరాజస్వామిని దర్శించినప్పుడల్లా చూశాను. జరిగిన సంఘటనకు నువ్వెంతో మనోవ్యథ చెంది ఉంటావు. ఇదంతా గోవిందరాజస్వామి లీలల్లో ఒక భాగమని నేను నమ్ముతున్నాను. జరిగిపోయిన దానికి చింతించకుండా జరగాల్సిన దానిని గూర్చి ఆలోచించడం మంచిది. కాలం కలిసి రానప్పుడు ఓపిక పట్టాలి. సముద్రం పాలైన స్వామి వారి విగ్రహాన్ని వెలికి తీసి, అర్చకులు రక్షించి దాచి ఉంచిన ఉత్సవ విగ్రహాలతో సహా నువ్వు వేంగడానికి చేర్చాలి. ఇదంతా రహస్యంగా జరగాలి. లేకపోతే కులోత్తుంగుని అనుచరులుగానీ, వీరశైవులు గానీ విగ్రహాలకు హాని కల్గించవచ్చు. వేంగడం పరిసర ప్రాంతాలను ఏలే ఘట్టి దేవయాదవ రాయలు నా శిష్యుడు. రాజగురువైన నా మాటను జవదాటడు. ఈ కార్యానికి నిన్నే ఎందుకు ఎన్నుకొన్నానంటే నువ్వు గొప్ప నాట్యగత్తెవి. సంగీత సాహిత్య నృత్యాలతో నువ్వు, నీ పరివారం దారి పొడవునా వచ్చే ప్రముఖ ఊర్లల్లో ప్రదర్శనలిస్తూ వెళ్తుంటే మీ వెంట వచ్చే

విగ్రహాలను మీ వస్తు సరంజామాగా భావించి వాటిని గూర్చి ఎవ్వరూ పట్టించుకోరు. నేను ఎంతో ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చాను. వెలికితీత ఏర్పాట్లకు, విగ్రహాల తరలింపుకు కావల్సిన ధనం నువ్వు ఊఁ అన్న వారం రోజుల్లో నీకందుతాయి. ఏ విషయం వెంటనే నాకు తెలియజేయి. నేను శ్రీరంగం నుండి త్వరలో మేల్‌కోటైకు వెళ్ళాలనుకుంటున్నాను. నా మీద కూడా కులోత్తుంగ చోళుని కన్ను పడింది. పరిస్థితులు బాగా లేనప్పుడు అజ్ఞాతవాసం తప్పదు. ఇప్పుడొచ్చిన వ్యక్తి ద్వారానే లేఖ రాసి పంపు. ఇందులో ఎలాంటి ఒత్తిడి లేదు. నీకిష్టమైతేనే ఈ పనికి పూనుకో... లేకపోతే మరో దారి వెతుక్కుంటాను.

**ఆశీస్సులతో...**

**ఎన్ పెరుమానధీయర్ రామానుజ "**

ఉత్తరం చదవడం పూర్తి అవుతూనే తిల్లా గోవిందమ్మకు ఆనందంతో కళ్ళ నీళ్ళు సుడులు తిరిగాయి. వైష్ణవ మతానికే పెద్ద దిక్కు అయిన రామానుజాచార్యులు స్వయంగా రాసిన లేఖను కళ్ళకద్దుకొంది. వెంటనే మరో లేఖను సమాధానంగా రాయడం మొదలు పెట్టింది.

"రామానుజ గురుదేవుల పాద పద్మాలకు నా సాష్టాంగ నమస్కారాలు...

నాకు దైవం, ప్రాణం గోవిందరాజస్వామి అయితే, ఆయన తర్వాత మీరంటే ఎంతో గౌరవం, భక్తి నా అణువణువునా ఉన్నాయి. మీరు వైష్ణవానికే కాదు మా దేవదాసి పరంపరకు కూడా గురుదేవులు. మీరు మమ్మల్ని ఆజ్ఞాపించాలే కానీ, మా సమ్మతిని అడగ కూడదు. అయినా నేను మనస్ఫూర్తిగానే మీరు నాకప్పగించిన కార్యాన్ని చాకచక్యంగా పూర్తి చేస్తాను. ఈ పని మీరు నాకిచ్చిన అదృష్టంగా భావిస్తాను. నేనూ గత వారం రోజులుగా చిదంబరాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోవాలని మనసులో తర్జన భర్జనలు పడుతున్నాను. గోవింద రాజస్వామి లేని చిదంబరంలో నేనిన్ని రోజులు ప్రాణాలతో ఉండడమే గొప్ప. మొన్నీ మధ్యనే కొన్ని ఆస్తులను నన్ను నమ్ముకొన్న వారికిచ్చేశాను. అయినా వాళ్ళు నన్ను వదలడం లేదు. నాతోటే బతుకుతున్నారు. ఎందుకో లక్ష్మీదేవి నన్ను కరుణించి నాకు తరగని ఆస్తులనిచ్చింది. ఈ ఆస్తులు, డబ్బు, బంగారాన్ని ఏమి చేసుకోవాలో, ఎవరికివ్వాలో అర్థంకాక తీవ్రంగా ఆలోచనలో పడ్డాను. ఇప్పటికే గోవిందరాజస్వామికెంతో సమర్పించాను. మిగిలిన ఆస్తిపాస్తుల్ని దశలవారిగా స్వామికి సమర్పించుకోవచ్చులే అనుకొనే సమయానికి ఇదంతా జరిగిపోయింది. ఇప్పుడు నా సంపదకు ప్రయోజనం చేకూరింది. మీరు నాకెలాంటి ధనాన్ని సమకూర్చాల్సిన పనిలేదు. రేపు మంచిరోజు. రేపటి నుంచే మీరు చెప్పిన కార్యాన్ని అతి రహస్యంగా మొదలు పెడ్తాను. నాకు విజయం చేకూరాలని ఆశీర్వదించండి చాలు. ఇన్నాళ్ళు కృంగిపోయి దిక్కు తోచకుండా ఉండి పోయిన మేధస్సుకు పనిపెట్టారు. నా నమ్మకస్థుల ద్వారా పథక రచన చేసి, మీరు సెలవిచ్చిన కార్యాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేస్తాను.

ఇట్లు

**మీ మాటల్ని శిరోధార్యంగా భావించే మీ భక్తురాలు**

**తిల్లా గోవిందమ్మ**

రామానుజం నుండి వచ్చిన వ్యక్తికి అతిథి మర్యాదలు చేసి, భోజనం పెట్టి తిల్లా గోవిందమ్మ రాసిన ఉత్తరాన్ని రామానుజులకు అందజేయమని చెప్పి పంపించేశారు తిల్లా గోవిందమ్మ ఇంట్లోని వ్యక్తులు. వారం రోజులుగా కకావికలమైన మనస్సుతో ఉన్న తిల్లా గోవిందమ్మ మరుసటి రోజు ఉదయాన్నే కొయ్య బండ్లు తయారుచేసే విశ్వబ్రాహ్మణులను తన ఇంటికి పిలిపించింది. గతంలో వారు తన భవనానికి అవసరమైన కొయ్య పనులన్నింటినీ చేసిన వారే.

"అమ్మా! పిలిచారట సెలవివ్వండి" అన్నాడు కొయ్య పనిచేసే విశ్వబ్రాహ్మణుడు. తిల్లా గోవిందమ్మ తమ కార్యనిర్వహణాధికారి వైపు చూసింది.

"ఏం ఫర్వాలేదమ్మా ఇతనికి అన్నీ ముందే చెప్పాను. పైగా మనకు చాలా నమ్మకస్థుడు. ఏ విషయాన్నీ బయటకు పొక్కనీయడు" అని భరోసా యిచ్చాడు గోవిందమ్మ దగ్గర చాలా కాలంగా పనిచేసే కార్యనిర్వహణాధికారి.

"చెప్పాడటగా? మళ్ళీ చెప్పడమెందుకు " అంది తిల్లా గోవిందమ్మ.

"చిత్తం! మీరు కోరినట్లే భారీ కొయ్యబండిని ఇప్పటికిప్పుడు చేయాలంటే చాలా సమయం పడ్తుంది. ఈ మధ్యే జైత్ర యాత్రల కోసమని పది భారీ బండ్లను సేనాని కోరితే తయారు చేశాను. ప్రస్తుతానికి యుద్ధం లేదు గనుక మీకు ఒక బండిని ఎప్పుడు చెబితే అప్పుడు, ఎక్కడికి పంపమంటే అక్కడికి పంపేస్తాను. తిరిగ్గా మరో బండి తయారు చేసి సేనానికి చేరుస్తాను. మీ వల్ల నేనెంతో లాభపడ్డాను. ఈ మాత్రం ఋణం తీర్చుకొనే అవకాశం కల్పించారు. మీకు ధన్యవాదాలు. ఈ విషయాన్ని నేనెక్కడా ప్రస్తావించను. మీ ఆజ్ఞ ప్రకారమే నడచుకొంటాను" అన్నాడు విశ్వబ్రాహ్మణుడు.

"మన బొక్కసం నుండి ఆయన ఎంత సొమ్ము అడిగితే అంత యిచ్చేయండి" అంది గోవిందమ్మ.

"బండి ఎప్పుడు అవసరమొస్తే అప్పుడు మీ దగ్గర కొచ్చి తీసుకెళ్తాం" అంటూ విశ్వబ్రాహ్మణుడికి ధనం చెల్లించాడు కార్యనిర్వహణాధికారి.

"చిత్తం!" అంటూ ధనమున్న సంచిని తీసుకెళ్ళిపోయాడు విశ్వబ్రాహ్మణుడు.

"అమ్మా! ఈ రోజు రాత్రి పౌర్ణమి. చీకటి పడ్తూనే మత్స్యకారుల చేత గోవిందరాజస్వామి విగ్రహాన్ని తీరానికి చేర్చే ఏర్పాట్లు చేసేశాను.

గోవిందరాజస్వామి విగ్రహం పెద్దదేకాదు. చాలా బరువుంటుంది. అందుకని వందమంది కూలీలను ఏర్పాటు చేశాను. వాళ్ళు మనతో పాటే వేంగడానికొస్తారు. అందుకు సంబంధించిన డబ్బునంతా ముందే చెల్లించేశాను. చీకటి పడే సమయానికి బలిష్టమైన భారీ కొయ్యబండిని మనవాళ్ళు సముద్రతీరానికి తెచ్చేస్తారు. ఆ బండికి అవసరమైనన్ని ఎద్దులను సమకూర్చాం. ఉత్సవ విగ్రహాలను కూడా జాగ్రత్తగా గుడ్డలతో చుట్టి గూడు బండ్లల్లో ఉంచేశాం. సముద్రతీరం నుండి ఒక బండి మార్గం గుండా గోవిందరాజస్వామి విగ్రహానికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తగా గోనె పట్టలు, మెత్తటి బట్టలను, వేదిక తెరలను చుట్టి మీ నాట్య సరంజామా లాగా తీసుకొస్తాం. మరో వైపు మనవాళ్ళు ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తారు. మీరు ఇక్కడి నుండి మన పరివార జనాన్ని తీసుకొని ధన, కనక, వస్తు, వాహనాలతో బయలుదేరండి. అందరం వేంగడం బాట పడ్దాం. రాత్రికి రాత్రే కులోత్తుంగ మహారాజు ఆధిపత్యం అధికంగా ఉండే చిదంబర సరిహద్దుల్ని దాటి విరుదాంచలం చేరుకుంటాం. అక్కడ పగలంతా వైష్ణవ భక్తుడు, స్థానిక ఊరు పెద్ద భవంతిలో అందరికీ విశ్రాంతి ఏర్పాటు చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా సాయంత్రం అక్కడ మన దేవదాసీ పరివార జనంతో నాట్య ప్రదర్శన ఉంటుంది. భోజనాలయ్యాక, అక్కడే రాత్రి నిద్రించి తెల్లవారు జామున బయలుదేరి సాయంత్రానికి మరో ఊరు చేరుకొన్నాక అక్కడ మళ్ళీ నాట్య ప్రదర్శన ఉంటుంది. అలా తిరువణ్ణామలై, వేలూరు, చిత్తూరు, చంద్రగిరిల మీదుగా వేంగడం చేరుకొంటాం. అక్కడ రామానుజాచార్యుల శిష్యుడైన ఘట్టిదేవ యాదవరాయలు మనకు కావలసిన ఏర్పాట్లు చేస్తాడు" అన్నాడు గోవిందమ్మతో వారి పనులను పర్యవేక్షించే కార్యనిర్వహణాధికారి.

"సరే అలాగే కానివ్వండి "అంది గోవిందమ్మ.

ప్రతి ఊరిలో రాత్రిపూట గోవిందమ్మ బృందం చేసే భరత నాట్యాలను చూసి ప్రజలు తన్మయత్వం పొందారు. గోవిందమ్మ వెంట వచ్చే గోవిందరాజస్వామి రాతి విగ్రహాన్ని గూర్చిగానీ, ఉత్సవ విగ్రహాలను గుర్చిగానీ ఎవరూ పట్టించుకోలేదు. చూసినా నాట్య సరంజామా గానే భ్రమించారు. అందరూ తిల్లా గోవిందమ్మ బృందం నాట్యాన్ని గూర్చి, గోవిందమ్మ అంద చందాలను గూర్చి మాట్లాడుకో సాగారు. గోవిందమ్మను చూడడానికి జనం ఎగబడ్డారు. ఒకరినొకరు తోసుకున్నారు. తోపులాటలు జరిగాయి. గోవిందమ్మకు రక్షణగా ఆయా ఊర్ల గ్రామ పెద్దలు నిలిచారు. ఒక ఊరి నుండి మరో ఊరికి గోవిందమ్మ పరివారం చేరుకునే లోపల కొంతమంది చాకు లాంటి యువకులు గుర్రాల మీద వెళ్ళి ఆయా ఊర్లల్లో కార్యనిర్వహణాధికారి చెప్పినట్లు వీరికి తగిన ఏర్పాట్లు చేశారు. అలా గోవిందమ్మతో పాటు గోవిందరాజస్వామి రాతి విగ్రహం, ఉత్సవ విగ్రహాలు చంద్రగిరి దాటి కపిలతీర్థం ముందుండే కొట్టూరు



అనే కొత్తూరుకు చేరుకొన్నాయి. వేంగడం ప్రాంతాన్ని పాలించే ఘట్టిదేవ యాదవ రాయలు రామానుజాచారి నుండి వచ్చిన కబురు ఆధారంగా గోవిందమ్మ బృందానికి ఘన స్వాగతం పలికాడు. ఉత్సవ విగ్రహాలను కొత్తూరు గుడిలో భద్రపరచమని ఆజ్ఞాపించాడు. రాతి విగ్రహాన్ని ఉంచడానికి కొత్తూరు గుడి అనుగుణంగా లేకపోవడంతో కొత్తూరులో భాగమైన పార్థసారథి ఆలయంలో ఉంచమన్నాడు.

తిల్లా గోవిందమ్మ స్నాన పానాలు ముగించుకొని కొత్తూరులో ఘట్టి దేవయాదవ రాయలున్న అంతఃపుర భవనంలోని సభా మందిరంలో కొచ్చి నమస్కరించి నిలుచుంది.

"గోవిందమ్మ గారూ! నాకు గురువుగారైన రామానుజాచార్యుల వల్ల అన్ని విషయాలు తెలుసు. ఉన్నఫలంగా గోవిందరాజస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలంటే తగిన చోటు కావాలి. ఈ కొత్తూరు ఆలయం చిన్నది. ఇక్కడ కుదరదు. పక్కనే పార్థసారథి గుడి ఉంది. ఆ ఆలయం విశాలమైంది. అక్కడ పార్థసారథి గర్భగుడిని ఆనించి మంటప నిర్మాణాలు చేసి అందులో ప్రతిష్ఠించడం తప్ప మరో మార్గం లేదని మా స్థపతులు, శిల్పులు చెప్పారు. అందుకు కొంత సమయం పడ్తుంది. అందాక మీరు ఎక్కడ ఉంటారు?" అడిగాడు ఘట్టి దేవరాయలు.

"ఎక్కడో ఎలా ఉండగలను? నా పంచ ప్రాణాలు గోవిందరాజ స్వామివి అయినప్పుడు ఆయన ఎక్కడుంటే అక్కడే ఉంటాను. నేను పార్థసారథి గుడి సన్నిధి వీధిలోనే బస చేస్తాను. నాతో పాటు మా పరివారం కూడా అక్కడే ఉంటాం. రాజా! మీరు ఏమీ అనుకోక పోతే నాదో చిన్న విన్నపం. నేను చంద్రగిరిని దాటాక మీ ఏలుబడి అయిన ప్రాంతాలొచ్చాయి. ఈ యేడు వర్షాలు లేక పంటలు సరిగా పండక జనం ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలిసింది. ప్రజలు పంటలు పండకపోతే పన్నులు కట్టలేరు. దీనిని బట్టి మీ ఆర్థిక ఇబ్బందులను నేను ఊహించగలను. పార్థసారథి ఆలయంలో నిర్మించే గోవిందరాజస్వామి ఆలయానికి ఉడుతాభక్తి నా దగ్గరున్న ధనాన్ని

మీకు సమర్పిస్తాను. అలా నా ధనానికి ప్రయోజనం చేకూరుతుంది. దయచేసి నా విన్నపాన్ని కాదనకండి" అని వినమ్రతతో చేతులు జోడించి అంది గోవిందమ్మ.

"మీరు గురువుగారైన రామానుజాచార్యుల వారు విగ్రహాన్ని చిదంబరం నుండి ఇక్కడకు తీసుకొని రావడానికి ధనాన్ని సమకూరుస్తానంటే వద్దన్నారని గురువుగారే చెప్పారు. మీ మాటకు విలువివ్వమని రామానుజులవారే సెలవిచ్చారు. నేను కాదనగలనా? అంతా దైవేచ్ఛ. ఎలా జరగాలో అలాగే జరుగుతుంది. మీరే దగ్గరుండి గోవిందరాజస్వామి మంటపాల, గర్భగృహ పనులను పర్యవేక్షించండి. మా స్థపతులు, శిల్పులు మీ ఆధీనంలో ఉంటారు. మీ చెంత ధనం ఉన్నంత వరకు ఖర్చు చేయండి. ఆ తర్వాత మా భాండాగార ధనం రంగంలోకి దిగుతుందన్న సంగతిని మరచిపోకండి" అన్నాడు ఘట్టి దేవరాయలు చిరునవ్వు చిందిస్తూ. గోవిందమ్మ రెండు చేతులెత్తి రాయలకు ప్రణమిల్లింది.

"నా పర్యవేక్షణ ఏంటి? అంతా గోవిందరాజస్వామే పర్యవేక్షించు కొంటాడు. నా ఆధీనంలో స్థపతులు, శిల్పులేంటి? అందరం స్వామి ఆధీనంలోనే కదా పనిచేసేది" అంది గోవిందమ్మ తన వినయం ప్రదర్శిస్తూ.

"మీకు పార్థసారథి గుడి సన్నిధి వీధిలో మా మంత్రి బస ఏర్పాటు చేస్తాడు. మీరు, మీ పరివారం అక్కడే ఉండండి. పార్థసారథి గుడి పేటలో అన్నీ లభిస్తాయి" అంటూ ఘట్టి దేవరాయలు పరివారంతో అశ్వారూఢుడై రాచకార్యానికి బయలుదేరి వెళ్ళి పోయాడు.

పార్థసారథి గుడి గర్భాలయానికి ఆనించి ముఖ మంటపాలను, గర్భాలయాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మించారు. రెండు ఆలయాలకు కలిపి పెద్ద విస్తరణ మంటపాన్ని కట్టి ఒకే ఆలయం అనే భ్రమను కల్పించారు. ధ్వజ స్తంభానికి, బలిపీఠానికి ఉత్తర, దక్షణ మూలల్లో నాలుగు కాళ్ళ ఉత్సవ, నాట్య మంటపాలను నిర్మించారు. ఇవన్నీ చేయడానికి చాలా నెలలే పట్టాయి. ఓ సుముహూర్తాన రామానుజా చార్యులు విచ్చేసి ఘట్టి దేవరాయల సమక్షంలో గోవిందరాజస్వామి విగ్రహానికి పున: ప్రతిష్ఠ, అష్టబంధనం, సంప్రోక్షణలు నిర్వహించి, ఆలయాన్ని ప్రారంభించాడు. ఆ సందర్భంగా సాయంత్రం తిల్లా గోవిందమ్మ, బృందం కలిసి నృత్య నీరాజనంతో వచ్చిన ప్రముఖులను అలరింపజేశారు. కిక్కిరిసిన జనంతో ఆలయం చప్పట్లతో మారు మోగిపోయింది.

"తిల్లా గోవిందమ్మా! నీ జన్మ సార్థకమైంది. చిదంబరం వెళ్తావా? ఇక్కడే ఉంటావా?" అడిగాడు రామానుజులు.

"స్వామీ! చిదంబరంలో ఏముందని, ఎవరున్నారని వెళ్ళను. నా స్వామిని ఇక్కడ ఉంచుకొని ఇంకెక్కడా జీవించలేను. గోవిందరాజ స్వామి సేవలోనే నేను తరిస్తాను. అన్నపాన, విశ్రాంతులకే సన్నిధి వీధిలోని నా ఇల్లు. మిగిలిన సమయమంతా గుడిలోనే సేవ చేసుకుంటాను. అందుకు మీ అనుమతి కావాలి".

"నిరభ్యంతరంగా నువ్వు కోరుకున్నట్లే గోవిందరాజస్వామికి నిరంతరం సేవ చేయి. ఉదయాన నీ గజ్జెల మోతతోనే స్వామిని మేల్కొలుపు. గుడిలో ఆలనా పాలనా అన్నింటిని నువ్వే దగ్గరుండి చూసుకో. సముద్రం పాలైన గోవిందరాజస్వామిని ఎంతో శ్రమకోర్చి ఇక్కడికి తీసుకొచ్చి ప్రతిష్ఠించావు. ఎంతో ధనాన్ని వెచ్చించావు. ఈ గుడిలో నీ తర్వాతే ఎవరైనా. నిర్వహణా బాధ్యతాధికారాలన్నీ నీవే. స్వామి తొలి దర్శనం కూడా నీకే. సంతోషమేనా గోవిందమ్మా? నువ్వు పడ్డ శ్రమకు నీకు ఏమి చేసినా తక్కువే" అని అన్నాడు రామానుజులు.

ఉద్వేగభరితమై కళ్ళతో ఆనంద బాష్పాలు రాలుతుండగా రామానుజుల కాళ్ళమీద పడి నమస్కరిస్తున్న గోవిందమ్మను ఆశీర్వదించాడు రామానుజాచార్యులు.

"ఘట్టి దేవరాయ నీలాంటి రాజపోషకులు లేనిదే ఏ మతమూ మనుగడ సాగించదు. నువ్వు చిరంజీవి అయి, ఎనలేని కీర్తిని మూట గట్టుకుంటావు. ఏ రోజుకా రోజు ఉపయోగపడే ధనం కన్నా ఎల్లకాలం నిలిచిపోయే కీర్తి ధనమే నిజమైన ధనం'' అని రామానుజులు ఘట్టి దేవుని ఆశీర్వదించాడు.

"గురువుగారూ! మీ పాదాలేకాదు, మీ మాటలు కూడా మాకు శిరోధార్యమే. గోవిందమ్మకు ఏ లోటూ రానివ్వం. ఆమెకు అండ దండగా నిలుస్తాం. నా మనసులోని మాటనే గోవిందమ్మతో మీరన్నారు. మీ మాట నిలుపుతాం" అన్నాడు ఘట్టి దేవరాయలు.

"నేను శ్రీపెరంబుదూరుకు వెళ్ళి అక్కడి దేవాలయంలోని అర్చకులకు, దేవాలయాధికారులకు ధైర్యం చెప్పాలి. రక్షణ చర్యలు చేపట్టాలి. తురుష్కులు ఉత్తర భారతదేశంలోకి ప్రవేశించారు. మళ్ళీ ఇదో కొత్త సమస్య మొదలైంది. ఏ క్షణమైనా వారు ఎక్కడైనా దాడి చేయొచ్చు. అందుకు ఇంకా కొంతకాలం పట్టొచ్చు" అంటూ శిష్య సమేతంగా రామానుజాచార్యులు గోవిందరాజస్వామి ఆలయం నుండి బయలు దేరారు.

గోవిందరాజస్వామి గుడిలో గోవిందమ్మ ప్రతిరోజూ స్వామిని దర్శించుకొంటూ నృత్య నీరాజనాల్లో పాల్గొంటూ చుట్టు పక్కల భక్తులందరినీ అలరించింది. గోవిందమ్మ పేరు మారు మోగి పోయింది. ఎనలేని పరపతితో గోవిందరాజ పట్టణంలో ప్రముఖు రాలైంది. అర్చకులు గోవిందమ్మను అబలగానే భావించారు. చులకనగా చూడడం మొదలెట్టారు. పూజా కైంకర్యాలలో అలసత్వం వహించారు. గోవిందమ్మ ప్రధాన అర్చకులతో సమావేశం ఏర్పాటు చేస్తే వాళ్ళు రాకపోగా, హేళనగా చూడడం మొదలుపెట్టారు. స్వామి సేవలు వదలి పెట్టేసి గోవిందమ్మ గూర్చి మాట్లాడుకోవడం

మొదలుపెట్టారు. తిల్లా గోవిందమ్మ అనే పేరు ఎందుకొచ్చిందో చర్చించుకునేవారు. కొందరు నాట్యంలో తిల్లానా పాటలు పాడటం వల్ల తిల్లా ఇంటి పేరొచ్చిందన్నారు. మరికొందరు చిదంబరంలోని గుడి ఉన్న ప్రాంతం ఒకప్పుడు తిల్లాయ్ అడవి ప్రాంతమని అక్కడున్న శివుడ్ని తిల్లై నటరాజన్ అంటారని అలా తిల్లై, తిల్లాయ్, తిల్లాగా మార్పు చెంది చివరకు తిల్లా గోవిందమ్మ అనే పేరొచ్చిందని ఉబుసుపోక చెప్పుకోవడం విని గోవిందమ్మ అర్చకులను కేకేసింది. అర్చకులు, ఆలయ సిబ్బంది తిల్లా గోవిందమ్మను చిన్నచూపు చూడడం ప్రారంభించారు. దీనితో విసిగి వేసారిన గోవిందమ్మ తిరుమల కొండ మీద శ్రీవారి సేవలో నిత్యం పాల్గొనే కైకాల వారిని దత్తతు తీసుకొని వీరికి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకొంది. తిరుమల గుడిలోకెళ్ళి కైకాల అరలో అత్యంత శ్రద్ధాభక్తులతో స్వామి కార్యంలో నిమగ్నమైన కైకాల చెంగారెడ్డిని చూసింది. కౌమారదశలో ఉన్న కైకాల చెంగా రెడ్డిని వారి తల్లిదండ్రులతో మాట్లాడి, వొప్పించి, తన కుమారుడిగా, వారసుడిగా దత్తత తీసుకొంది. తిరుమల శ్రీవారి సన్నిధిలో నుండి గోవిందరాజస్వామి గుడికి తీసుకొచ్చి కైకాల చెంగారెడ్డి చేతికి దివిటీ, గుడి తాళాల పెట్టెనిచ్చి, తొలి దర్శనం చేసుకొనే విధంగా చర్యలు తీసుకుంది. దీంతో ఆలయ పరిస్థితులు దారికొచ్చాయి. ఇలా కొన్ని యేళ్ళు గడిచాయి. కైకాల చెంగారెడ్డి పెండ్లీడుకొచ్చాడు. పెండ్లి చేసింది. గుడిలో భక్తుల సంఖ్య పెరిగారు. అన్నీ సాఫీగా జరిగి పోతుందనుకుంటుండగా తురుష్కులు గోవిందరాజస్వామి గుడిపైన కన్నేశారని తెలిసింది. ఎందుకైనా మంచిదని పార్థసారథి గర్భాలయానికి అడ్డుగా పెద్ద రాతిగోడను నిర్మించారు. భక్తుల రద్దీ వల్ల గోవిందరాజస్వామి గర్భాలయ గోడ కట్టడం ఆలస్యమైంది. ఈలోగా తురుష్కులు గోవిందరాజస్వామి గుడిపైకి దండెత్తారు. పార్థసారథి ఆలయం తప్పించుకొన్నా, గోవిందరాజస్వామి నగలను దోచుకొన్నారు. వెండి పాత్రలను మూటగట్టుకొన్నారు. వెళ్ళే ముందు గోవిందరాజస్వామి విగ్రహం ముక్కును, చేతి వేళ్ళను కొద్దిగా భిన్నం చేశారు. గోవిందమ్మను, పరివారాన్ని గృహనిర్బంధం చేశారు. ఆ తర్వాత గోవిందరాజస్వామిని చూసిన గోవిందమ్మ కళ్ళు తిరిగి కింద పడిపోయింది. తాను ఎంతో ప్రేమించిన స్వామి పూజకు పనికి రాకుండా పోయాడని చింతించి మనోవ్యాధితో మంచం పట్టింది. ఘట్టి దేవరాయలు హుటాహుటిన నారాయణ వనం నుండి సైన్య సమేతుడై వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. తురుష్కులను తరిమికొట్టి వచ్చిన ఘట్టి దేవరాయలు ఆగమ శాస్త్రాన్ని అనుసరించి భిన్నమైన గోవిందరాజస్వామిని గర్భాలయం నుండి తొలగించి, రాతి శిల్పాన్ని మళ్ళీ ప్రతిష్ఠించాలంటే చాలా కాలమౌతుందని భావించి సున్నం, ఇటుక రాళ్ళతో మళ్ళీ అతివేగంగా గోవిందరాజస్వామి విగ్రహాన్ని నిర్మించి ఓ శుభముహూర్తంలో సుధా శిల్పాన్ని ప్రారంభించాడు. ఆగమ శాస్త్ర పండితుల సలహానుసరించి స్వామికి జలాభిషేకం బదులు తైలాభిషేకాన్ని నిర్ణయించాడు. నగలు, కిరీటాలన్నింటినీ సమకూర్చి మళ్ళీ దీపధూప నైవేద్యాలు సక్రమంగా జరిగేటట్లు చేశాడు. రాణి వారు స్వర్ణముఖీ నది ఒడ్డునున్న పైడిపల్లి గ్రామంలో వచ్చే సగం ఆదాయాన్ని స్వామి వారికి సమర్పించింది. మిగిలిన సగం ఆదాయాన్ని తిరుమలేశునికి చెందేటట్లు చేసింది. గోవిందరాజ స్వామికి ఏటా రథోత్సవాన్ని కూడా ఏర్పాటు చేశారు. గోవిందమ్మ దుస్థితికి చాలా చింతించారు. చిదంబరం నుండి తెచ్చిన గోవిందరాజస్వామి రాతి శిల్పాన్ని గుడిలో ఉంచడం శ్రేయస్కరం కాదని గోవిందరాజస్వామి గుడికి కాస్త దూరంలో ఉన్న నేడు మంచినీళ్ళ గుంటగా పిలువబడే నరసింహ తీర్థం గట్టుమీద ఉంచమన్నాడు ఘట్టి దేవరాయలు. అక్కడి నుండి ఆలయానికి అవసరమయ్యే జలాన్ని తెచ్చే విధంగా ఏర్పాట్లు చేశాడు. గోవిందమ్మ చేసిన ఏర్పాట్లన్నీ యథావిధిగా కొనసాగించమని ఆజ్ఞాపించాడు ఘట్టి దేవరాయలు.

యథా ప్రకారం స్నాన సంధ్యలు ముగించుకొని కాగడాతో వెళ్ళి గోవిందరాజస్వామిని మొదటి దర్శనం చేసుకొన్న కైకాల చెంగారెడ్డి సన్నిధి వీధిలోని ఇంటి కొచ్చాడు. తల్లి ఆవేదనను అర్థం చేసుకొన్నాడు. స్వామిని చూస్తే మనసు కుదుట పడ్తుందని, మామూలు మనిషి అవుతుందని ఆశించాడు. పిచ్చి దానిలా ఉన్న గోవిందమ్మను పరివార జనం బాగా అలంకరించి గుడికి తీసుకెళ్ళి గోవిందరాజస్వామిని చూపించారు. కెవ్వున కేకవేసింది.

“నా గోవిందరాజస్వామి ఈయన కాదు. విగ్రహం భిన్నమైనా ఫర్వాలేదు. ఆగమ శాస్త్రాలతో నాకు పని లేదు. నన్ను నా స్వామి చెంతకు చేర్చండి మీకు దణ్ణం పెడ్తాను. ఆయనను ఎలాగైనా చూడాలి. నన్ను ఆపకండి” అని ప్రాధేయ పడింది గోవిందమ్మ.

పల్లకీలో గోవిందమ్మను నరసింహ తీర్థం గట్టుమీదకు తీసుకెళ్ళి గోవిందరాజ స్వామి భిన్నమైన శిల్పాన్ని చూపించారు. పరుగు పరుగున వెళ్ళి స్వామి కాలి మీద తలవాల్చి ఏడ్చి, ఆలనా పాలనా లేని గోవిందరాజస్వామి విగ్రహాన్ని తనివితీరా అణువణువునా స్పృశించి కన్నీళ్ళ పర్యంతమైంది.

“చివరకు నిన్ను ఇంతదూరం తెచ్చింది ఇలా చేయడానికా స్వామీ? నాలో లోపం ఉందా స్వామీ? నీ కోసం నిరంతరం తపించే నాకు ఈ శిక్ష తగునా స్వామీ? ఇదంతా నీ నాటకం కాక మరేంది స్వామీ? నీవు లేక నేను లేను స్వామి. నేను దేవదాసీనైనా ఎప్పుడూ నీ చరణ దాసినే స్వామీ” అంటూ గోవిందరాజస్వామి పాదాల మీద తల ఆన్చి అలాగే ప్రాణాలు వదిలేసింది తిల్లా గోవిందమ్మ.

అక్కడున్న వాళ్ళంతా గొల్లుమన్నారు. కైకాల చెంగారెడ్డి తన తల్లి మాటల అంతరార్థం ప్రకారం గోవిందరాజస్వామి చెంతనే ఉత్తరం వైపున ఆమెను ఖననం చేసి రాతి సమాధిని కట్టాడు. గోవిందమ్మ గోవిందరాజస్వామిని చిదంబరంలోనూ విడచి ఉ

# ఒక హిజాబ్ గీతం

సవాళ్ళు ఎదురుపడి మహా స్వామినికి
మృత్యు సంకెళ్ళు పడ్డాయి
దావానలంలా నగరమంతటా వ్యాపించి
అనేక స్థలాల్లో జరిగిన అల్లర్లలో
గాయపడ్డ సానుభూతి పావురాళ్ళన్నీ
ధైర్యంగా కట్టు కట్టుకొని ఆకాశ దేశాన
విహరిస్తున్నాయి ... విలపిస్తున్నాయి.
వినిపిస్తున్నాయి
ఈ హిజాబ్ నిరసనలు వద్దనీ రద్దనీ
దయార్ద్ర హృదయాలు కరువైన నేతలకి
ఎవరు చెప్పాలి.
జనం చర్చించుకుంటున్నారు
గుంపులు గుంపులుగా ప్రవాహంలా
పరవళ్ళు తొక్కుతున్నారు.
ఎవరి విధానాలు వాళ్ళవి... ఎవరి నినాదాలు వాళ్ళవి
అల్లాను ప్రార్థించేది ఒక్కటే
దుస్సాహసాన్కి పాల్పడే క్షణాలు రణాలుగా మారొద్దని
హిత మాటలకి విలువివ్వాలి
మత దురాచారం వీడాలి
నిరుపయోగమైన సంప్రదాయాన్ని తగలేయడమంటే
ఖురాన్ని ఖండించడం కాదు
హిజాబ్లో
దేశ ప్రగతి దేశ భవిత దాగి ఉందా? ప్రశ్న
నగారా మ్రోగించిన ఇరాన్ ఆధునిక మహిళ
నయాగరా దూకించిన ఇరాన్ అత్యాధునిక మహిళ
పోరుగాలిని ఆపగలమా..
సౌకర్యంగా ఉండాలి.
అశేష జన విశ్వాసాన్ని చొరగొనేలా వుండాలి.
నిజాలు దాచిపెట్టడం కాదు.. అబద్ధాలు బైటపెట్టడం కాదు
కట్టు బొట్టు అంటే, కట్టుబాటంటే...

**కోటం చంద్రశేఖర్**
ఫోన్ : 94920 43348

ండలేదు. తిరుపతి మంచినీళ్ళ గుంట మీద కూడా విడచి ఉండలేదు. ఆమెకు స్వామితో ఉన్న అనుబంధం అలాంటిది. ఈ అనుబంధం జన్మ జన్మల అనుబంధం కాక మరేమిటి?.

తల్లి మరణాన్ని జీర్ణించుకోలేని కైకాల చెంగారెడ్డి కూడా కొన్నేళ్ళకే మరణించాడు. ఆయనను కూడా తల్లి గోవిందమ్మ పక్కనే సమాధి చేశారు.

కైకాల చెంగారెడ్డి వారసుల్లో కొన్ని తరాల తర్వాత సెల్లి అనే అమ్మాయి జన్మించింది. ఆమె అచ్చం గోవిందమ్మలాగే అందగత్తె. ఆమె తిరుమలలో నాట్యగత్తెగా మారి 21-11-1543లో తిరుమల ఉత్సవర్లకు తిరుమంజనం జరపడం కోసం రోహిణిలో చైత్ర మాసంలో... పంట నూర్పిడి కాలంలో జరిగే ఉత్సవ సమయంలో 1120 ఫణాల దానం చేసింది. తిరుమలలో కూడా తిల్లా గోవిందమ్మ వారసత్వం వల్లే దేవదాసీలు దేవుడి ఊరేగింపు అయ్యాక కుంభ హారతిచ్చేవారు. మొన్నటి వరకు కైకాల స్త్రీలే కుంభహారతిచ్చేవారు. మెల్లగా ఇటీవల వచ్చిన మార్పుల వల్ల, తర్వాతి తరం స్త్రీలు ఆసక్తి చూపకపోవడం వల్ల తిరుమల, తిరుపతుల్లో కుంభ హారతులకు కైకాల స్త్రీలు దూరమయ్యారు. ఆనాడు తిల్లా గోవిందమ్మ తన వారసుల జీవనాధారం కోసం 108 ఎకరాల్లో చెరువును తవ్వించి దానికింద 40 ఎకరాల వ్యవసాయ భూమిని తన వారసులకు అందజేసింది. దీనిని ఇప్పటికీ కైకాల చెరువు అని పిలుస్తున్నాం. నేటి బ్లిస్ హొటల్ వెనుక వైపున్న స్థలం కైకాల చెరువే. దురాక్రమణదారులు కైకాల వాళ్ళ చెరువును, భూములను కబ్జా చేసి అందరికీ అమ్మేశారు.

అయితే ఇప్పటికీ ప్రతిరోజు గోవిందరాజస్వామి గుడి బీగాలను, దివిటీని తీసుకెళ్ళి గుడి తలుపులు తెరిచి గోవిందరాజస్వామిని మొదటి దర్శనం చేసుకొనేది కైకాల రెడ్లే. తిల్లా గోవిందమ్మ కైకాల చెంగారెడ్డి నుండి ఏర్పాటు చేసిన ఈ ఆచారం నేటికీ వారి వారసులు కొనసాగిస్తూనే ఉన్నారు. తిల్లా గోవిందమ్మ తన వారసులు చేసుకొనే మొదటి దర్శనం ఆమె చేసుకొంటున్నట్లే కైకాల వారసులు భావిస్తుంటారు. ఇప్పటికీ వారు తాము తిల్లా గోవిందమ్మ వారసులు గానే సగర్వంగా చెప్పుకుంటుంటారు. ఈ మధ్య కాలంలో పి.వి.ఆర్.కె. ప్రసాద్ తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా ఉన్నప్పుడు ఆయన పార్థసారథి గర్భాలయంలోని రాతి గోడను తొలగించి పార్థసారథిని భక్తులకు అందుబాటులోకి తెచ్చినా గోవిందరాజస్వామి గుడిగానే నిలిచిపోయింది. తిల్లా గోవిందమ్మ తన వారసుల రూపంలో నేటికీ తొలి దర్శనం చేసుకుంటూనే ఉంది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1 (47) హైదరాబాద్ నవంబర్ : 2022

తెలంగాణ విస్మృత కవులు - 5

# తుమ్మూరి పద్మనాభ శర్మ

డా. పెబ్బేటి మల్లికార్జున్, సహాయ ఆచార్యులు, నాగర్ కర్నూలు, ఫోన్: 9491881916

పరిశోధన నిమిత్తం కరీంనగర్‌కు చెందిన తుమ్మూరి రామమోహన్‌రావు గారిని కలిసినప్పుడు వారి తండ్రిగారైన పద్మనాభశర్మ గురించి సమాచారం ఇచ్చారు. ఉన్నతమైన సాహిత్య సృజన చేసి అముద్రిత రచనలతో విస్మృత కవిగా ఉన్నారు.

పద్మనాభంగారు తులిశమ్మ, మురహరి దంపతులకు కరీంనగర్ జిల్లాలోని వెలిగందల గ్రామంలో 19జూన్ 1924లో జన్మించారు. తెల్లకందులు అనే పేరు మీద తెల్లకందుల, వెల్లకందుల, వెలిగందల చివరకు ఇప్పుడు ఎల్గందల్‌గా పిలువబడుతున్నది. ఈ గ్రామ ఖిల్లా ఉన్న గుట్టపై నరసింహ ఆలయం ఉంది. ఆ ఆలయంలో ఉన్న శాసనం ద్వారా ఆ దేవాలయం వెయ్యి సంవత్సరాల క్రితానికి చెందినదిగా తెలుస్తుంది.

వీరు కరీంనగర్‌లో మాధ్యమిక విద్యనభ్యసించి బేసిక్ శిక్షణ పొంది ప్రాథమిక ఉపాధ్యాయునిగా చేశారు. తరువాత ప్రవేశ పరీక్షరాసి డి.ఓ.ఎల్., బి.ఓ.ఎల్., పరీక్షలు ఉత్తీర్ణులై ద్వితీయశ్రేణి తెలుగు పండితులుగా పదోన్నతి పొందారు. వీరు ఎక్కువ కాలం వెలిగందలలోనే ఉద్యోగం చేశారు. చివరలో ప్రథమశ్రేణి తెలుగు పండితులుగా పదోన్నతి పొంది జగిత్యాల హైస్కూల్ నుండి పదవీ విరమణ పొందారు.

స్వభావరీత్యా కళాకారులు కనుక పాఠశాలలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహింపజేసేవారు. విద్యార్థులచే నాటకాలు వేయించేవారు. నృత్యాలు కూడా వేయించి బుర్రకథలు చెప్పించేవారు. జానపదగేయాలు రాసి వాటిని అభినయింపజేసేవారు. మొదటి నుండి పద్యాలు రాస్తూ వచ్చారు. ఉద్యోగ విరమణ తరువాత కూడ పద్య సాహిత్య సృజన చేశారు. కాని ముద్రణకు నోచుకోలేదు. వారి కుమారులు కొన్ని పద్యాలను తీర్థయాత్ర పేరుతో ప్రచురించారు. వీరు 2007 వ సం॥ లో కాలం చేశారు.

**సాంఘిక దురాచారములు :**

ఈ పేరుతో 35 అముద్రిత కంద పద్యాలున్నాయి. సాంఘిక దురాచారాలతో పాటు నీతికి సంబంధించిన పద్యాలు కూడా ఉన్నాయి. కొంత భాషాజ్ఞానం ఉన్నా వారికి కూడ అర్థమయ్యేటట్లు సరళగ్రాంథికంలో పద్య రచన చేశాడు. మత మూఢత్వం కూడా సాంఘిక దురాచారంగా, పరమత సహనం కలిగినవాడే మానవుడిగా చెప్పాడు.

**'మతమను పిచ్చిని మనుజుడు**
**బ్రతుకే సాధింపలేడు భవుని భజింపన్**
**ఇతర మతంబులు సమమని**
**మతిలోనే నమ్మువాడు మానవుడిలలోన్'** (అముద్రిత ప్రతి - పద్యం - 7)

లంచాన్ని తీసుకునే వారిని కంఠస్వరం పెంచి తిట్టాడు

**'లంచము బొందెడు మూఢుడు**
**కంచెనబడి కసవు వేయుకానిదయైనన్**
**ఇంచుక ధర్మము దెలియక**
**మంచముబడి మడియు సుమ్మా మహిలోనీశా'** (అముద్రిత ప్రతి-పద్యం-9)

వీటిల్లో నీతికి సంబంధించిన పద్యాలు కూడా ఉన్నాయి.

**కం. 'నోటికి అందము మాటయె**
**మాటకు సత్యంబె కూర్చు మహిలోకీర్తిన్**
**గూటికి అందము దీపము**
**పోటికి అందంబె గెలుపు పొందుగనెపుడున్'** (అముద్రిత ప్రతి-పద్యం-22)

**ఆటవెలదులు:**

ఆటవెలదుల పేరుతో ఒక శతకం రాశాడు. 'భాను తేజ రూప పద్మనాభ' అనేది మకుటం. దీనిలో 140 పద్యాలున్నాయి. ఈ శతకంలోని ఒక్కొక్క పద్యం ఒక నీతిని తెలియజేస్తుంది. మనసులో విషం పెట్టుకొనే వ్యక్తుల గురించి

**మాట తీపి బలుకు, మనసున విషముందు**
**దాచిబెట్టు దాని దరికిరాక**
**చేదు భావమెపుడు చెరచును తననెంతో**
**భానుతేజ రూప పద్మనాభ** (అ.ప్ర. పద్యం-12)

ప్రజాకవి వేమన పద్యాల భావాన్ని, ధారను పోలిన పద్యాలు కొన్ని రాశాడు. అలాగే అందరికి అర్థమయ్యేటట్లు రాసిన వేమనలాగే భాషను కూడా ప్రయోగించాడు.

**'తప్పులేనివారు ధరయందులేరయా**
**తనదు తప్పు తెలిసి తనకు తాను**
**తిరిగి చేయకున్న దివ్వెయై వెలుగొందు**
**భాను తేజరూప పద్మనాభ'** (అ.ప్ర. పద్యం-13)

వరకట్నం, వధువుల బాధలతో పాటు ఇల్లు స్వర్గసీమ కావటానికి భార్యాభర్తలు పాటించాల్సిన పద్ధతులను కూడా చెప్పాడు.

**'ఇల్లాలి పలుకులే ఇంటిని వెలిగించు**
**భర్త సౌమ్యుడైన భాగ్యమొప్పు**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1 హైదరాబాద్ నవంబర్ : 2022


**అట్టి జంటగల్లు నా యిల్లె స్వర్గమ్ము**
**భానుతేజరూప పద్మనాభ'** – (అ.ప్ర. పద్యం–21)

ఇంకా ప్రస్తుత పార్టీలు, వాటిల్లోని నాయకుల వలసలు, వారి నిజ స్వరూపాలను బలంగా తెలియజేశాడు. తెలుగు వారి ఉగాది వేడుకలు, మనిషి జీవితయాత్రను, ఆస్పత్రుల పరిస్థితులను, కరువు కాటకాల, మానవత్వ విలువలను చెప్పాడు.

**'మతములెన్నియున్న మానవత్వమె మిన్న**
**కులము యేదియైన గుణమే మిన్న**
**నరుల దేవుడొక్కడే నజ్ఞానమును వీడు**
**భానుతేజరూప పద్మనాభ'** – (అ.ప్ర. పద్యం–102)

**కలి లీలలు శతకం:**

ఈ శతకంలో 120 పద్యాలున్నాయి. తుమ్మూరి వంశ చరిత్ర 30 పద్యాలలో, కలి లీలలు 90 పద్యాలలో ఉన్నాయి. 'భానుతేజరూప పద్మనాభ' అనేది మకుటం. సమాజంలోని అనేక విషయాలను వస్తువుగా కవి తీసుకున్నాడు.

**ఆ.వె. పంట చేలపైన పడవేయ మందులు**
**పైరులన్ని పెరిగి ఫలితమిచ్చు**
**ముందు పంటదిన్న మనకెన్నొ రోగాలు**
**భానుతేజరూప పద్మనాభ**

**వసుధ వెలసె నేడు వరకట్నమనుపులి**
**అన్ని తెగల యందు హద్దుమీరె**
**ముందు త్రోవలేక మునిగిరి పేదలు**
**భానుతేజరూప పద్మానాభ**

లోభి ఆశ ఎక్కువై సంపాదించిన ధనం తేనెటీగ తేనెలాగానే అవుతుందని శతకకారులు ఇంతకు ముందే చెప్పి ఉన్నారు. ఇదే భావాన్ని తనదైన పద్ధతిలో ఒక పద్యంలో చెప్పాడు.

**అధిక ధనముగల్గ ఆరాటమెక్కువై**
**నిత్యసుఖములేక నిద్రబోక**
**తేనె త్రాగలేని తేనెటీగగమారు**
**భానుతేజరూప పద్మనాభ (అ. ప్ర. పద్యం–13)**

1995లో తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన సహజవాయువు అగ్ని ప్రమాదం గురించి కూడా కొన్ని పద్యాలు రాసిన రాతప్రతులు ఉన్నాయి.

**"ఆంధ్రదేశమందు నావిర్భవించెను**
**చెలగి మంటలంటి చమరుతోడ**
**పైకి లేచె జ్వాల పాసర్లపూడిలో**
**భానుతేజరూప పద్మనాభ"**

**శాస్త్రవేత్తలచట సాగిముందుకు వచ్చి**
**అదుపు చేయలేక యదిరిపోయి**
**ఏమి తోచలేక మెచ్చెట్టు పడుచుంద్రి**
**భానుతేజరూప పద్మనాభ!**

తన రచనలన్నింటిని మిత్రునికి అంకితమివ్వడం విశేషం.

**"ప్రాణమిత్రుడతడు పండితశ్రేష్ఠుండు**
**రమ్యకీర్తిశాలి రామమూర్తి**
**అన్ని రచనలిత్తు యంకితమతనికె**
**భానుతేజరూప పద్మనాభ"**

పద్మనాభంగారు సరళభాషలో అందరికి అర్థమయ్యేటట్లు రచించారు. ప్రతిపద్యం ఒక నీతిని బోధించడం విశేషం. వీరి సాహిత్యాన్ని మొత్తం అధ్యయనం చేస్తే వీరు ఒక సంస్కరణవాదిగా, సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన వ్యక్తిగా, అభ్యుదయ వాదిగా, భాషలో, భావంలో వేమనలాగా కన్పిస్తారు.



**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు–**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

**(ప్రపంచ పదులు**
**– డా. సి. నారాయణ రెడ్డి)**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1

UGC Care List Approved Journal
హైదరాబాద్ నవంబర్ : 2022

## కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 27

# సూత్రధారులు

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

**"అహింసా పరమో ధర్మ:"** అనునది బుద్ధుని సూక్తి మరియు మహాభారతం అనుశాసనిక పర్వంలోని ఒక శ్లోకం. 'అహింస' అన్ని ధర్మాల్లోకి ఉత్తమమైనది. కాని నేటి కాలంలో కుల, మత, ప్రాంత, భాషా వైషమ్యాలను అడ్డుపెట్టుకుని పాలకులు వేసే ఎత్తులకు తరచూ ప్రజల మధ్య హింస సంఘటనలు చెలరేగడం చూస్తూనే ఉన్నాం. నేడు పగలు, కక్షలలో హింస సాధారణమైపోయింది. హింసకు తావులేకుండా, గొడవలకు ఆస్కారం లేకుండా మనిషి తనలోని మనిషితనాన్ని మేల్కొలిపినప్పుడే సమాజం, దేశం శాంతియుతంగా సుహృద్భావ వాతావరణంతో వర్ధిల్లుతుంది. **"అహింస"** అనే మాటను నేపథ్యంగా చేసుకుని నిర్మించబడిన చిత్రమే **"సూత్రధారులు".**



**"కె.విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం"** నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం **"సూత్రధారులు".** ఈ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు ప్రధాన పాత్రలో నటించారు. కె.విశ్వనాథ్ మొదటి చిత్రం 'ఆత్మగౌరవం' తర్వాత ఆయన దర్శకత్వంలో అక్కినేని నటించిన రెండవ చిత్రం. 1989 నాటి ఈ చిత్రంలో మురళీమోహన్, భానుచందర్, కె.ఆర్.విజయ వంటి ప్రముఖ నటులు చాలా సామాన్యమైన పాత్రల్లో నటించడం విశేషం.

**చిత్ర కథ**

హనుమద్దాసు (అక్కినేని నాగేశ్వరరావు)– దేవమ్మ (సుజాత) లది పేద కుటుంబమే అయినా అన్యోన్య దాంపత్యం. వీరి కుమారుడు తిరుమలదాసు. హనుమద్దాసు తన కులవృత్తి అయిన గంగిరెద్దులను ఆడిస్తూ ఊర్లో గడప గడపకూ తిరుగుతూ అందరిలోనూ తన మంచితనంతో గౌరవించదగిన వ్యక్తిత్వం కలవాడుగా వుంటాడు. హనుమద్దాసు బావమరిది రంగదాసు (మురళీమోహన్). ఇరువురివీ ఎదురెదురు ఇళ్ళు. రంగదాసు కూతురు సీతాలు (సీతామాలక్ష్మి) (రమ్యకృష్ణ). తల్లి లేని పిల్ల అవడం వల్ల సీతాలును ఆమె తండ్రి రంగదాసు, మామ హనుమద్దాసులు గారాబంగా పెంచుతారు. సీతాలు మహా చిలిపి పిల్ల. ఆమె తండ్రి రంగదాసు కూడా బావతోపాటే కులవృత్తి చేస్తూ ఆయనకు అన్ని విషయాల్లో కుడిభుజంలా వుంటాడు.

నీలకంఠం (కైకాల సత్యనారాయణ) ఊర్లో పెద్దమనిషి. ఆ ఊర్లో ఏం జరిగినా అతడి కనుసన్నల్లో, అతడి ఆజ్ఞలకు అనుగుణంగా జరగాల్సిందే. మూర్తిమత్వంలో మంచివాడిలా కన్పించినా వ్యక్తిత్వంలో మాత్రం మహాపాపి. ఆయన భార్య పక్షవాతంతో మంచానికే పరిమితమైన ఇల్లాలు. ఆయన వద్ద పాలేర్లుగా ఒక వృద్ధుడు ఆయన కొడుకు నరసింహం (కోట శంకర్రావు) పనిచేస్తూ వుంటారు. నరసింహంకు అయ్యగారైన నీలకంఠం అంటే కోపం కానీ పాలేరు అవడం వల్ల వెట్టి బతుకును భరిస్తుంటాడు. నరసింహం కోపానికి ప్రధాన కారణం నీలకంఠం పేదల కష్టాన్ని, మానాన్ని దోచుకోవడానికి ఏ మాత్రం సంశయించకపోగా ఎదురు తిరిగిన వారిని దండిస్తూ వుండడం. నీలకంఠం హనుమద్దాసును పర్వదినాల రోజు తన ఇంట్లో గంగిరెద్దులను ఆడించడానికి విరివిగా పిలుస్తుంటాడు. కాని రంగదాసుకు మాత్రం బావ హనుమద్దాసు నీలకంఠం ఇంటికి గంగిరెద్దులను తీసుకొని వెళ్ళడం నచ్చదు. కాని ఈ తంతు తరచూ కొనసాగుతూనే వుంటుంది. నీలకంఠం తన అధిపత్యం చాటు కోవడానికి హనుమద్దాసుతో నీ కొడుకు తిరుమలదాసు పెద్ద చదువులు చదువుతున్నాడు కదా అని! పొగరును తలకెక్కించుకోకుండా, నీలా వుండడం నేర్చుకొమ్మని చెప్పమంటూ సలహా ఇస్తూ వుంటాడు.

హనుమద్దాసు కుమారుడు తిరుమలదాసు నగరంలో కలెక్టర్ కోసం ప్రిపేర్ అవుతూ వుంటాడు. తిరుమలదాసుకు విద్యాబుద్ధులు నేర్పడంలో యశోదమ్మ (కె.ఆర్.విజయ)ది ప్రధాన పాత్ర. యశోదమ్మకు పురాణ, ఇతిహాసాలలో మంచి జ్ఞానం వుంటుంది. కారణం ఆమె గతంలో హరికథలు చెప్తూ వుండడం. యశోదమ్మ భర్త రామానంద తీర్థులు. వీరిది బ్రాహ్మణ కుటుంబం. ఊరూరా హరికథలు చెప్తూ జీవనం సాగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో యశోదమ్మ దంపతులు ఒకసారి పెద్దమనిషి నీలకంఠం ఊరికి నీలకంఠం భార్య కోరిక మేరకు హరికథా గానం చేయడానికి వస్తారు. ఆ సమయంలో నీలకంఠం ఆ దంపతులను తమ ఊరిలోనే వుండి పాఠశాలలోని పిల్లలకు పురాణాంశాలు బోధించమంటూ కోరతాడు.

అంతేకాక వారుండడానికి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తాడు. ఒకరోజు తీర్థులును అవసరం సృష్టించి మరీ వేరే ఊరికి వెళ్ళేలా ప్రణాళిక వేస్తాడు. తీర్థులు వేరే ఊరికి వెళ్ళిన తర్వాత ఆ రాత్రి బలవంతంగా తీర్థులు భార్య యశోదమ్మను బలాత్కరిస్తాడు నీలకంఠం. తీర్థులుకు ఆ విషయం తెలిసి నిశ్చేష్టుడవుతాడు. ఆ సంఘటన తర్వాత యశోదమ్మ తాను ఏ తప్పు చెయ్యనప్పటికీ భర్తతో సంసార జీవితానికి అర్హురాలును కాదు అనే ఆలోచనతో భర్త ముందే తన ఫోటోకు స్వయంగా పూలదండ వేసుకుని భర్తకు దూరంగా వెళ్ళి బతకడానికి బయల్దేరుతుంది. ఆ సమయంలో హనుమద్దాసు, ఊర్లో వాళ్ళు ఆమెను వెళ్ళొద్దని వారించే ప్రయత్నం చేసినా ఆమె తన నిర్ణయానికే కట్టుబడి వెళ్ళిపోతుంది. ఆ సమయంలో హనుమద్దాసు కుమారుడు తిరుమలదాసు ఆమెతో పాటు వెళ్ళి విద్యాబుద్ధులు నేర్చుకుంటాడు. ఎప్పటికైనా యశోదమ్మను భర్త తీర్థులు తో కలపాలనేది తిరుమలదాసు ఆలోచన.

తిరుమలదాసు నగరంలో చదువుతుండగా అతడితో పెళ్లి కోసం ఎదురుచూస్తూ వుంటుంది సీతాలు. సీతాలుకు బావంటే వల్లమాలిన ప్రేమ. ఒకసారి బావ కాదన్నాడని కోపంతో ఆ ఊరి పంతులుతో లేచిపోవడానికి సిద్ధపడి వెనుతిరుగుతుంది. నీలకంఠం తన వద్ద పనిచేసే నరసింహంను ధాన్యాన్ని ఇంటికి తీసుకుపోయినందుకు దండిస్తాడు. మనం కష్టం చేస్తే నీలకంఠం ధాన్యం లాక్కుపోవడం ఎంతవరకు న్యాయం అంటూ బాధపడతాడు నరసింహం. ఊరి జనం మొత్తానికి నీలకంఠంతో ఇలాంటి బాధలే కాని అతనికి ఎదురు చెప్పలేని నిస్సహాయత. సరిగ్గా ఇదే సమయంలో తిరుమలదాసు కలెక్టర్ అవుతాడు. చదువు చెప్పించిన యశోదమ్మ, తల్లిదండ్రులు ఊరి జనం అంతా సంతోషిస్తారు. ఆఖరకు నీలకంఠంతో సహా. తిరుమలదాసు కలెక్టర్‌గా వాళ్ళ ఊరికే వస్తాడు. అప్పటికే ఊరి జనం అంతా మనవాడే కలెక్టర్ అయి వస్తున్నాడు కాబట్టి మనకు మద్దతుగా వుంటాడు, నీలకంఠం నుండి గండం గడిచింది అనే ఆలోచనలో వుంటారు. కాని వచ్చీ రాగానే తిరుమలదాసుకు మర్యాదలు చేసి తనవైపు నిలబడేలా చేసుకుంటాడు నీలకంఠం.

తిరుమలదాసు నీలకంఠంకు మద్దతుగా నిలవడాన్ని భరించలేని ఊరి జనం హనుమద్దాసును నిలదీస్తారు. దానికి హనుమద్దాసు తిరుమలదాసు మనకోసం ఏదో చేస్తాడని ఆశపడి భంగపడిన మీరు కోపంతో ఊగిపోతున్నారు. ఇదే కోపాన్ని అందరూ కలిసికట్టుగా నీలకంఠంను ఎదిరించడానికి వాడితే! అంటూ సలహా ఇస్తాడు. కాని అందరూ నీలకంఠానికి భయపడి వెనకడుగేస్తారు. కాని హనుమద్దాసు ముందడుగేసి మనకోసం తిరుమలదాసు లాంటి మనిషి ఒకడు వస్తాడనే నమ్మకాన్ని పక్కన పెట్టి మన భూములను మనమే కాపాడుకుందాం పదండి అంటూ ముందుకు కదిలేలా చేస్తాడు. తిరుమలదాసు నీలకంఠానికి మద్దతుగా వుండడం చూసి సీతాలు అతడిపై కోపంగా వుంటుంది. ఇదిలా వుంటే నీలకంఠం మాత్రం దేవాలయ భూములను పూర్తిగా తన పేర రాయించు కునేందుకు తిరుమలదాసుకు బుజ్జగింపులు చేస్తుంటాడు.

నీలకంఠం దేవాలయ భూములను స్వాధీనం చేసుకోవాలను కున్నాడు అనే విషయం తెలిసి హనుమద్దాసు, రంగదాసులు ఊరందరినీ తీసుకొని దేవాలయ భూముల్లో నీలకంఠాన్ని కాలు మోపకుండా చేసేందుకు మూకుమ్మడిగా కదులుతారు. అక్కడ గొడవ సద్దుమణిగేలా చేసేందుకు నీలకంఠాన్ని వెనక్కి తగ్గమని తిరుమలదాసు సలహా ఇస్తాడు. తర్వాత ఆ విషయంపై గుర్రుగా వున్న నీలకంఠానికి ఆ భూమి మీకు చెందే పథకం తయారు చేశానని చెప్తాడు. దానికై దేవాలయ భూములను వేలం వేస్తున్నట్లు చెప్తాడు. ఈ వేలంలో మీకన్నా ఎక్కువ డబ్బులు పాడి భూమిని తీసుకునే దమ్ము ఎలాగూ ఈ ఊరిలోఎవ్వరికీ లేదు కాబట్టి చివరికి ఆ భూమి మీకే దక్కుతుంది అని వివరిస్తాడు. కాని ఆ విషయం తెలిసి చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న నీలకంఠం లాంటి పెద్ద మనుషులు అంతా కలెక్టర్ తిరుమల దాసును ఒక్కొక్కరూ రహస్యంగా కలిసి ఆ భూమి వాళ్ళకే చెందేలా చెయ్యడం కోసం పెద్ద మొత్తంలో డబ్బును లంచంగా ముట్టజెప్తారు. వేలం పాడే రోజున నీలకంఠంతో పాటు ఒక్కొక్కరుగా అందరు పెత్తందార్లు వస్తూ వుంటారు. వారందరినీ చూసి నీలకంఠం అవాక్కవుతాడు. వేలం పాట మొదలవుతుంది. నీలకంఠంతో సహా అందరూ ఒకరికి మించి ఒకరు డబ్బును పాడుతుంటారు. వేలం పాట పోటాపోటీగా సాగుతున్న సమయంలో వీరికి విభిన్నంగా ఒక పేద వ్యక్తి వేలంలో పాల్గొంటాడు. అంతేకాక ఊహించని రీతిలో డబ్బును పాడి ఆ భూమిని స్వంతం చేసుకుంటారు. నీలకంఠంతో పాటు అక్కడున్న పెద్దమనుషులంతా కంగుతింటారు. పైగా ఆ పేద వ్యక్తి నీలకంఠం వద్ద పనిచేసే పాలేరు నరసింహం తండ్రి. చివరికి వారంతా లంచంగా ఇచ్చిన డబ్బును తిరుమలదాసు వేలంలో పేద రైతుకు ఇచ్చి ఆ భూమి తమకు దక్కకుండా చేశాడని తెలుసుకొని విస్తుపోతారు. సరిగ్గా అదే సమయంలో నీలకంఠం భార్య మరణిస్తుంది. నీలకంఠం ఎన్ని పాడు పనులు చేసినా ఊరి జనం సాటి మనుషులుగా స్పందించి ఆమె అంత్యక్రియల్లో పాల్గొంటారు. అది చూసి వారిలోని మనిషితనానికి చలించిపోయి తాను చేసిన తప్పులకు ఊరి జనంతో పశ్చాత్తాపం కోరతాడు నీలకంఠం. మరోవైపు తిరుమలదాసు యశోదమ్మను భర్త తీర్థులుతో కలపుతాడు. మొత్తానికి ఎలాంటి రక్తపాతం లేకుండా నీలకంఠానికి అతనిలాంటి ఇతర గ్రామాల్లోని పెద్దమనుషులకు సద్బుద్ధి కలిగేలా చెయ్యడంతో కథ ముగుస్తుంది.

**చిత్ర విశేషాలు**

"సూత్రధారులు" అక్కినేని నాగేశ్వరరావు, భానుచందర్‌లను ప్రధానంగా చేసుకుని ఒక ఊరిని యూనిట్‌గా తీసుకుని అంతకు

ముందు కాలం, ఆ కాలంలోనూ ఉన్నట్టి పెత్తందార్ల, భూస్వామ్య, పటేల్, జాగీర్దార్, దేశ్‌ముఖ్, జమీందారీ వ్యవస్థల అన్యాయాలను కళ్ళకు గడుతూ ప్రశ్నించేలా తీసిన సినిమా. బలవంతుడికి బలహీనుడు హింసతో ఎదురు తిరిగితే అది రక్తపాతానికి దారితీస్తుంది. కొన్నిసార్లు ఒక సమూహం యొక్క ఆగ్రహావేశాలు విప్లవానికి దారితీస్తాయి. సమస్య పూర్తిగా సమసిపోవాలంటే సంఘటితంగా ప్రశ్నిస్తూ, బుద్ధితో అవతలి వ్యక్తి లేదా వ్యవస్థల ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావాల్సి వుంటుంది. అలా అని విప్లవ నేపథ్యాలను, విప్లవాలను సమాజ పరివర్తనలో విస్మరించలేము. ఏదేమైనప్పటికీ సమాజంలోని సమస్యల పరిష్కారానికి హింసే మార్గం అని భావించకుండా సమస్య మూలాలను తర్కంతో శోధించి ఆలోచన, ఆచరణ సహిత మార్పును అన్ని వర్గాలవారు ఆహ్వానించి, ఆమోదించ గల్గినప్పుడే మార్పు సాధ్యం అవుతుందనే విషయాన్ని కథాంశంగా చెప్పారు దర్శకుడు.




తన చలన చిత్ర ప్రస్థానంలో చారిత్రక, పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో నటించి ఎన్.టి.ఆర్ కు సాటి, పోటీగా నిలిచిన నాగేశ్వరరావు ఈ చిత్రంలో హనుమద్దాసు పాత్రలో ఒక సాధారణ గంగిరెద్దుల కులవృత్తికి చెందిన వ్యక్తిగా నటించడం అనేది ఆయనకు విభిన్న పాత్రల్లో నటించడం పట్ల ఉన్న నటనానక్తిని తెలియపరుస్తుంది. హనుమద్దాసు పాత్రలో గాంభీర్యం, ముందుచూపు, కుటుంబం పట్ల బాధ్యత, ఊరి ప్రజలకు మంచి చెయ్యాలనే తపన, దానికై సరైన సమయంలో తెలివిగా ముందడుగు వెయ్యాలనే స్పృహ ఉంటుంది. నీలకంఠం హనుమద్దాసును శుభకార్యం నిమిత్తం గంగిరెద్దులను ఇంటికి తీసుకురమ్మని పాలేరును చేత కబురు పంపగా రంగదాసు బావను మూర్ఖుడైన నీలకంఠం ఇంటికి వెళ్ళవద్దని కోరతాడు. కాని బావమరిది మాటను విస్మరించి హనుమద్దాసు వెళ్తాడు. తిరిగొచ్చే సమయంలో రంగదాసు బావ చేసిన పనికి నోరు చేసుకుంటుండగా హనుమద్దాసు కలుగజేసుకుని "ఈరోజు మనం వృత్తి ధర్మం నిర్వహించాం తప్పితే నీలకంఠంకు ఏ సేవలూ చేయలేదు. మన సంప్రదాయాలను గౌరవించే క్రమంలో కుల వృత్తి చెయ్యడం మన బాధ్యత" అని చెప్పే సన్నివేశం ఎవరి కోసం పని చేస్తున్నాం అనేదాని కంటే మనం చేసే పని పట్ల మనకు గౌరవం వుండాలనే విషయాన్ని తెలియజేస్తుంది.

తిరుమలదాసు కలెక్టర్‌గా ఇంటికి వస్తున్నాడని తెలిసి దేవమ్మ భర్త హనుమద్దాసును లోపలికి తీసుకువెళ్ళి "ఎంత మంచి కొడుకును ఇచ్చావయ్యా" అంటూ ముద్దు పెట్టే దృశ్యం చిత్రం మొత్తంలోకి గొప్పదిగా చెప్పొచ్చు. చిత్రంలో మరొక ప్రధాన పాత్ర తిరుమలదాసు. తిరుమలదాసు – సీతాలు మధ్య వచ్చే సన్నివేశాలు చాలా తక్కువే అయినప్పటికీ ప్రతి సన్నివేశం హృద్యంగా వుంటుంది. సీతాలు బావపై చూపే ప్రేమ, కోపతాపాలు కనువిందుగా వుంటాయి. సీతాలుగా రమ్యకృష్ణ కళ్ళతో చేసే హావభావాలు ప్రేక్షకుడిని వెంటాడతాయి. సీతాలు నదీతీరంలో మడి ఆచారాలు ఆచరించే యువ బ్రాహ్మణుడిని ఆట పట్టించడం ఆ పాత్రలోని అల్లరితనాన్ని అవగతం చేస్తుంది. బావ తిరుమలదాసు కలెక్టర్ అయిన తర్వాత ఊరి పెద్ద నీలకంఠంతో కలిసి తమలాంటి పేద కుటుంబాలకు మద్దతుగా నిలవాల్సింది పోయి అన్యాయం చేస్తున్నాడని భావించి యువ బ్రాహ్మణుడితో లేచిపోయే సన్నివేశం ఉత్కంఠగా సాగుతుంది. ఇక తిరుమలదాసు పాత్ర కూడా తండ్రి పాత్రలాగానే పరిస్థితులు ఎలా ఉన్నా దార్శనికతతో ఆలోచించి అడుగు వేయడం, అడుగు వేస్తే విజయం సాధించి తీరడమే అనేలా వుంటుంది. విద్యాబుద్ధులు నేర్పిన యశోదమ్మ పేరు నిలిపేలా కలెక్టర్ అవడమే కాక బుద్ధిబలంతో శత్రువుతో జతకట్టి ఏ హింసకు తావులేకుండా శత్రువు నీలకంఠానికి తన తప్పుల పట్ల పశ్చాత్తాపం కలిగేలా చేస్తాడు. అంతేకాక నీలకంఠంలాంటి మరికొంత మంది పెద్ద మనుషుల నుండి పద్ధతిగా డబ్బును లంచంగా వసూలు చేస్తాడు. అదే డబ్బును వేలం పాటలో ఉపయోగించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పేద వ్యక్తి చేత భూమిని కొనుగోలు చేయించి పేదలందరికీ పంచుతాడు. నీలకంఠం వద్ద పనిచేసే పాలేరు అతడి కొడుకు నరసింహం పాత్రలు నాటిరోజుల్లో వెట్టిచాకిరీ వ్యవస్థ ఎలా వుంటుందో చెప్తూనే దానివల్ల వారు ఎంత కఠిన పరిస్థితులు అనుభవించే వారో తెలియపరుస్తాయి. శ్రమ దోపిడి, తరాల తరబడి బానిసత్వానికి ప్రతీకలుగా నరసింహం, అతడి తండ్రి పాత్రలు వుంటాయి.

నీలకంఠం విషపు కాటుకు బలైన యశోదమ్మ పాతివ్రత్యం చెడిన స్త్రీగా, ఇల్లాలుగా వుండలేక బతికుండగానే తన ఫోటోకు తాను దండ వేసుకుని భర్తకు దూరంగా జీవించడం అనేది ఆమె ఆత్మాభిమానానికి ప్రతీకగా నిలుస్తుంది. అంతేకాక తప్పు చేశాననే అవమాన భారంతో కాకుండా తన ప్రమేయం లేకపోయినా తప్పు జరిగింది అనే నిజాయితీతో కూడిన ఆగ్రహం తనపై తానే వ్యక్తపరిచే పాత్ర ఆమెది. సీనియర్ నటి అయిన కె.ఆర్.విజయ యశోదమ్మ పాత్రలో అద్భుతంగా నటించారు. అంతేకాక ఊరు విడిచి వెళ్ళే సమయంలో తిరుమలదాసును వెంటపెట్టుకు వెళ్తున్నప్పుడు అతడి తల్లిదండ్రులతో ఆమె ఒక మాట చెప్తుంది. అది "యాగ రక్షణకు విశ్వామిత్రుడి వెంట వెళ్ళి రాక్షస సంహారం చేసిన రాముడు కూడా పసివాడే" ఆ మాట ద్వారా తిరుమలదాసును భవిష్యత్తులో నీలకంఠం లాంటి చెడు వ్యక్తుల పతనానికి ఆయుధంగా చెయ్యబోతున్నాను అనే విషయాన్ని చెప్పకనే చెప్తుంది.

చిత్రంలో హాస్యానికి సంబంధించి సాక్షి రంగారావు- శ్రీలక్ష్మిల భాగస్వామ్యంలో వచ్చే సన్నివేశాలు గిలిగింతలు పెడతాయి. డాన్స్, సంగీతం, మార్షల్ ఆర్ట్స్, భాషలు వంటి వివిధ కళలు, నైపుణ్యాలను నేర్చుకోవడానికి "ముప్పై రోజుల్లో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ఎలా?" లాంటి పుస్తకాలతో శ్రీలక్ష్మి కుస్తీపడడం దాని పర్యవసానంగా భర్త ఇబ్బంది పడే సన్నివేశాలు హాస్యాన్ని పుట్టిస్తాయి. చిత్రంలో మాటల విషయానికి వస్తే చాలా సన్నివేశాల్లో బలమైన విషయాన్ని వ్యక్తపరచ డానికి పురాణ, ఇతిహస విషయాలను సందర్భానుసారంగా వినియోగించారు. ఉదాహరణకు నీలకంఠం యశోదమ్మను బలాత్కారం జరిపిన తర్వాత మరునాడు ఆమె జరిగిన విషయాన్ని భర్తకు వివరించే సందర్భంలో "ఆనాడు భారతంలో కీచకుడు ద్రౌపదిని నాశనం చేసే ప్రయత్నంలో భీముడు అడ్డుపడకపోతే ఏం జరిగుండేది? అని భర్తను ప్రశ్నిస్తూ ఈనాటి భారతంలో ద్రౌపదిని నేను అని చెప్తుంది". దానికి ముందు దృశ్యంలో యశోదమ్మ ఇంట్లోకి నీలకంఠం వచ్చినప్పుడు జరిగే సంభాషణలో మనిషిలోని అన్ని ఉద్వేగాల్లాగానే కామం కూడా సహజ ఉద్వేగం అయినప్పుడు దాన్నెందుకు అందరూ అసహ్యించుకుంటారు అని నీలకంఠం యశోదమ్మను అడుగుతాడు. దానికి ఆమె స్పందిస్తూ మనిషి ప్రవృత్తికి, పశు ప్రవృత్తికి తేడా చెప్తూ "తల్లికీ- భార్యకీ తేడా వుంది అది తెలిస్తే మనిషి, లేకపోతే పశువు" అంటూ పరోక్షంగా పరస్త్రీలో మాతృత్వాన్ని చూడాలనే ఎరుకను కలుగజేస్తుంది. కె.విశ్వనాథ్ చిత్రాల్లోని సంభాషణలు సన్నివేశాను గుణంగా సార్వత్రిక సత్యాలను, ఉపదేశంతో కూడిన అంశాలను తెలియపరుస్తాయని చెప్పడంలో సందేహం లేదు.

ఈ చిత్రానికి సంగీతం కె.వి.మహదేవన్ అందించగా సాహిత్యం సినారె, సిరివెన్నెల, మాడుగుల నాగఫణి శర్మ అందించారు. "జోలాజో లమ్మజోలా జేజేలా జోలా" అంటూ సాగే పాట ఎన్ని సంవత్సరాలు గడిచినా శ్రవణానందదాయకమే. అంతేకాక "మహారాజ రాజశ్రీ" అంటూ చిత్ర ప్రారంభంలో వచ్చే పాటలో గంగిరెద్దుల కులవృత్తి వారి జీవనశైలిని చూపిస్తూ, గ్రామాల్లోని ప్రజల ఆచార, సంప్రదాయా లను వాటిని గౌరవించే తీరును దృశ్యీకరణ చేశారు దర్శకుడు. మరొక పాటలో తండ్రీకొడుకులైన హనుమద్దాసు- తిరుమలదాసు ఇరువురూ గౌరవం, ప్రేమతో పరస్పరం ఒకరినొకరు పొగుడుతూ, గంగిరెద్దుల వాయిద్యాలను వాయిస్తూ పాడేటటువంటి పాట **"కొలిచినందుకు నిన్ను కోదండరామా/ కోటీ దివ్వెలపాటి కొడుకూవైనావా"** అంటూ తండ్రి పాడితే, **"తలచినందుకు నిన్ను దశరథరామా/ వెండీ కొండలసాటీ తండ్రీవైనావా"** అంటూ కుమారుడు పాడతాడు. ఈ పాటలో తండ్రీకొడుకులిద్దరి ఆనందం, విజయ గర్వంతో కూడిన భావపరంపరలను వ్యక్తీకరణ చేసేలా రచయిత చేత రాయించుకోవడమనేది దర్శకుడి సృజనాత్మకతకు చక్కని నిదర్శనం. మొత్తంగా ఈ చిత్రంలో ఎనిమిది పాటలు వుంటాయి. యశోదమ్మ పాత్ర ద్వారా హరికథా గానం సందర్భాల్లో పురాణ, ఇతిహాసాలలోని వివిధ అంశాలను కూడా పాటల రూపంలో ప్రస్తావించారు.

యుద్ధంలో విజయమూ, వీరమరణం, విషాదం వుంటుంది. అదే విజయాన్ని యుద్ధమే లేకుండా సాధిస్తే ఇరుపక్షాల్లోనూ శాంతి వర్ధిల్లుతుంది. కాని అది సాధ్యం కావాలంటే "అహింసా పరమోధర్మః" అన్న నినాదం ఆచరణ మంత్రం కావాలి. ఆ నినాదం అందరి హృదయాల్లోనూ కొలువుదీరాలన్న సంకల్పంతో కె.విశ్వనాథ్ రూపొందించిన చిత్రమే ఈ "సూత్రధారులు".

**చలన చిత్రం : సూత్రధారులు**
**విడుదల : 1989 మే 4**
**తారాగణం : అక్కినేని నాగేశ్వరరావు, బానుచందర్, మురళీ మోహన్, కె.ఆర్.విజయ, సుజాత, రమ్యకృష్ణ, కైకాల సత్యనారాయణ తదితరులు**
**మాటలు : ఎం.వీ.ఎస్.హరినాథ్ రావ్**
**సంగీతం : కె.వి.మహదేవన్**
**కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : కె.విశ్వనాథ్**



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1 (53) హైదరాబాద్ నవంబర్ : 2022

# వ్యక్తిత్వ వికాస రేఖలు – దోరవేటి చె(అ)న్నయ్య లేఖలు

**సాగర్ల సత్తయ్య** ఫోన్ : 7989117415

తెలుగు సాహిత్యంలో కథ, నవల, పద్యం, పాట, వ్యాసం, నాటిక మొదలైన ప్రక్రియలు ఉన్నట్లే లేఖ కూడా ఒక విశిష్ట సాహిత్య ప్రక్రియగా గోచరిస్తుంది. సాధారణంగా కేవలం లేఖలు సమాచార మార్పిడి కోసం మాత్రమే కాకుండా విస్తృతమైన భావ ప్రసారానికి, సైద్ధాంతిక వ్యాప్తికి దోహదపడుతూ సాహిత్య గౌరవాన్ని పొందాయి. నెహ్రూ ఇందిర లేఖలు (కాటూరి వెంకటేశ్వరరావు తెలుగులోకి అనువదించారు), కనుపర్తి వరలక్ష్మమ్మ శారద లేఖలు, చలం కామేశ్వరికి రాసిన లేఖలు, బోయి భీమన్న జానపదుని జాబులు, గోపీచంద్ పోస్ట్ చేయని ఉత్తరాలు, సంజీవ్ దేవ్ రాసిన లేఖలు మొదలైన వాటి కోవలోనికి చెందినవే అ(చె)న్నయ్య లేఖలు.



కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా, నాటక కర్తగా, వ్యాసకర్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, సంగీత కారుడిగా, చిత్రకారుడిగా, కళాకారుడిగా విభిన్న రంగాలలో ప్రతిభను కనపరుస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి దోరవేటి. గొప్ప సామాజిక స్పృహతో రచనలు చేస్తున్న సాహితీవేత్త. అంతకుమించి సహృదయ సంపన్నులు. రంగారెడ్డి జిల్లా ధారూర్‌కు చెందిన దోరవేటి వరంగల్లు జిల్లా మొండ్రాయికి చెందిన మడత భాస్కర్‌తో ఒక పుష్కరకాలం పాటు జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలే ఈ అ(చె)న్నయ్య లేఖలు. దోరవేటి అసలు పేరు చెన్నయ్య. ధారూర్ పూర్వనామం దోరవేటినే తన కలం పేరుగా మార్చుకున్నారు. తాను పుట్టి పెరిగిన నేలపట్ల ఎంతటి మమకారం కనబరుస్తారో తన జీవితంలో తనకు తారసపడ్డ వ్యక్తుల పట్ల కూడా అంతే మమకారం కనబరిచే స్నేహశీలి దోరవేటి. మడత భాస్కర్ కూడా అంతే. ఆత్మీయతకు పర్యాయపదం. ఇక ఇద్దరి మధ్య భావప్రసరణకు వారధులుగా నిలిచిన ఈ లేఖలు ముందు తరాలకు ఒక గొప్ప స్ఫూర్తిని నింపుతాయి అనడంలో అతిశయోక్తి లేదు. గొప్ప సాహిత్య సాంస్కృతిక మానవీయ విలువల సమాహారం ఈ లేఖలు. సరైన మార్గదర్శకత్వం లేక జీవితపు నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి ఎటు వెళ్లాలో తెలియక దిక్కు తోచక ఉన్న స్థితిలో మడత భాస్కర్‌కు దోరవేటి తారసపడ్డారు. భాస్కర్‌లో అసమాన ప్రతిభా సంపత్తులను గుర్తించారు. ఆ దిశగా ప్రోత్సహించారు. పదవ తరగతి తప్పిపోయిన పిల్లవాడు పీహెచ్.డి. పట్టా తీసుకునే స్థాయికి ఎదిగాడంటే భాస్కర్‌లో ఉన్న పట్టుదలతో పాటు దోరవేటి లాంటి సన్మిత్రుల సాహచర్యం ఇందుకు దోహదపడి ఉంటుంది. ఈ లేఖలు వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తాయి. ఈ లేఖలు గొంగళి పురుగు సీతాకోకచిలుకగా మారిన పరిణామానికి సాక్ష్యంగా నిలుస్తాయి' (పుట12) అనే మడత భాస్కర్ మాటలు ఆయన వినయ సంపన్నతకు నిదర్శనం. తొలి లేఖలోనే దోరవేటి గారి కథా సంపుటాలు కాపాడే దేవతలు, నాన్నకు జేజే, గేయ సంపుటి హృదయ స్పందనలపై చక్కని సమీక్షా పూర్వకమైన అభిప్రాయాలను భాస్కర్ వెలువరించారు. తర్వాత కాలంలో వచ్చిన కానుక, అంజలి, నేస్తం శతకంతో పాటు వివిధ పత్రికలలో వచ్చిన కథలు, వ్యాసాలు, సీరియళ్లు మొదలైన వాటికి సంబంధించిన సాహిత్య చర్చలు అనేకం కనిపిస్తాయి. దీనివల్ల ఈ లేఖలకు సాహిత్య పరిమళం అద్దినట్లయింది. ప్రతిస్పందన లేఖలో దోరవేటి 'నీ లేఖ అందింది. నీ మనసులాగే అందంగా ఉంది. నీ పలకరింపులాగే ఆర్ద్రంగా ఉంది. నీ స్పర్శలాగే ఆత్మీయంగా ఉంది అంటూ తన ఆనందాన్ని ప్రకటించారు. అంతేకాదు మడత భాస్కర్‌లో వ్యాసరచనాశక్తి, విమర్శనా గుణం, భావవ్యక్తీకరణ నైపుణ్యం పుష్కలంగా ఉన్నాయని, అంతకు మిక్కిలి గొప్ప కథకుడు అయ్యే అవకాశం ఉందని భుజం తట్టి ప్రోత్సహించారు. మనలోని శక్తిని ఎదుటివారు గుర్తించినప్పుడు మనకు వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లు అవుతుంది. అట్లా మడత భాస్కర్‌లోని రచయితను తట్టి లేపారు దోరవేటి. కష్టాలకు కృంగిపోవద్దని, ఎదురీదాలని జీవిత పాఠాలు బోధించారు. మచ్చుకు ఈ వాక్యాలు చూడండి.

**"భాస్కర్! ఈ ప్రపంచంలో సకల కార్యాలకు కేంద్ర బిందువు సామాన్యుడు. మనం అతి సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వాళ్ళం. కన్నీళ్ల రుచిని, స్వేద పరిమళాన్ని కరువు తీరా అనుభవించిన**

**వాళ్ళం. అందుకే మన అనుభవాలు భావాలు అద్భుతమైన సాహిత్యావిర్భావానికి జీవం పోస్తాయి."** ఇట్లా సాగుతుంది ఆ లేఖ. వ్యక్తిని పరిపూర్ణుడిగా తీర్చిదిద్దే వ్యక్తిత్వ వికాస సోపానాలుగా ఈ లేఖలు దర్శనమిస్తాయి. డాక్టర్ ఎస్. రఘు అభిప్రాయపడ్డట్లు మొండ్రాయిలో చదువుకునే కాలంలో మడత భాస్కర్ పడ్డ కష్టాలు, మనోస్థైర్యంతో ఎదిగిన తీరు తప్పకుండా నేటి తరానికి చిరు పాఠ్యాంశమే. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో వైఫల్యాలు ఎదురైనా, వివాహానంతరం ధర్మపత్ని సహకారంతో మళ్లీ మొదలుపెట్టి పట్టు వదలని విక్రమార్కుడిలా ఏకకాలంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడమే కాక అత్యున్నతమైన పిహెచ్.డి పట్టా అందుకోవడం నిజంగా స్ఫూర్తి పాఠమే.

దోరవేటి రాసిన లేఖల్లో ఉత్తమ ఉపాధ్యాయుడికి ఉండవలసిన లక్షణాలను సందర్భానుసారంగా చర్చించారు. పౌరోహిత్యం వైపు వెళ్లాలనుకున్న భాస్కర్ ఉపాధ్యాయవృత్తి వైపు మళ్ళడానికి ఈ లేఖలు కూడా ఒక కారణమని భావిస్తాను.

"స్వచ్ఛమైన ప్రేమ, వ్యక్తిత్వం, బోధనారంగం పట్ల ఆసక్తి, పట్టుదల, చిత్తశుద్ధి ఉన్న నీవు ఉపాధ్యాయ వృత్తిలోకి రావడం భావితరానికి ఎంతో మేలు చేస్తుంది. నీలోన సుగుణాలన్నీ వృద్ధి చేసుకో, సృజనకు (రచన, సంగీతం, అధ్యయనం, నటన – ఇత్యాది కళలకు) పదును పెట్టుకో, విద్యార్థుల స్థాయిననుసరించి, వాళ్ళ పరిస్థితుల కనుగుణంగా నిన్ను నీవు మలచుకొని వాళ్ళ గుణవృద్ధికోసం శ్రమించు, Education is nothing but adjustment of every moment అనేది సత్యం. దాన్ని అనుసరించు అనునిత్యం." (పుట 58) అనే మాటలు ఇందుకు నిదర్శనాలు. ఈ మాటలు మడత భాస్కర్ ఒంట పట్టించుకున్నాడు. అందుకే అంతే వినయంగా

"ఉద్యోగంలో మీ ఆశయాలకనుగుణంగా నడుచుకునే ప్రయత్నం చేస్తాను. మీ బాటలో నడవడమే నేను చేయగలిగింది. ఉద్యోగ జీవితం సరదాగా, సంతోషంగా గడుస్తోంది. ఎదుటివారిలో మంచిని మాత్రమే చూస్తే అందరూ ఆత్మీయులే కదా! సహ ఉపాధ్యాయులు, మిత్రులు, ఇరుగు పొరుగూ... అందరూ మంచివారే ... ఎక్కడైనా చిన్న చిన్న లోపాలుంటే అవి నావేననుకుంటాను" అంటూ తన సహృదయాన్ని ప్రకటించుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ లేఖలన్నీ ఉటంకించదగినవే.

పుస్తక నిర్మితిలోనూ ఒక విభిన్నత కనిపిస్తున్నది. సాధారణంగా పుస్తకానికి ముందు మాటలు ఉంటాయి. కానీ ఉస్మానియా విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ ఎస్. రఘు రాసిన ముందు లేఖతో ఈ పుస్తకం ప్రారంభమవుతుంది. అలాగే కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ చివరి లేఖతో పూర్తవుతుంది. ఈ పుస్తకానికి ముద్రణ రూపం కల్పించిన వదాన్యులు చక్రవర్తుల రాధాకృష్ణారావు, సాహితీ వేదిక కన్వీనర్ రాష్ట్ర భాష ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్ గారి కొసమెరుపు కూడా లేఖ రూపంలోనే ఉండడం గమనార్హం. ఈ లేఖలు తెలుగు సాహిత్యానికి ఒక గొప్ప చేర్పు. సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి, వ్యక్తిత్వ నిర్మాణాన్ని ప్రోది చేసుకోవడానికి, ఆదర్శ ఉపాధ్యాయుడిగా రాణించడానికి ఈ లేఖలు చదవడం ఎంతైనా అవసరం. ఆత్మీయ మిత్రులు మడత భాస్కర్ గారికి హృదయపూర్వక అభినందనలు. మా అందరికీ అన్నయ్య దోరవేటి గారికి నమస్సులు.

# అనల గీతం



ప్రవహించలేనప్పుడు
ఎగిసి పడాలి
సముద్ర కెరటంలా ..!

విస్తరించ వీలు కానప్పుడు
ఆకాశమెత్తు ఎదగాలి
హిమవత్ పర్వతంలా ..!

నేలబారుతనం చేతకానప్పుడు
అమృత ధారవై కురవాలి
నేల రాలే వాన చినుకులా ..!

కొనమన్నది కొననప్పుడు
అస్తిత్వ నినాదమై నిలదీయాలి
నేల తల్లి ఆకాంక్షలా..!

వద్దు వద్దన్నది అమ్ముతున్నప్పుడు
బొగ్గుబాయిలా రగిలిపోవాలి
వెలుగు దీపం పిడికిలెత్తినట్లుగా ..!

ఆశలన్నీ అడుగంటినప్పుడు
ఆర్తి నిండిన అనల గీతంలా
విమోచనకు తలుపులెత్తాలి...!!!

**కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
ఫోన్ : 9440 233 261

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1 55 హైదరాబాద్ నవంబర్ : 2022

# షట్చక్రవర్తి చరిత్ర (ప్రబంధం) : ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారి వ్యాఖ్యానం – అనుశీలన

గురిజాల రామశేషయ్య, ఫోన్ : 70326 79471

తెలుగు పద్యం వేల యేండ్ల పంట. తెలుగు సాహిత్య చరిత్రలో "ప్రబంధ యుగం" తెలుగు పద్య శిల్ప రీతులకు పట్టుగొమ్మ. తెలుగుజాతి జీవన వికాస సంపదకు కల్పవృక్ష శాఖ.

తొలి తెలుగు ప్రబంధం "చిత్రభారతము "తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన చరిగొండ సీమ నుండి క్రీ.శ. 1503–1512 మధ్యకాలంలో వెలువడింది. ఓరుగల్లు రాజధానిగా హిందూరాజు సీతాపతిరాజు తెలంగాణ సీమలో రాజ్యపాలన చేసిన కాలమిది. చిత్తాపుఖాన్ – షితాబ్ ఖాన్ అనేది ఇతని బిరుదు నామం. ఖాన్ పదం ఇతడు ముస్లిం రాజేమో అనే శంకకు దారితీసినా అది సత్యంకాదు. ఇతని మంత్రి ధర్మపురికి చెందిన ఎనుములపల్లి పెద్దయామాత్యుడు. ఇతనికే చరిగొండ ధర్మన్న తన తొలి తెలుగు తొలిప్రబంధం చిత్రభారతం అంకితమిచ్చినాడు.

తొలి ప్రబంధం మని చెప్పబడుతూ వస్తున్న "మను చరిత్ర" (1522 తర్వాత)కంటె ముందుగానే వచ్చింది "చిత్ర భారతం" చరిగొండ ధర్మన్న గారి సత్యభామ శోకముఖ పద్యప్రభావం పారిజాతాపహరణం రచించిన తిమ్మన గారి సత్యభామ ముద్దు ముద్దు ఏడుపు పద్యం పై చెరగని ముద్రను కప్పేసింది. ఇట్లే అన్ని కావ్య, ప్రబంధాలలోని వేట వర్ణనలకు చరిగొండ ధర్మన్న రచనా మార్గమే తొలి అడుగు వేటపూజ. పూనిక పూజామార్గం. తొలి ప్రబంధం చిత్రభారతం (1503–1512) తర్వాత పైకెత్తి చూపదగిన ఉజ్జ్వలమైన మణుల వంటి కావ్య ప్రబంధ రచనలు ఎన్నో వెలువడినవి. అయితే తెలంగాణ నుండి 1501 తర్వాత వెలువడిన ప్రబంధాలకు కూడా పండితులు ఆదరణ పరిగణన దృష్టిలేక గత 19, 20 వ శతాబ్దాలలో ఎక్కువగా ప్రచారం జరుగలేదు. ఈ కారణంగా 1950 నుండి రూఢి పొందిన తెలుగు సాహిత్య చరిత్రలో కొన్ని విశిష్టత కలిగిన అందుబాటులోకి వచ్చిన రచనలు కూడా తగినంత ప్రచారం స్థలానికి నోచుకోలేదు.

'షట్చక్రవర్తి చరిత్ర' ప్రబంధం రాజా మల్లారెడ్డి (1703) రచన. బిక్కనవోలు రాజధానిగా మెదకు సీమ పరిసర ప్రాంతాలను సుదీర్ఘ కాలం పరిపాలించిన కామినేని కాచారెడ్డి నాలుగవ కుమారుడే రాజా మల్లారెడ్డి కవి శిఖామణి.

**'షట్ చక్రవర్తి చరిత్ర'** ప్రబంధం అద్భుతమైన కథా ఇతివృత్తానికి శబ్దాలంకారాలకు – ముఖ్యంగా శ్లేషాలంకార కావ్య శిల్పానికి, మనోహర శైలికి ఉదాహరణ ప్రాయం. అతి విశాలమైన చరిత్ర గల ఆరుగురు చక్రవర్తుల కథలకు ప్రబంధీకరణమే షట్చక్రవర్తి ప్రబంధం.

1. సత్య హరిశ్చంద్రుడు 2. నలుడు 3.పురుకుత్సుడు 4. పురూరవుడు 5. సగరుడు 6. కార్తవీర్యుడు అనే పేర్లు గల ఆరుగురు చక్రవర్తులనే షట్ చక్రవర్తులు అని ఒకేచోట చేర్చి చెప్తారు. ఒక్కొక్క చక్రవర్తి జీవిత చరిత్ర ఒక్కొక్క ప్రధాన ఆదర్శానికి కట్టుబడ్డ కథ అని తెలుస్తుంది. ఈ కథా ఘట్టాలను ప్రబంధ రచనా పద్ధతికి కుదించడానికి కవికి ఎంతో ప్రతిభ ఉంటే తప్ప సాధ్యం కాదు. కష్టసాధ్యమైన ఈ పనిని సుసాధ్యం చేసిన తెలంగాణ మహాకవి రాజా మల్లారెడ్డి.




ఎంతో పాండిత్యం గలవారు తప్ప షట్చక్రవర్తి చరిత్ర ప్రబంధాన్ని చదివి ఆనందించలేరు. ఇలాంటి ప్రౌఢ ప్రబంధాలను చదువు కోవటానికి వ్యాఖ్యానాలు ఎంతో అవసరం. అదృష్టవశాత్తూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు డా. బేతవోలు రామబ్రహ్మం గారి దృష్టిలో బలంగా నిలిచిపోయిన ఈ ప్రౌఢ ప్రబంధం వారి వ్యాఖ్యాన రచనతో ఇటీవల రెండు సంపుటాలుగా తెలుగు పాఠకుల చేతులలోనికి వచ్చింది. ఇది మొత్తంగా తెలుగు పండిత పాఠకులకు సువర్ణావకాశమని చెప్పక తప్పదు.

ఆచార్య బేతవోలు రామ బ్రహ్మంగారు హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖలో పనిచేసి రిటైర్ అయిన ఆచార్యులు. "షట్చక్రవర్తి చరిత్ర"ను చాలా ఇష్టపడి అత్యంత శ్రద్ధతో, తదేక దీక్షతో అతి తక్కువ కాలంలో 1060 పేజీల సముచిత వ్యాఖ్యానం రచించారు. తెలంగాణ రాజా మల్లారెడ్డి షట్చక్రవర్తి చరిత్రను రచించినందుకు

నేటి తెలుగు వాళ్ళు కూడా ఋణపడ్డారని, ఆ ఋణం తీర్చుకోవటానికే ఈ మనోహర ప్రబంధానికి తాను వ్యాఖ్యానం రాసి తీరాలని నిశ్చయించుకున్నానని ఎంతో వినమ్రంగా ఇష్టంగా మల్లారెడ్డి ప్రతిభకు కృతజ్ఞతగా చెప్పుకున్నారు. బేతవోలు రామ బ్రహ్మంగారి ఈ క్రింది పద్యాన్ని చిత్తగించండి మరి.

**కవివై మూడు మహా ప్రబంధములు వక్కాణించి చాంద్రీ మహా**
**ర్ణవ సంకాశము కీర్తి నందితివి మల్లారెడ్డి! ఆంధ్రాళి అ**
**ప్పువడెన్ నీకని దాని దీర్చుకొనగా వ్యూహించి వ్యాఖ్యాన వై**
**భవమ్ముం గూర్చితి నిట్టు లీ కృతికి యావత్పాఠకుల్ మెచ్చగన్ !**

షట్ చక్రవర్తి చరిత్ర ప్రబంధం తనను ఎంతగానో ఆకర్షిస్తేనో తప్ప ఇలా కృతజ్ఞత ప్రకటించగలరా! తనది వ్యాఖ్యాన వైభవం అని ధీమాగా చెప్పుకోగల రసజ్ఞ పండితుడు బేతవోలు రామబ్రహ్మం గారు మరి! అది సరియైన మాటే.

ఇలా వ్యాఖ్యానాలు రాసే వారిని "వ్యాఖ్యాతలు "అంటారు. ఒక పద్య కావ్య, ప్రబంధ గ్రంథాన్ని వ్యాఖ్యానించాలంటే వ్యాఖ్యాతకు కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉండాలి. మంచి లక్షణాలు రామబ్రహ్మం గారిలో పుష్కలంగా కుదురుబడి ఉండబట్టే కేవలం ఐదు నెలల పైచిలుకు రోజులలోనే తాము స్వీకరించిన షట్ చక్రవర్తి చరిత్ర మహాప్రబంధ వ్యాఖ్యానాన్ని పూర్తి చేయగలిగారు. ఇది ప్రశంసనీయమైన ప్రథమ విషయం.

**ఇక వ్యాఖ్యాతకు ఉండవలసిన పాండిత్య అంశాలు:**

1. పద్య వ్యాఖ్యానానికి చెందిన పద్య నిర్మాణపరమైన ఛందః శాస్త్ర విషయాలు, విశేషాలు ఛందో లయను పసిగట్టగలిగిన ప్రావీణ్యం ఉండాలి.

2. శబ్దాల సాధు-అసాధు నిర్ణయానికి చెందిన వ్యాకరణ శాస్త్ర సూత్ర పాండిత్యం, పూర్వ మహా కవులు ప్రత్యేక భాషాప్రయోగాలు జ్ఞప్తిలో ఉండాలి.

3. కావ్యానికి సమగ్ర శోభను సమకూర్చే శబ్దార్థాలంకార విశేషాలు సర్వంకషంగా(అన్ని అంశాలను రాచుకునేటట్టు) తెలిసి ఉండాలి.

4. పాత్రలకు చెందిన హావ-భావ- కవళికల స్పృహలూ- ప్రకటనలూ నాటకీయ సంభాషణా శైలికి చెందిన కాకుస్వర నవ రసాది సంబంధమైన సజీవమైన ఉచ్చారణ వైఖరులు, రస సంవిధాన శిల్ప రీతులూ : సుసూక్ష్మంగా కనిపెట్టగలిగిన ప్రతిభ ఉండాలి. లోకంలో ప్రచారంలో ఉన్న సంభాషణ శైలికి చెందిన సంతోషం, దుఃఖం, బింక, ఈసడింపు, జాలి, జోలి, కపటం, వెక్కిరింపు, ధిక్కార స్వరం మొదలైనవి పాఠకులకు తెలిసేటట్లు తాత్పర్య విశేషాల రచన చేయగలగాలి. విశేషాలు భాషా ప్రాంతాలవారీగా చెప్పగలగాలి.

5. వర్ణనలలో నగర, ఉద్యాన వన, నదీ ప్రవాహ, గంభీర సముద్ర దృశ్యాలతో కవి చెందిన తాదాత్మ్యం తానూ చెందగలిగి వివరించ గలగాలి.

ఇలాంటి వర్ణనల సందర్భాలలో కవి ఉపయోగించే రకరకాల ప్రత్యేక పదాల తీరుతెన్నులు పరిభాష అర్థ వివరణలు తెలిసి ఉండాలి. వర్ష, గ్రీష్మ, శరత్ మొదలైన ఋతువులలో మనుషులు అనుభవించే ఆయాస ప్రయాసలూ : ఆనంద ముగ్ధతల తన్మయతలూ ఇలా ఇలా సుఖ దుఃఖకర స్పర్శలను పరిశీలించుకొని భద్రపరచుకున్న మనోజ్ఞాపకాలు ఉండాలి.

6. కథా కాలము నాటి సామాజిక వ్యవస్థకు చెందిన సమగ్ర జీవితాన్ని ధర్మాధర్మ విచక్షణతో పరిశీలించి కవి సందేశ పూర్వకంగా అందించిన సూక్ష్మాంశాలను వివరించగలగాలి.

ఇలా షట్ సూత్రావళి (six points)గా వ్యాఖ్యానం ఉండాలనుకున్నా – ఒక్క చివరి మాటలో : కవి ప్రతిభా వ్యుత్పత్తులతో సరితూగే మరింకా చెప్పాలంటే కవి ప్రతిభను మరింత మెరుగుపరచి విడమరచి చెప్పే సూక్ష్మదృష్టి (micro vision) కలిగిన విమర్శకుడే "వ్యాఖ్యాత" అనే పిలుపుకు అర్హుడు అవుతాడు.

ఈ పై అర్హతలన్నీ ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి సమృద్ధిగా ఉండటం వల్లనే షట్చక్రవర్తి చరిత్ర ప్రబంధానికి 1060 పేజీల పెద్ద సైజు రెండు అచ్చు సంపుటాల వ్యాఖ్యానం రాయగలిగినారు. తమ కావ్యరసాస్వాదన వ్యాఖ్యానంతో ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారు మెదక్ బిక్కనవోలు దోమకొండ సంస్థానం రాజా మల్లారెడ్డిని పునరుజ్జీవితుణ్ణి చేశారు. ఇట్లా చెప్పటం వల్ల ఈ రోజుల్లో ఎవరికీ ఏమాత్రం సందేహం ఉండవలసిన పనిలేదు.

స్థల భీతి వల్ల చిత్ర వాక్య రచనకు చెందిన, ఏకాక్షర, ఏత్వముల పద్య రచనకు సంబంధించిన రెండు మూడు ఉదాహరణములతో పాటు కొన్ని అంశాలను దిగ్మాత్ర సూచనగా దిగువ అందిస్తున్నాను. ఆరుగురు చక్రవర్తుల కథాసంక్షేపణ నైపుణ్యం, కావ్య సందేశం అవగాహనమయ్యేందుకు స్పష్టంగా వివరించిన అర్థాలు, తాత్పర్య విశేషాలు రసజ్ఞ సభ్యసంస్కారం గలిగిన పాఠకులు తమకు తాముగా పఠించి తెలుసుకోవలసిందిగా మరో తప్పనిసరి సూచన చేస్తూ ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

**ఏత్వముల కందము :**
**కేవేదే దేలే దే**
**నేవేరే యెమ్మె హెచ్చె నేడే మేలే**
**తేవే వేవే నేనే**
**సేవే సేసేద దేసె జేజే జేజే!!**

అర్థం : మిత్రుడా! ఏదే నేనడిగింది అన్న తీరు సంభాషణ తెలంగాణ మాండలికం ... (గోదావరి జిల్లాలో ఏదిరా? అని గానీ, ఏదయ్యా? అని గానీ అంటారు) ఈ పద్యంలో మల్లారెడ్డి గారు ఈ మాండలికం సొగసును దేసిగా ఉపయోగించుకున్నారు. దేసి మనోహరము, అందమైనది అనే అర్థాలు ఇచ్చి కుమార సంభవం,

పండితారాధ్య చరిత్రల ప్రయోగాలు చూపింది తెలుగులో ప్రామాణికమైన సూ.రా. నిఘంటువు.

**ఏకాక్షర కందము :**

**నానాన నేన నిన్నే**
**నేనెన్నిన నెన్న నున్న నేనా! నానా**
**నైనా! నానన నేనును**
**నానన నీ నానన నిన ! నా నున్నేనిన్**

శ్రద్ధగా 274, 275 పేజీలను చూసి అర్థాలు వివరణలూ తెలుసుకోవాలని ప్రోత్సహిస్తూ...

నానార్థాల పదాల యమకాలంకార జ్యోత్స్న లోకి ఆహ్వానం పలుకుతున్నాను. పున్నమి వెన్నెల్లో మల్లెలను ఒకటొకటిగా రెండు రెండుగా అందించిన తీరుకు పరిమళం వ్యాఖ్యానం ఆఘ్రాణించండి.

**కవిత్వం నిజం : పగలే వెన్నెల**

సీ. "గోపురగోపుర గోపుర ప్రతిమంబు
కల్పద్రుకల్పద్రు గౌరవంబు ..."

అర్థం : అయోధ్యపుర వర్ణన . గోపుర = కోటగుమ్మాలతోనూ (నాలుగు వైపులా నాలుగు బురుజులూ, ద్వారాలు ఉంటాయి), గోపుర = గృహ ద్వారాలతోనూ, గో-పుర = గోలోక రాజధాని పట్టణంతో, ప్రతిమంబు = సాటి వచ్చేది . కల్పద్రు - కల్ప = కల్పవృక్షాలతో సమానమైన , ద్రు = వృక్షాల, గౌరవంబు = ఆధిక్యం కలది. (గోపురం ద్వారి పూర్ద్వారి కైవర్తీయముస్తకేపి చ - మేదిని. పురద్వారం తు గోపురం - అమరం. కల్పవ్ అనేది తుల్యార్థక ప్రత్యయంగా పాణినీయం విధించింది . ఈషదసమాప్తౌ కల్పబ్దేశ్య దేశీయరః) పలాశీ ద్రు ద్రుమాగమాః - అమరం )

ఇంత గొప్ప బహువిధ శ్లేష సమాస సంభరిత ప్రబంధమైన "షట్చక్రవర్తి చరిత్ర" ను వ్యాఖ్యానం చేశారు బేతవోలు రామబ్రహ్మం గారు. మహా పండితులకే సాధ్యమిది. కావ్యాలూ ప్రబంధాలూ వాటి వ్యాఖ్యానాలూ ప్రచురించే వారే కనబడని ఈ రోజుల్లో శ్రీరాఘవేంద్ర పబ్లికేషన్స్ విజయవాడ-12వారు రెండు మనోహరమైన సంపుటాలు ప్రకటించడం సాహసమే, ఇందుకు వారికి మరి మరి అభినందనలు.

**1060 పేజీలు గలిగిన రెండు సంపుటాలు**

**వెల : 1350/-**

**ప్రతులకు : (0866) 6889999, 91 94928 75959,**

# బ్రహ్మజెముడు

జన్మము బంధాలకిచ్చి
కర్మము కాలానికి వదిలేసి
కలలను కన్నీళ్ళలో ముంచి
యతిలా శిలవైనది నీవేనా...?

యుగం చాటున మొలిచిన
బ్రహ్మజెముడు మొక్కవు
రాతి పలకలపై మ్రోగిన సవ్వడి చెణుకువు
బలహీనమైన ఊహలతో
బానిసత్వపు జీవ చలనములతో
సోలుతూ నడుస్తున్నావే
ఏమి కన్నావు... ఏమి పట్టావు...ఏమి నేర్చావు
ఎటువైపు వెళ్ళావు....
చూస్తూనే ఉన్నావుగా కాలం
జీవితాన్ని చెదపురుగులా కొరుక్కు తింటూనే ఉంది
వయసు రెక్క విప్పుతున్న
తరుణం నా పాల సముద్రపు పడవ ప్రయాణాన్ని
సమాజపు అగి పవనాలు కాళరాత్రిలో
ఇరుకు గుహలోకి తోశాయి. కాదనను
మరోజన్మలో మరో జీవితం
పూలబాటకు తలుపులు తెరుచుకున్నాయా....
మరేమిటి...?
ఈ ఎడారి ఇసుకపై కప్పగంతులు
బూడిద కుప్పలపై కూర్చొని ఎందుకీ వికటాట్టహాసాలు
జీవితాకాశాపు ఇంద్రధనుసు వర్ణాలు ఇక
అందంగా పూయవనుకుంటే ఎలా...?
లే... లేచి చూడు ... చూపు తిప్పకు
ఎందుకీ కమురు వాసనల స్మశానాన్ని
అంటిపెట్టుక నిలుచున్నావు.
అలిగి ఊరుకుంటే ఆగునా ఆకలి...
కాలాన్ని తిట్టుకుంటే / కత్తిగాటు తప్పునా జీవితానికి
నీ విన్న ఎవరిపాలైందో కానీ
నేడును గట్టిగా పట్టుకో.... రేపు నీదై తీరుతుంది.

**డాక్టర్ కందుల శ్రీను**
**నల్లగొండ, ఫోన్ : 965 267 4834**

# తెలుగు పరిశోధన గ్రంథాల 'సారాంశం'

**డా. టి. శ్రీరంగస్వామి**, ఫోన్ : 994 985 7955

మన తెలుగు సాహిత్యము ఎంతో విశిష్టమైనది, విశాలమైనది. భారత, భాగవత, రామాయణ, ప్రబంధాలు, కావ్యాలు, పురాణాలు, ఛందస్సు, జానపదం, కవిత్వం, కథ, నాటక ఇలా ఎన్నో అంశాలు. ఈ అంశాలను మూల్యాంకనం చేయడం, అందులోని నిధులను తవ్వి మనకు కొత్త మార్గాలను, విషయాలను అందించడం అనేది ఒక పరిశోధన. ఆ పరిశోధన అంటే ఆయాన కృతులలోని అంతర్ రహస్యాలను వెలికితీసి మనముందుంచడం. వేదం వేంకటరాయశాస్త్రి గారు ఆముక్తమాల్యదకు అందించిన 'సంజీవనీ వ్యాఖ్య'. ఇదొక పరిశోధన. మానవల్లి రామకృష్ణ, బండారు తమ్మయ్య, సురవరం, బాలేందుశేఖరం, ఖండవల్లి లక్ష్మీరంజనం లాంటివారు స్వచ్ఛందంగా పరిశోధనలు చేసి కొత్త కొత్త అంశాలను తవ్వి మనముందుంచారు. బంగోరె, జి.వి. సుబ్రహ్మణ్యం, కోవెల సంపత్కుమారాచార్యుల (ఛందో వికాసము) లాంటి వారితో పాటు సమకాలీనులు ఎందరో పరిశోధన పట్టాలకు అతీతంగా మూల్యాంకనమును చేస్తూ అమూల్య గ్రంథాలను అందిస్తూనే ఉన్నారు.

ఉన్నత విద్య కోసం, ఉద్యోగాల కోసం అధికారిక డాక్టరేట్ పట్టా నిమిత్తం పరిశోధన చేయడం మరొక పార్శ్వం. ఈ పరిశోధనలు విశ్వ విద్యాలయ పరిధిలో పర్యవేక్షకుడి నేతృత్వంలో జరుగుతవి. తెలంగాణాలో ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదటిది. రెండవది కాకతీయ. తెలుగులో వచ్చిన మొదటి డాక్టరేట్ పట్టా 1956లో. బిరుదురాజు రామరాజుగారి 'తెలంగాణ జానపద గేయ సాహిత్యము'. ఇది 1958లో అచ్చైనది. ఇది ఉస్మానియా విశ్వవిద్యాలయమునకు ఖండవల్లి లక్ష్మీరంజనం గారి పర్యవేక్షణలో సమర్పించబడినది.

కాకతీయ విశ్వవిద్యాలయంనుడి తొలి డాక్టరేట్ పట్టాను కోవెల సంపత్కురాచార్యులుగారు **'ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ - సాంప్రదాయిక రీతి'** అను అంశముతో పరిశోధించి సమర్పించి నారు. ఈ పరిశోధనకు పర్యవేక్షకులు కేతవరపు రామకోటిశాస్త్రిగారు. 1976లో పట్టా అందుకున్నారు. 1981లో ఇది అచ్చైనది. ఇలా నాంది పడిన పరిశోధనా పట్టాలు సుమారు 5,6 వందలుండవచ్చును. దీనిని గమనించే వెలుదండ నిత్యానందరావు **"విశ్వ విద్యాలయాలలో తెలుగు పరిశోధన"** పేరుతో 1956 నుండి 2013 వరకు వచ్చిన యం.ఫిల్, పిహెచ్.డి పట్టానన్నిటిని గ్రంథస్థము చేసారు. ఇందులో 5 వేలపై చిలుకు నమోదు చేసారు.

డాక్టరేట్ పట్టా పొందిన అచ్చైన పరిశోధన గ్రంథాలను పరిగణనకు తీసుకుని డా. అట్టెం దత్తయ్య ఒక ప్రణాళికను సిద్ధ చేసుకున్నాడు. ఆ ప్రణాళిక ఏమిటంటే తెలంగాణలోని విశ్వ విద్యాలయాల నుండి వచ్చిన పరిశోధన (డాక్టరేట్)ల సారాన్ని ఒకదగ్గర అందిస్తే అది పదుగురికి ఉపయోగపడడమే కాకుండా, ఆయ పరిశోధనలను ఒక దగ్గర చదువుకునే అవకాశంతో పాటే ఏయే అంశాలపై పరిశోధన జరిగిందో కూడా తెలుస్తుంది అనుకున్నాడు ఆయా పరిశోధనలను మూల్యాంకనము చేయించితే బాగుంటుందని ఆలోచించి 2019 తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డిగారిని సంప్రదించగా ఆమోద ప్రోత్సాహమును అకాడమీ తరపున ప్రచురిద్దామని చెప్పారు.

డా. అట్టెం దత్తయ్య ఆయా పరిశోధనలపై సమ్యవేక్షణ చేయగల సుహృన్మూర్తులను సంప్రదించి వారి నుండి వ్యాసాలను రాబట్టుకుని 'సారంశం" రెండు సంపుటాలుగా 1216 (608 + 608) పుటలతో వెలువరించారు. ఈ గ్రంథాల వెలుగుకు ఆర్థిక చేయూతను అందించిన కరీంనగరం జిల్లా అమ్మాపురం మండల వాస్తవ్యులు, ఎన్.ఆర్.ఐ. శ్రీ దుండె లక్ష్మణ్‌గారి సుహృదతను మనమందరితో పాటు, తెలంగాణ సాహితీలోకం కూడా గుర్తుంచుకుంటుంది. అభినందిస్తున్నది. మన సంకల్పము, స్వచ్ఛతరి అయిత అది ఎలాగో అలా ఫలిస్తుందంటే ఇలా అన్నమాట. ఒక్కొక్క సంపుటంలో 55 వ్యాసాలు. మొత్తం 110 వ్యాసాలతో పరిశోధన సారాలు సాహితీలోకంలోకి వచ్చినవి. ఈ వ్యాసాలు బిరుదురాజు రామరాజుగారి పరిశోధన నుండి తాళ్ళపల్లి యాకమ్మ వరకు చోటు చేసుకున్నది.

సారాంశం -1లో ఉస్మానియా విశ్వవిద్యాలయం - 47, కాకతీయ విశ్వ విద్యాలయం - 8 = మొత్తం 55

సారాంశం - 2లో ఉస్మానియా విశ్వవిద్యాలయం 33, కాకతీయ విశ్వ విద్యాలయం - 13, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం - 4, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం - 2, శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం - 1, మద్రాసు విశ్వ విద్యాలయం- 1, ద్రవిడ విశ్వ విద్యాలయం - 1 = మొత్తం 55.

ఈ సారాంశం రెండు సంపుటాలు తెలంగాణాకే పరిమితము అన్నప్పటికీ తెలంగాణేతర విశ్వ విద్యాలయాలయిన శ్రీకృష్ణదేవరాయ, మద్రాసు, ద్రవిడ విశ్వవిద్యాలయాలలోని పరిశోధనలు, తెలంగాణకు సంబంధించిన సినారె, తెలంగాణ సాహిత్యం, ప్రభావాలు - పరిణామాలు, బోయ జంగయ్య సాహిత్యానుశీలన అంశాలు అవడం వలన చోటు కల్పించారు. డా. అట్టెం దత్తయ్య పరిశోధను సంబంధించిన 'జి.యస్. మోహన్' పరిశోధన స్వరూప స్వభావాలు' పుస్తకమును ఇందులో చేర్చి భావి పరిశోధకులకు మార్గదర్శకత్వమును చేసి సుకృతులుగా నిలబడినారు. ఇందుకు దత్తయ్య అభినందనీయుడు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 1 59 హైదరాబాద్ నవంబర్ : 2022

'సారాంశరోచనం' శీర్షికతో అట్టెం దత్తయ్య రాసిన ముందుమాటల్లో 'ప్రతి పరిశోధనా గ్రంథం వెనుక కొన్ని సంవత్సరాల శ్రమ ఉంటుంది. పరిశోధకుల పరిశ్రమ, పర్యవేక్షకుల పరిశీలన, మరికొందరు ఆచార్యుల అంగీకారాలు, విశ్వ విద్యాలయం గుర్తింపు ఉంటుంది. ఇలా వచ్చిన పరిశోధనలు వేలకొలది అయినప్పటికీ కొన్ని మాత్రమే అచ్చుగ్రంథాలుగా రూపుదిద్దుకుంటాయి. పరిశోధన సమయంలో ఆలోచనలకు అవధులు, పరిశోధనాంశానికి పరిధులు, పర్యవేక్షకుల దిద్దుబాటులు, కాలపు పరిమితులకు లోబడి పరిశోధనా గ్రంథం నిర్మించబడుతుంది. కొన్ని గ్రంథాలు ముద్రణకు వెళ్ళేముందు స్వేచ్ఛగా విశాల దృక్పథంతో విస్తృతపరచబడుతాయి. కొన్నిటికి శీర్షికలు సింగారించబడుతవి. మరి కొన్నిటి అధ్యాయాల రూపురేఖలు మార్చబడుతాయి. మొత్తంగా పరిశోధన గ్రంథం కొంతైనా వినూత్నీకరించబడుతుంది. అందుకే సారాంశం 1& 2 ప్రచురించిన గ్రంథాలకే పరిమితమయ్యాను. మరికొన్ని ప్రసిద్ధి గ్రంథాలకు సంబంధించిన వ్యాసాలను వ్యాసకర్తలు అందించలేకపోవడం వల్ల ఇందులో చేర్చడానికి వీలు పడలేదు" అని చెప్పుకొన్నారు.

ఈ సంపుటాలలోని సిధారెడ్డి, భిన్నూరి మనోహరిగారల మాటలు అందరూ తప్పకుండా గుర్తు పెట్టుకోవలసి ఉంటుంది. "పరిశోధన" పదమే చాలా అద్భుతమైనది. పవిత్రమైనది. అసలు పరిశోధన అనేది ఎందుకు చేస్తారు? ఒక నూతన అంశాన్ని గూర్చి పూర్తిస్థాయిలో లేదా తమ పరిధిలో ఉన్న అవకాశాలను వినియోగించుకొని పూర్వపు సిద్ధాంతాలను, లేదా పరిశీలనలను సమన్వయం చేయడం లేదా దానికి భిన్నమైన వాదాన్ని తెలుపడానికి చేసే పరిశ్రమే పరిశోధన. ఒకవేళ కొత్త అంశాన్ని ప్రతిపాదిస్తే తత్సంబంధ విషయాలు, ఉపమానాలు (ఉదాహరణలు కాదు) చెప్పడం వల్ల పరిశోధనకు కొంత బలం చేకూరుతుంది. పరిశోధన అనేది ఒక పవిత్రమైన కార్యం. ఎంపిక చేసుకున్న అంశానికి లభించిన ఆధారాలను జోడించి, తన స్పష్టమైన అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా వివరించడం పరిశోధనలో ప్రధాన అంశంగా మనం గమనించాలి. పూర్వపు పరిశోధనలు చేసిన వారు పాటించిన నియమాలు, పరిశోధనా పరిధి, లక్షణాలు, వాటిని కొన్నిసార్లు స్వయంగా ఏర్పరచుకొని ముందుకు కొనసాగినారు. అంశం తిరిగి తిరిగి ఆయా కోణాల్లో చర్చించవలసి వచ్చినప్పుడు మొదటివారిని సమర్థిస్తూనో, వ్యతిరేకిస్తూనో చెప్పవలసిన అవసరం ఉంటుంది. అందుకే పరిశోధన నిరంతరం కొనసాగేది. కొనసాగుతుంటుంది" (భిన్నూరి మనోహరి, సారాంశం - 2, పుట 23)

ఆరు దశాబ్దాల పరిశోధనల నుంచి ప్రచురితమైన గ్రంథాల నుంచి ఎంపిక చేసిన పరిచయాలు భావి పరిశోధకులకు మార్గదర్శనం చేయటంలో కొంతయిన తోడ్పడుతాయని ఈ సంపుటాలు ఉపయోగ పడుతవని చెప్పవచ్చును. ఈ సంపుటాలలోని వ్యాసకర్తలు అనుసరించిన విధానమును పరిశోధక విద్యార్థులు గమనిస్తే ఆయా గ్రంథాలను ఏవిధముగా అనుశీలించవచ్చునో తెలుస్తుంది.







భిన్నూరి మనోహరిగారు ఇదే ముందు మాటలో **"ఈ రెండు సారాంశ గ్రంథాల వల్ల ఏమిటి ప్రయోజనం అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఏ అంశం మీద పరిశోధన ఎవరు చేసారన్నది ప్రాథమిక అంశం. అదేవిధముగా ఆయా పరిశోధక గ్రంథాల మీద వ్యాసాలు రచించిన రచయితలు గ్రంథాన్ని ఎలా విశ్లేషించారు? సిద్ధాంత వ్యాసంలో పరిశోధకులు అనుసరించిన విధానం, అందులో ఉన్న మంచి చెడలను ఎట్లా వివరించారు? ఒక సిద్ధాంత గ్రంథాన్ని కొని సమీక్ష చేస్తే ఒక్కొక్కరిది ఒక్కో కోణం, మార్గం ఉంటుంది. 110 పరిశోధన గ్రంథాలపై రాసిన ఈ వ్యాసాలు విద్యార్థికి ఎన్నో కోణాలు తెలుపుతాయి. కాబట్టి విద్యార్థులందరికి ఒక గ్రంథాన్ని ఏవిధంగా సమీక్షించవచ్చో తెలుసుకోవడానికి సారాంశం 1 & 2 సంపుటాలు ఉపయోగపడతాయి"** అని అంటారు.

డా. అట్టెం దత్తయ్య చేసిన ఈ బృహత్తర కావ్యం ఏదైనా సంస్థ చేయవలసినది. ఈ రెండు సంపుటాల ప్రచురణతో తెలుగు సాహిత్య చరిత్రలో అట్టెం దత్తయ్య, దుండె లక్షణ్‌గారు తమదైన ముద్రతో కలకాలం నిలిచిపోతారని ఘంటాపథంగా చెప్పవచ్చు. రెండు సంపుటాలలోని 110 ఆ వ్యాసాలను ఇక్కడ ఉటంకించాలి. ఉన్న స్థలాభావం అడ్డువస్తుంది. మూడవ సంపుటం తెచ్చిన పక్షములో 'పుస్తక పరిచయం, సమీక్ష, వ్యాసం, విమర్శ, మూల్యాంకన విమర్శ మొదలగు అంశాలపై ఒక వ్యాసమును చేరిస్తే భావి తరాలకు ఉపయోగపడుతుంది. ఇది కేవలం పుస్తక పరిచయం మాత్రమే కాదు నలుగురికి తెలియాల్సిన అవసరము కూడా.

**సారాంశం 1& 2 సంపుటాలు**
**ఒక్కో సంపుటం 360/-**
**ప్రతులకు : అట్టెం దత్తయ్య, 9494715445**

# దివ్య దీపావళి ...!



చెడును దునిమి మంచి చెన్నొందువేళను
మానవత మమతలు మదులనిండి
సవ్యమైన భావ సంతసంబులిలను
దివ్వెలిడెడి కాంతి దివిని మించు !

మంచిగుణములన్ని మనలోన నిండగ
పండుగవును రోజు పంతముడిగి
దివ్యమైన సుగుణ దీపావళీయౌను
మనములన్ని వెలుగు మయములేను !

నరుడు, నరకుడయ్యు నయవంచనలున్న
నాటినుంచి చూడ నయముగాను
తెలుసుకున్ననాడె తెలివైన పర్వమౌ
తలపులన్నికూడ తన్మయంబు !

వేనవేలు కలరు వెలదుల మానమ్ము
ప్రాణములనుదీయు పాపులిలను
వారుచచ్చునాడె వచ్చు దీపావళీ
నిత్య సత్యమదియె నిర్మలంబు !

భయము చెందు స్త్రీలు ధైర్యముతోడను
సత్యభామవోలె సాహసాన
నరనరకులనిల నమ్మించి వధజేయ
నవ్యదీపకాంతి నవ్వులొలుకు !

దంపతులును కల్సి భక్తితో గౌరమ్మ
నోములన్ని బహుగ నోచురోజు
బూరెలన్ని చేసి భూరినైవేద్యము
లర్పణంబుజేతురమ్మకిలను !



నేటి దివ్వెలన్ని నెనరుగ జ్ఞానమ్ము
నిచ్చి యింటియందు యింపులిడుచు
పంచభక్ష్యములను పరగ క్షుత్తునునింపి
చిచ్చుబుడ్లసడులు చిన్మయంబు !

బాలబాలురంత బహుజాగురుకతతో
బాణసంచలన్ని భళి! యనుచును
కాల్చ జిలుగులన్ని కన్నులపండుగై
వత్సవత్సరాది వచ్చుదీప్తి !



ధీరతనముచూపు దివ్వెల పండుగ
చేసి తీరవలయు చేతులార !
ఆడపడుచులంత నానందమును పొంది
దీవెనంబులింటి దివ్వెలగును !!

**డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి**
మహబూబ్‌నగర్, ఫోన్ : 8555899493

**శిలాక్షరం**
**(బి.ఎస్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**
(ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎస్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.
సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-




సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177






**అక్షరధార (సాహిత్య వ్యాస సమాహారం)**
గన్నమరాజు గిరిజామనోహర బాబు
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత, 2-11-501/5, విజయనగర్ కాలనీ, హనుమకొండ, తెలంగాణ - 506 009.
ఫోన్ : 99490 13448






**మూడో కంటిచూపు (కవితా సంపుటి)**
రఘువర్మ (డా. టి. లక్ష్మీనారాయణ)
వెల : 100 /-
**ప్రతులకు :** రచయిత, 3-1-264, పురానీపేట, గాజుల పోచమ్మ వీధి, జగిత్యాల - 505 327.
ఫోన్ : 92900 93933




**అక్షర నేత్రాలు (కవిత్వం)**
ఎన్. లహరి
వెల : 100/- **ప్రతులకు :** రచయిత్రి, ఫ్లాట్ నెం. 301, శ్రీరాం హెూమ్స్, ఫేస్ -4 కాలనీ, వనస్థలిపురం, హైదరాబాద్ - 500070. ఫోన్ : 9885535506





**తెలుగు బిడ్డ శతకము**
**తత్త్వబోధ**
**సత్తిబాబు శతకము**
- కవిశ్రీ సత్తిబాబు
వెల : 150 /- (మూడింటికి)
**ప్రతులకు :** రచయిత, బ్లాకు నెం. 14, ఫ్లాట్ నెం. 102, ప్రజై సిటీ, ఆల్విన్ కాలనీ ఎదురుగా, మియాపూరు, హైదరాబాద్ - 500 049.
చరవాణి : 801 912 1097 / 939 782 5011



**శుభకృత్తంతయు మేలే జరుగును (మకుట సహిత గేయాళి)**
- వరిగొండ కాంతారావు
వెల : అమూల్యం.
**ప్రతులకు :** రచయిత, 'ఆదిత్య' 35-5-220, జీవనమిత్రా నగరు, విద్యారణ్య పురి, హనుమకొండ - 506009.
ఫోన్ : 94418 86824

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# వెలికుండ

వెలివాడ పిల్లాడు తాకిన కుండని
అతను తాకి మలినమైన కుండని
పెంకులు పెంకులుగా విరగ్గొడుతున్నాను
ఈపూట నన్నెవడు ఆపుతాడో చూస్తాను
శ్రమకి సహజత్వానికి చిహ్నమైన కుండని
మట్టి చేతుల్లో పుట్టిన నల్లసూరీడిని
పెంకులు పెంకులుగా విరగ్గొట్టకపోతే
ఈ పూట నిద్రలేదు
సిగ్గులేని కుండ నెత్తురు చచ్చిన కుండ
కుండని పెంకులు పెంకులుగా పగలగొట్టిగాని
నిద్రపోను
అతనిది వెలిదాహమని చెప్పడానికి
చుట్టూ వున్న దిక్కుమాలిన అక్షరాలే సాక్ష్యం
విరిగిన పెంకుల్లో విరిగిన బతుకుల్లో
విరిగిన కన్నీళ్లు
కన్నీళ్లను చూస్తూ చూస్తూ కలవరం కలవరంగా
బతకలేను
చేతులు కట్టుకుని మౌనంగా నిల్చోలేను
పగలగొట్టడమే.. నిప్పులు మండించినట్టు..
ఎత్తిన చెయ్యిని మరింత రాజెయ్యడమే
పరమోత్కృష్ట విద్య
కుండని పగలగొట్టే తీరుతాను
కుండ విరిగినట్టే కుండని చేసిన చేతుల కన్నీళ్లూ
విరిగి విరిగి విముక్తిచెందే వరకు
ముక్కలుముక్కలుగా చెదరగొడతాను
విరిగిన కన్నీళ్లు విరిగినట్టే ఆగిపోవు
మళ్లీ అతుక్కునేదాకా కుండను పగలగొట్టడమే
నా విధి
వెలివాడ పిల్లాడు నూతుడు నీళ్లను కోరుకోలేదు
సరస్సులనూ కలగనలేదు
ఉద్యానవనాలనూ కావలించుకోలేదు



ఉద్యానవనమని చెప్పే బడిలోకొచ్చాడు
బడిలో చీడపురుగులుంటాయనుకోలేదు
విషం చిమ్మే నాగులుంటాయనుకోలేదు
ఇవేమీ తెలియని పిల్లాడు కుండని తాకాడు
కాసిన్నంటే కాసిన్ని నీళ్లతో గొంతు
తడుపుకోవడానికి
మిగిలిన పిల్లలలాగే కుండని తాకాడు
మట్టిచేతుల్లోనే పుట్టిన నల్లసూరీడిని తాకాడు
కుండని తాకడం నీళ్లను తాగడం తప్పని తెలీదు
నాగుపాము విషం చిమ్మింది
ఆవంలో కాలి కాలి ఓపిక పట్టడం కుండకి
అలవాటైపోయినట్టుంది
కుండని చేసిన చేతులు తెగించి తిరగబడి
వెలివాడ పిల్లాడి లేలేతదాహాన్ని తీర్చడానికి
సమ్మె కట్టే దృశ్యాన్ని చూడాలని తహతహ
పిల్లాడిని వెలేసిన కావరమెక్కిన చేతుల్లో
ఇమిడిన కుండ వాడినే వెలేసే రోజులు రావాలి

**చంపావతి**
ఫోన్ : 967 649 3680


LEARN
PLAY
EXPLORE
30 YEARS
Glorious Service to Social Progress.
UPGRADED TO
CBSE
Senior Secondary School
Pre-Primary, Primary School
• Optimum class strength
• Child-friendly teaching by skilled teachers
• Safe educational toys to stimulate learning
• Activities include vocabulary enrichment, life skills, storytelling and acting.
• One-to-one attention
• Physical exercises, dance, singing, aerobics & field trips
• Regular Parent - Teacher interaction
Middle & High School
• Optimum class strength
• Well-qualified and trained teachers
• State-of-the-art AV hall and labs
• Visual and Performing arts
• Well stacked Library
• Monthly Parent-Teacher interaction
• A good ground preparation of competitive & common entrance exams
• Yoga and Meditation for Physical & Mental balance
We impart education by integrating proven, world-class teaching methods with modern infrastructure and technology.
AI School
The latest pedagogy in classroom teaching
Estd-1989
SISTER NIVEDITA SCHOOL
CBSE - Senior Secondary School
Class I to XII
THE PLAY SCHOOL ®
Kindergarten Wing of SNS
Nursery, LKG & UKG
CBSE Affiliation Code: 36300400
# D.K.Road, AMEERPET, Hyderabad-500 016. Ph.: 040-2373 1518, 4230 1518,
Mobile: +91 80967 38855, E-mail:snschoolamp@gmail.com
For Your Child's Bright Future...
www.snschool.com